

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18+20 వెల: ₹ 5.00
సంపుటి: 10 సంచిక: 296
బుధవారం 17-1-2018
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కష్టాల్లో భారత్
దక్షిణాఫ్రికాతో రెండో టెస్టులో లక్ష్యం 287; ప్రస్తుతం 35/3
- స్పోర్ట్స్‌లో



55 పైసలు క్షీణించిన రూపాయి
64.04 వద్ద ముగిసిన డాలర్‌తో రూపాయి మారకం విలువ
-14లో

2013 సెప్టెంబర్
అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు బ్యారెల్ ధర
- సుమారు రూ.7,200 (113 డాలర్లు)
హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర
- రూ.83.07 ; డీజిల్ ధర రూ.58.67

2016 జనవరి
అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు బ్యారెల్ ధర
- సుమారు రూ.2,048 (32 డాలర్లు)
హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర
- రూ.60.63 ; డీజిల్ ధర రూ.54.40

2018 జనవరి
అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు బ్యారెల్ ధర
- సుమారు రూ.4,416 (69 డాలర్లు)
హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర
- రూ.75.47 ; డీజిల్ ధర రూ.67.23

పెట్రో మంటలు


రోజురోజుకూ పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు

- దేశంలో అత్యధిక పెట్రోల్ ధరలో రెండో స్థానంలో తెలుగు రాష్ట్రాలు.. డీజిల్ ధరలో టాప్
- చమురు ఉత్పత్తులపై సగానికిపైగా పన్నులే
- కేంద్ర, రాష్ట్రాల పన్నులు, సుంకాలతో భారం
- అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడల్లా పన్నుల పెంపుతోనే సరి
- ధరలు పెరిగినప్పుడు మాత్రం మోత జనంపైనే
- కొద్దిరోజులుగా భగ్గుమంటున్న ముడి చమురు ధరలు
- దాంతో దేశీయంగా ధరలు పెంచుతున్న సంస్థలు
- గగ్గోలు పెడుతున్న వాహనదారులు

సాక్షి, హైదరాబాద్

అవి పైసలే.. రోజూ కొన్ని పైసలే.. అసలు మనం లెక్కలోకి తీసుకోని పైసలే.. కానీ పైసలు పైసలు కలసి రూపాయలై బండెడు బరువుగా మారిపోయాయి. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలపై నియంత్రణ ఎత్తివేసి, రోజువారీగా మార్చే విధానం అమలు చేసినప్పటి నుంచి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా రికార్డు స్థాయికి చేరుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (క్రూడాయిల్) ధరలు తగ్గినా దేశంలో ధరలు తగ్గించకుండా పన్నులు పెంచుతూ సమానం చేయడం.. ధరలు పెరిగితే మాత్రం పెంచుకుంటూ వెళ్లడం.. రాష్ట్రాలు ఇష్టం వచ్చినట్లుగా పన్నులు వేస్తూ పోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పరిస్థితి మరీ దారుణంగా

మిగతా 6వ పేజీలో ▶



కేంద్ర, రాష్ట్రాల పన్నుల భారం

పెట్రోల్‌పై	డీజిల్‌పై
57%	44%

రోజువారీ ధరల సవరణ విధానానికి ముందు, తర్వాత ధరలు

	గతేడాది జూలైలో	ప్రస్తుతం
పెట్రోల్	రూ.67.11	రూ.75.47
డీజిల్	రూ.60.67	రూ.67.23



నన్ను చంపేందుకు కుట్ర: తొగాడియా

- వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు సంచలన ఆరోపణ
- కుట్రదారుల పేర్లు సరైన సమయంలో వెల్లడిస్తా
- నాటకీయ ఫక్కీలో అదృశ్యం.. ఆస్పత్రిలో ప్రత్యక్షం - 11లో

వచ్చే నెలలోనే 'పంచాయతీ'!



సర్పంచ్ ఎన్నికలపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్

- ఎన్నిక ప్రత్యక్షమా, పరోక్షమా అన్నదానిపై చర్చ
- ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీలో బిల్లు
- ఎన్నికల విధివిధానాలు అందులోనే..
- 4 వేల వరకు కొత్త పంచాయితీల ఏర్పాటు
- మున్సిపల్ చట్టానికి సవరణ యోచన
- మార్చి 12 నుంచి బడ్జెట్ సమావేశాలు
- రాష్ట్ర ఆర్థిక సంఘానికి రూ. 2,000 కోట్లు
- అదే రోజు నుంచి మండలాఫీసుల్లో రిజిస్ట్రేషన్లు
- భూరికార్డుల ప్రక్షాళనతో దేశానికే ఆదర్శంగా నిలిచామన్న సీఎం కేసీఆర్
- సుదీర్ఘంగా ఏడు గంటలపాటు భేటీ

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను వచ్చే నెల (ఫిబ్రవరి)లోనే నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వెల్లడించారు. సర్పంచ్‌లను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలా, పరోక్షంగానా అన్నదానిపై ఇంకా చర్చ జరుగుతోందని, ఆ ఎన్నికల విధి విధానాలను కొత్త పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరుస్తామని తెలిపారు. ఈ మేరకు వచ్చే నెల మొదటి వారంలో అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా నాలుగు వేల గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తామని, మున్సిపల్ చట్టానికి సవరణలు చేయాలని ఆలోచిస్తున్నామని వెల్లడించారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి మంగళవారం ప్రగతిభవన్‌లో జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీపీవోలతో సమీక్ష నిర్వహించారు. రెండు విడతల్లో సుదీర్ఘంగా ఏడు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, నాయిని నర్సింహారెడ్డి, జోగు రామన్న, తలసాని శ్రీనివాసయాదవ్, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పద్మారావు, డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంపీ కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పీ సింగ్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, అన్ని జిల్లాల



మిగతా 2వ పేజీలో ▶

తొలగని సంక్షోభం

ఇంకా సమసిపోని 'సుప్రీం' జడ్జీల వివాదం



- సీజేఐ దీపక్ మిశ్రాతో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల భేటీ
- సంక్షోభం ముగిసినట్లు లేదు: అటార్నీ జనరల్
- రెండు మూడ్రోజుల్లో పరిష్కారం కావచ్చు: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా
- విధులకు హాజరవుతున్న నలుగురు న్యాయమూర్తులు

■ సుప్రీంకోర్టులో నెలకొన్న సంక్షోభం కొనసాగుతోంది. జస్టిస్ మిశ్రాపై తీవ్ర విమర్శలు చేసిన నలుగురు జడ్జీలు ఆయనతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మరికొందరు జడ్జీలు కూడా పాల్గొన్నారని సుప్రీంకోర్టు వర్గాలు వెల్లడించాయి. ఈ భేటీ అనంతరం వివాద పరిష్కారానికి సంబంధించి కానీ, రాజీ మార్గానికి సంబంధించి కానీ ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

- వివరాలు 11లో

నయీమ్ ఆస్తుల జప్తు

స్వాధీనం కోసం ప్రభుత్వానికి లేఖ రాయనున్న సిట్

- ఆధారాలున్న కేసుల్లో ఆస్తుల జప్తునకు ప్రతిపాదనలు
- తొలి దఫాలో రూ. 140 కోట్ల విలువైన ఆస్తులపై దృష్టి
- మిగతా ఆస్తుల విషయంలో ఆధారాల్లేక తంటాలు

సాక్షి, హైదరాబాద్



పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమైన గ్యాంగ్‌స్టర్ నయీమ్ ఆస్తుల జప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సిద్ధమవుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, సెటిల్‌మెంట్ల విషయాల్లో లభించిన ఆధారాలను దృష్టిలో పెట్టుకొని ఆస్తుల స్వాధీనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తెలంగాణతోపాటు

మిగతా 2వ పేజీలో ▶

కోనేరే లేదు.. తెప్పోత్సవమట!

నగరంలోని పలు ఆలయాల్లో నిధుల స్వాహా

- దొంగ బిల్లులతో రెచ్చిపోతున్న అధికారులు
- తప్పుడు లెక్కలతో అయినకాడికి నొక్కేస్తున్నారు
- కళ్లు మూసుకుంటున్న దేవాదాయ శాఖ - 6లో

హజ్ యాత్రకు సబ్సిడీ రద్దు

- ఈ ఏడాది నుంచి ఇవ్వబోమన్న కేంద్ర మంత్రి నఖ్వీ
- ఆ మొత్తాన్ని మైనార్టీ బాలికల చదువుకు ఇస్తాం
- ముస్లింల సాధికారత కోసమే నిర్ణయమని వెల్లడి
- రాష్ట్ర యాత్రికులపై పడని సబ్సిడీ ఎత్తివేత ప్రభావం

- వివరాలు 11లో

ఇక నుంచి ఎండలే!

- రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మెదక్‌లో 35, హైదరాబాద్‌లో 33 డిగ్రీలు నమోదు


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణం కంటే ఎక్కువగా రికార్డవుతున్నాయి. మెదక్‌లో గత 24 గంటల్లో సాధారణం కంటే 5 డిగ్రీలు అధికంగా 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది.. గత పదేళ్లలో జనవరి 16 నాటికి ఇదే రికార్డని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక నుంచి ఎండలు మొదలవుతాయని.. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతాయని కేంద్రం డైరెక్టర్ వై.కె.రెడ్డి తెలిపారు. గత 24 గంటల్లో హైదరాబాద్‌లో సాధారణం కంటే 4 డిగ్రీలు ఎక్కువగా 33 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత రికార్డయింది. రాత్రి ఉష్ణోగ్రత కూడా సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా 18 డిగ్రీలు నమోదయింది. మహబూబ్‌నగర్‌లో సాధారణం కంటే 3 డిగ్రీలు ఎక్కువ పగటి ఉష్ణోగ్రత 34 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రత 20 డిగ్రీలు నమోదయింది. ఆదిలాబాద్, నిజామాబాద్, రామగుండంలలో 33 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు అక్కడక్కడ పెరిగాయి. వచ్చే ఎండాకాలానికి సంబంధించి ముందస్తు హెచ్చరిక జారీ కాలేదని.. గతంలో మాదిరిగా సాధారణ ఎండలే ఉండొచ్చని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

'కాంపోజిట్' రికార్డులు నిర్వహించాల్సిందే

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చట్టం ప్రకారం కాంపోజిట్ డీలర్లంతా రికార్డులు నిర్వహించాలని రాష్ట్ర పన్నుల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాంపోజిట్ కేటగిరీలోకి వచ్చిన నాన్‌కాంపోజిట్ డీలర్లు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని తెలిపింది. నాన్‌కాంపోజిషన్‌లో ఉన్న సమయంలో రిటర్ను దాఖలు చేయనివారు కాంపోజిట్ కేటగిరీలో దాఖలు చేయాలని సూచించింది.

పేద మహిళలు ఆధారపడిన పథకాన్ని కూడా అక్రమార్జనకు వాడుకునేవారిని ఏమనాలి?

63వ రోజు



16-01-2018, మంగళవారం
పాదిరేడు,
చిత్తూరు జిల్లా

సోమవారంనాడు శిబిరం వద్దనే ఆత్మీయులైన ప్రజల మధ్య సంక్రాంతి పండుగ సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నాను. కుటుంబసభ్యులు కూడా విచ్చేశారు. నాన్నగారి చెంత కొత్త బట్టలు పెట్టి, ఆశీర్వాదం తీసుకున్నాను. కనుమ పండగ రోజు చంద్రగిరి నియోజకవర్గం నుంచి నగరిలోకి ప్రవేశించాను.

'ఓ మంచి కుక్కను చంపాలంటే పిచ్చిది అని ముద్ర వేస్తే చాలు'సహకార రంగ సంస్థలను మూసివేయడానికి చంద్రబాబు ఎంచుకున్న కుతంత్రమిది.. అని శ్రీ వేంకటేశ్వర సహకార చక్కెర ఫ్యాక్టరీ కార్మికులు, రైతులు వాపోయారు. కార్మికులకు రెండు సంవత్సరాల నుంచి జీతాల్లేవట. న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కూడా రైతన్నలు కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి. సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూతపడక ముందు.. రైతులకు కనీస మద్దతు ధరకన్నా అధిక మొత్తం చెల్లించేవారని, ఇప్పుడు ప్రయివేటు చక్కెర ఫ్యాక్టరీలు రైతులను దోచేస్తున్నాయని అన్నారు. సహకార ఫ్యాక్టరీలంటే ప్రభుత్వానికి బిడ్డల వంటివి. తండ్రివంటివాడే స్వలాభం కోసం 'మీరెలా బతుకుతారో చూస్తా'అంటూ.. బిడ్డలపై కక్షగట్టినట్లు వ్యవహరించడం ఏపాటి న్యాయం? భారతీయ సహకార వ్యవస్థకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆచార్య వినోబాభావే వంటి మహానుభావులెందరో సహకార వ్యవస్థను పటిష్టం చేస్తూ.. ప్రచారాలు నిర్వహించారు. నేటి మన పాలకుడు మాత్రం వాటి ఉసురు తీస్తున్నాడు.

'నోటి కాడ కూడు గద్దలు తన్నుకుపోయినట్లు'పేద మహిళల జీవనోపాధిని కూడా ప్రభుత్వ పెద్దలే దోపిడీ చేస్తుంటే ఆ అన్యాయాన్ని ఎవరితో చెప్పుకోవాలి? భోజన విరామం తర్వాత నన్ను కలిసిన నగరికి చెందిన వరలక్ష్మి అనే అక్కది ఇదే ఆవేదన. పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టే పనిపై ఆధారపడి వేలాదిమంది పేద మహిళలు జీవించేవారని, ఇప్పుడు కొందరు ఆప్కో ప్రముఖులు తమ స్వలాభం కోసం.. ప్రభుత్వ ముఖ్యులకు లంచాలిచ్చి, రాష్ట్రమంతా యూనిఫామ్స్ సరఫరా చేసే పనిని తామే తీసుకుని, యూనిఫామ్ బట్ట కూడా మిగుల్చుకుని, తక్కువ సైజులు కుడుతూ.. విద్యార్థులకు చాలీచాలని దుస్తులు సరఫరా చేస్తున్నారని, ప్రభుత్వం నుంచి జతకు నలభై రూపాయలు తీసుకుంటూ.. కుట్టేవారికి మాత్రం ఇరవై రూపాయలే ఇస్తున్నారని వాపోయింది. వేలాది మంది పేద మహిళలు ఆధారపడిన ఈ పథకాన్ని కూడా వారి పొట్టగొట్టి.. ఇలా తమ అక్రమార్జనకు వాడుకుంటుంటే వీరినేమనాలి?

వడమాలలో కలిసిన రావమ్మ.. తాను 19 సంవత్సరాలుగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నానని, గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని, పిల్లల భోజనాలకు ఖర్చుపెట్టిన బిల్లులు కూడా చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేసింది. గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోగా, బిల్లుల చెల్లింపులూ లేకపోతే.. ఈ పేద మహిళలు ఎక్కడి నుంచి డబ్బులు సమకూర్చుకుంటారు? ఈ పథకాన్నెలా కొనసాగిస్తారు? పిల్లలకు ఎలా భోజనం పెడతారు? పిల్లల యూనిఫామ్స్ సరఫరా, మధ్యాహ్న భోజన పథకం.. ఈ రెండూ చూస్తే చాలదా ఈ ప్రభుత్వానికి పేద పిల్లల చదువులపై ఏపాటి శ్రద్ధ ఉందో తెలుసుకోవడానికి.

తడుకు పంచాయతీ సర్పంచ్ సుశీలమ్మ అక్క ఓ వినతిపత్రం ఇచ్చింది. 2006లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన 319 మంది వ్యవసాయ కూలీలకు 450 ఎకరాలను నాన్నగారు భూపంపిణీ చేశారట. వాటికి సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా ఇచ్చారట. ఆ నిరుపేదలు అప్పటి నుంచి వాటిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారట. 2008లో రుణమాఫీ కూడా జరిగిందట. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చాక మాత్రం రుణమాఫీ జరగలేదని, 2015, 2016 సంవత్సరాల్లో తుపానులు వచ్చినప్పుడు పంట నష్ట పరిహారం కూడా అందలేదని, తహసీల్దార్, కలెక్టర్‌లకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని తెలిపింది. నిరుపేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వ్యవసాయ కూలీలపై కనీస మానవత్వం లేకపోవడం అమానుషం.

చివరిగా, ముఖ్యమంత్రి గారికి నాదో ప్రశ్న.. ప్రతి సంక్షేమ పథకంలోనూ, ప్రతి కార్యక్రమంలోనూ మీకు అవినీతి సొమ్ము వాటా ఉండాల్సిందేనన్న పథకం ఏమైనా పెట్టుకున్నారా? విచ్చలవిడిగా మీరు, మీ నాయకులు, మీ అనుచరులు అవినీతికి పాల్పడుతూ ఉంటే.. మీరు దానిని పెంచి పోషిస్తుంటే.. పరిపాలనా వ్యవస్థ భ్రష్టు పట్టకుండా ఎలా ఉంటుంది?

వైఎస్. జగన్.



రేషన్‌కార్డు లేదు... పింఛన్ రాలేదంటూ తిరుమణ్యం వద్ద జగన్‌కు చెబుతున్న 102 ఏళ్ల వృద్ధురాలు కాంతమ్మ

వచ్చే నెలలోనే 'పంచాయతీ'!

▶ మొదటి పేజీ తరువాయి

కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సీఎం చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

500 జనాభా.. 1.5 కిలోమీటర్ల దూరం

''రాష్ట్రంలో ప్రస్తుతం 8,684 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మరో నాలుగు వేల కొత్త పంచాయతీలు ఏర్పాటు కావచ్చు. కనీసం 500 జనాభా, ఇప్పుడున్న గ్రామ పంచాయతీకి కనీసం ఒకటిన్నర, రెండు కిలోమీటర్ల దూరం ఉండాలి. న్యాయపరమైన చిక్కులకు తావు లేకుండా కొత్త పంచాయతీలు ఏర్పాటు కావాలి. కలెక్టర్లు కొత్త పంచాయతీల భౌగోళిక సరిహద్దులు (పరిధి) నిర్ణయించి జనవరి 25 కల్లా ప్రభుత్వానికి పంపించాలి. పనిచేసే పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. పంచాయతీరాజ్ ఎంతో గొప్పగా రూపొందించబడిన మహత్తరమైన ఉద్యమం. ఇప్పుడు గ్రామాలు పెంట కుప్పలుగా ఉంటున్నాయి. అందుకే చర్చలు జరుపుతున్నాం. ప్రత్యక్ష ఎన్నికా? పరోక్ష ఎన్నికా? అని కూడా చర్చిస్తున్నాం. సర్పంచ్‌ను పనిచేసే సర్పంచ్‌గా చేయాలి, ఒకప్పుడు పంచాయతీల మీద జిల్లా కలెక్టరుకు ఎన్నో అధికారాలుండేవి. ఇప్పుడు నియంత్రణ లేకుండా పోయింది. మున్సిపల్ చట్టానికి సవరణ చేసే ఆలోచనలు పరిశీలిస్తున్నాం. పంచాయతీ వ్యవస్థ ఎలా ఉండాలో కలెక్టర్లు తమ సలహాలు, సూచనలను పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శికి పంపాలి. సర్పంచ్‌లతో పని చేయించేందుకు జిల్లా పంచాయతీ అధికారులు సూచనలు ఇవ్వాలి. వాటి ఆధారంగా కొత్త పంచాయతీరాజ్ చట్టం బిల్లును ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీలో ప్రవేశపెడతాం.



మంగళవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన సమీక్షకు హాజరైన కలెక్టర్లు, ఉన్నతాధికారులు

సాదాబైనామాలు ఇక బంద్

ఇప్పటివరకు అందిన సాదాబైనామా దరఖాస్తులను పూర్తి చేయాలి. మార్చి 12 తర్వాత సాదాబైనామా దరఖాస్తులు స్వీకరించొద్దు, భూ బదలాయింపులన్నీ రిజిస్ట్రేషన్ లేదా వారసత్వ హక్కుగా మ్యుటేషన్‌గా జరగాలి. సబ్‌రిజిస్ట్రార్లు, అధికారులకు కొత్త రిజిస్ట్రేషన్ విధానం, ఐటీ అప్లికేషన్లలో శిక్షణనివ్వాలి. బ్యాంకులు ఇకపై పంట రుణాల కోసం పట్టాదారు పాస్ పుస్తకాలు తాకట్టు పెట్టుకోకూడదు. ధరణి వెబ్‌సైట్‌లో వివరాలు చూసుకోవాలి. ఆర్‌వోఎఫ్‌ఆర్ ప్రతిపాదనలు, భూప్రక్షాళనకు సంబంధించి ఇంకేమైనా సమస్యలుంటే ప్రభుత్వానికి పంపించాలి. అసైన్డ్ భూములపై ఒక విధానం రూపొందించాలి. రెవెన్యూ శాఖ తగిన మార్గదర్శకాలు సిద్ధం చేయాలి. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తమ జిల్లాలలో వాటిని అన్వయించి తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలి. అసైన్డ్ భూముల విషయంలో మానవతా కోణంలో ఆలోచించాలి.

మార్చి 11న కొత్త పాస్ పుస్తకాలు

రైతులకు మార్చి 11 నాడు కచ్చితంగా కొత్త పాస్ పుస్తకాలు అందజేయాలి. దానికి ఒకరోజు ముందు, లేదా అదే రోజు ఉదయం ప్రతి గ్రామానికి పాస్ పుస్తకాలను చేరవేసేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయాలి. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. ప్రతి గ్రామంలో ఒక నోడల్ అధికారిని నియమించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి.

గ్రామాల్లో వంద శాతం పన్ను వసూళ్లు

రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు చేశాం. బడ్జెట్‌లో రూ.2,000 కోట్లు కేటాయిస్తాం. మార్చి 12 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తాం. చిన్న గ్రామ పంచాయతీకి (500 వరకు జనాభా ఉన్నవి) రూ. 5 లక్షలు, తర్వాత స్థాయికి అనుగుణంగా రూ.10 లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షలు ఇలా ప్రభుత్వం సమకూరుస్తుంది. గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయిస్తుంది. జాతీయ ఆర్థిక సంఘం నిధులు ఉపయోగించుకుంటాం. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో ఆస్తులను సమకూర్చుకుంటాం. పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చుకుంటాం. ఎమ్మెల్యే, ఎంపీల నిధుల నుంచి గ్రామాభివృద్ధికి వెచ్చిస్తాం. మనందరం పట్టుబడితే పరిశుభ్ర, అభివృద్ధికరమైన గ్రామీణ తెలంగాణను సాధించుకోగలం.

మార్చి నుంచి మండలాల్లో రిజిస్ట్రేషన్లు

మార్చి 12 నుంచి రెవెన్యూ రికార్డుల నిర్వహణలో విప్లవాత్మకమైన మార్పు రావాలి. ఇప్పుడున్న 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా 443 మండల కార్యాలయాలు రిజిస్ట్రేషన్ వ్యవహారాలు చూస్తాయి. మొత్తం 584 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉంటాయి. రిజిస్ట్రేషన్ తర్వాత మ్యుటేషన్‌కు నెలల కొద్దీ సమయం పట్టదు. కోర్ బ్యాంకింగ్ నెట్‌వర్క్ తరహా విధానం అమలు చేస్తాం. పాస్‌బుక్కులను కొరియర్ ద్వారా ఇంటికే పంపుతాం. 'ధరణి'వెబ్‌సైట్‌లో ఈ వివరాలు వెంటనే అప్‌డేట్ అవుతాయి. భూరికార్డుల ప్రక్షాళన నుంచి మార్చి 12 వరకు జరిగే క్రయ విక్రయాల వివరాలను కలెక్టర్లు ధరణి వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలి. భూరికార్డుల ప్రక్షాళన విజయవంతమైంది. మనం ఎన్నో పనులు చేస్తుంటాం. కానీ ఇంత గొప్పగా చేయలేం. ఇది సాహసంతో చేశాం. దేశమంతా మనల్ని అభినందిస్తోంది. మనం కొత్త రాష్ట్రమైనా దేశానికి ఆదర్శమయ్యాం. ఈ స్ఫూర్తి ఇలాగే కొనసాగాలి. ముున్ముందు పూర్తి అవినీతిరహితంగా జరగాలి.

కోటి ఎకరాలకు సాగునీరు

2020 సంవత్సరం నాటికి రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీటిని అందిస్తాం. ఈ సంవత్సరం డిసెంబర్ చివరికే చాలా వరకు కాళేశ్వరం నీళ్లు వస్తాయి. స్థానిక తక్షణావసరాల కోసం పెద్ద జిల్లాల కలెక్టర్లకు రూ.1.5 కోట్లు, చిన్న జిల్లాలకు రూ. కోటి కేటాయిస్తున్నాం. అన్ని జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల స్థితిగతులు కంప్యూటరైజ్ చేయాలి. వీటి ఆధారంగా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక నిధిలో కేటాయించిన నిధులు వృథా కాకుండా ఉపయోగపడాలి. గొర్రెల పంపకం పథకం పకడ్బందీగా అమలవుతోంది. ఇప్పటికే 38,28,987 గొర్రెల పంపిణీ జరగ్గా.. వాటికి 14,56,376 పిల్లలు పుట్టాయి. ఇది పెద్ద కార్యక్రమం. రాబోయే రోజుల్లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు మాంసం ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుంది. గొర్రెల పెంపకంతో పాటు అవసరమైన గడ్డిని పెంచాలి. జిల్లాల్లో ఉన్న పండ్ల తోటల వివరాలు సేకరించి అక్కడ గడ్డి పెంచే అవకాశాలను పరిశీలించాలి..''

నయీమ్ ఆస్తుల జప్తు!

▶ మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా, ముంబై లలో ఉన్న ఇళ్లు, స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు అనుసరించాల్సిన మార్గంపై సిట్ అధికారులు న్యాయశాఖ నుంచి సలహా కూడా తీసుకున్నట్లు తెలియవచ్చింది. ఈ అంశంపై ప్రభుత్వానికి లేఖ రాసి ఉత్తర్వులు పొందేందుకు అధికారులు యోచిస్తున్నారు.

మొత్తం 1,130 ఎకరాలు: నయీమ్ ఎన్‌కౌంటర్ తర్వాత సిట్ విచారణలో 210 మంది బాధితులు తమ భూములపై ఫిర్యాదు చేయగా వాటిలో ఆధారాలు గుర్తించింది మాత్రం కేవలం 46 కేసుల్లోనే. ప్రస్తుతం ఆ ఆస్తుల జప్తు కోసం సిట్ సమాయత్తమవుతోంది. నయీమ్ మొత్తం 1,130 ఎకరాల భూమి సంపాదించినట్లు గుర్తించినా ఈ కేసుల్లో ఆధారాలు దొరక్క అధికారులు తంటాలు పడుతున్నారు. ఈ సెటిల్‌మెంట్లపై బాధితులు ఫిర్యాదు చేసినా ఆ భూములు అనేక చేతులు మారాయి. ప్రస్తుతం పొజిషన్‌లో ఉన్నవారి ఆదాయ వ్యవహారాలు, డాక్యుమెంట్లు పక్కాగా ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకోవడం సులభం కాదని తెలిసింది. ఆదాయ మార్గాలు చూపించడంతోపాటు ఆస్తులను సీజర్ ప్రాపర్టీ నుంచి తొలగించుకునేందుకు ఏకంగా హైకోర్టుకు వెళ్లారని తెలిసింది. దీంతో సిట్ ఆ ఆస్తులను గుర్తించినా స్వాధీనానికి తగ్గ ఆధారాలు సంపాదించలేకపోయినట్లు తెలుస్తోంది.



అల్కాపురి కాలనీలో నయీమ్ ఇల్లు

మొదటి దఫాలో రూ. 140 కోట్ల ఆస్తి

నయీమ్ తన భార్య, సోదరి, అత్త, అనుచరుల పేర్లపైనే ఆస్తులు కూడబెట్టగా అతని భార్యతోపాటు సోదరి, అతడి దగ్గరి బంధువుల పేర్లపై ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకునేలా సిట్ ఆధారాలు సేకరించింది. వాటి ప్రస్తుత మార్కెట్ విలువను పరిశీలిస్తే...


❑ హైదరాబాద్ అల్కాపురి కాలనీలో 2 ఇళ్ల విలువ రూ. 6 కోట్లు. ❑ మణికొండలోని పంచవటి కాలనీలో 8 ప్లాట్ల విలువ రూ. 4-5 కోట్లుగా అంచనా. ❑ పుప్పాలగూడలో 300 గజాల చొప్పున 12 ఓపెన్ ప్లాట్ల విలువ సుమారు రూ. 6 కోట్లు. ❑ షాద్‌నగర్‌లోని 12 ఎకరాల మామిడి తోట, ఫాంహౌస్‌ల విలువ సుమారు రూ. 25 కోట్లు. ❑ తుక్కుగూడలోని 10 ఎకరాల తోట, ఫాంహౌస్ విలువ సుమారు రూ. 35 కోట్లు. ❑ కరీంనగర్ శివారులోని నగునూర్‌లో రూ. 5 కోట్ల విలువైన వెంచర్. ❑ నల్లగొండలో నయీమ్ అనుచరుల పేరిట ఉన్న రెండు ఇళ్లు, 18 ఎకరాల భూమి విలువ రూ. 3.5 కోట్లు. ❑మిర్యాలగూడలో నయీమ్ అత్త పేరిట ఉన్న ఇంటితోపాటు 4 ఎకరాల భూమి విలువ సుమారు రూ. 65 లక్షలు. ❑ భువనగిరి, యాదగిరిగుట్టలోని 16 వెంచర్లలో 180పైగా ఓపెన్ ప్లాట్ల (ఒక్కొక్కటి 250 గజాల నుంచి 300 గజాలు) విలువ రూ. 12 కోట్ల నుంచి రూ. 18 కోట్లు. ❑ గోవాలోని కోకనట్ హౌస్‌తోపాటు మరో ఇల్లు గుర్తింపు. ఒక్కో ఇంటిని రూ. 2.5 కోట్లకు కొనుగోలు చేసినట్లు నయీమ్ భార్య, సోదరి వాంగ్మూలంలో స్పష్టం చేశారు. వాటిని కూడా జప్తు జాబితాలో పెట్టారు. ❑ నాగోల్, సరూర్‌నగర్‌లో ఓ సెటిల్‌మెంట్లో నయీమ్ అనుచరులు శేషన్న, శ్రీధర్‌ల పేరిట ఉన్న రెండు ఫంక్షన్ హాళ్ల విలువ సుమారు రూ. 6 కోట్లు. ❑నార్సింగిలో రూ. 2 కోట్ల విలువైన ఇల్లు, శంషాబాద్‌లోని పోలీస్‌హౌస్ విలువ రూ. 2 కోట్లు. ❑ కల్వకుర్తిలో 8 ఎకరాల భూమి విలువ రూ. 3.5 కోట్లు. ❑ మేడ్చల్‌లో 3 ఎకరాలు, శామీర్‌పేట్‌లో ప్రముఖ రిసార్ట్ సమీపంలో మరో 3 ఎకరాల భూమి గుర్తింపు. ఓ ప్రజాప్రతినిధితో చేసిన సెటిల్‌మెంట్‌లో పొందిన ఈ భూమి విలువ సుమారు రూ. 20 కోట్లు. ❑ మొయినాబాద్‌లో ఒక్కోటి రూ. 45 లక్షల విలువైన రెండు విల్లాలు. ఇందుకు అవసరమైన డబ్బు మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్ ల్యాండ్ సెటిల్‌మెంట్‌తో వచ్చాయని నయీమ్ అనుచరుల వాంగ్మూలంలో సిట్ గుర్తించింది.

'ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ'కి ఎన్సీఎల్టీ నోటీసులు

తదుపరి విచారణ 29కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: రుణ బకాయిల ఎగవేత విషయంలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ లిమిటెడ్‌కు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) మంగళవారం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు ఎన్సీఎల్టీ జ్యుడీషియల్ సభ్యులు విత్తనాల రాజేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. తీసుకున్న రుణాన్ని వడ్డీతోసహా చెల్లించే పరిస్థితిలో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ లిమిటెడ్ లేనందున ఈ కంపెనీ దివాలా ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లు ఎన్సీఎల్టీలో పిటిషన్లు దాఖలు చేశాయి. దివాలా ప్రక్రియను ప్రారంభించేందుకు దివాలా పరిష్కారదారును ఏర్పాటు చేయాలని అభ్యర్థించాయి. ఎస్‌బీఐ తరఫు న్యాయవాది వి.కె.సాజిత్ వాదనలు వినిపిస్తూ, కాకరపల్లిలో ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం తమ నుంచి పెద్దమొత్తంలో రుణం తీసుకున్న ఈస్ట్‌కోస్ట్ సంస్థ రూ.952.47 కోట్ల మేర బకాయి పడిందన్నారు.

ఇదం జగత్



కొంపదీసి మీరేమయినా ఆశిస్తున్నారా సార్!

క్యాట్‌ఫిష్ అక్రమ రవాణా

- గుట్టురట్టు చేసిన కస్టమ్స్ అధికారులు
- 44 బాక్సుల క్యాట్‌ఫిష్ సీడ్ స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న క్యాట్‌ఫిష్ బాక్సులు



బాక్సులోని క్యాట్‌ఫిష్ సీడ్

సాక్షి, హైదరాబాద్: నిషేధిత క్యాట్‌ఫిష్ పిల్లల (సీడ్) అక్రమ రవాణా గుట్టును శంషాబాద్ విమానాశ్రయ కస్టమ్స్ అధికారులు రట్టు చేశారు. మంగళవారం ఇద్దరిని అదుపులోకి తీసుకుని, 44 బాక్సుల్లో పార్శిల్ చేసిన లక్ష క్యాట్‌ఫిష్ సీడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాలుష్య కారకం కావడంతో భారతదేశంలో క్యాట్‌ఫిష్ పెంపకంపై నిషేధం కొనసాగుతోంది. దీంతో పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి ఈ సీడ్‌ను కర్ణాటకలోని బీదర్‌కు చెందిన స్మగ్లర్లు ఖరీదు చేస్తున్నారు. దీన్ని నేరుగా బంగ్లాదేశ్ నుంచి బీదర్‌కు తరలించే ఆస్కారం లేదు. ప్యాకెట్లలో ఉన్న ఈ సీడ్‌కు ప్రతి నాలుగు గంటలకూ ఒకసారి ఆక్సిజన్ అందిస్తూ ఉండాలి. 12 గంటల్లోనే గమ్యస్థానానికి చేర్చి చెరువులో వదిలేయాలి. దీంతో స్మగ్లర్లు ఈ సీడ్‌ను తొలుత బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతాకు తీసుకువస్తున్నారు. అక్కడ నుంచి ప్యాసింజర్ ఫ్లైట్‌లో లైవ్ ఫిష్ పేరుతో కార్గో బుక్ చేస్తున్నారు. ఇలా హైదరాబాద్‌కు తీసుకువచ్చిన తర్వాత రోడ్డు మార్గంలో బీదర్‌కు తరలిస్తున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు కస్టమ్స్ అధీనంలోని ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐయూ) అధికారులు మంగళవారం ఇండిగో ప్యాసింజర్ ఫ్లైట్ కార్గోలో బుక్ చేసిన 44 కార్టన్ బాక్సుల్ని తనిఖీ చేశారు. ఇందులో క్యాట్‌ఫిష్ సీడ్ బయటపడటంతో రవాణా చేస్తున్న ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వీటి విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని, పెరిగిన తర్వాత రేటు కొన్ని రెట్లు పెరుగుతుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు.

450 కిలోల వెండి ఆభరణాలతో పరార్

మహిళా వ్యాపారిని మోసం చేసిన రాజస్తాన్‌వాసి

హైదరాబాద్: నగరంలోని ఓ మహిళా వ్యాపారిని రాజస్తాన్ వాసి నమ్మించి మోసం చేసి సుమారు రూ.1.80 కోట్ల విలువ చేసే 450 కిలోల వెండి ఆభరణాలతో పరారయ్యాడు. హైదరాబాద్ యూసుఫ్‌గూడ సమీపంలోని శ్రీ కృష్ణ నగర్‌లో మహిళా వ్యాపారి ధర్మిష్ట జైన్ (34) మూడేళ్లుగా శ్రీ నకోడా సిల్వర్ పేరుతో వెండి ఆభరణాల షాప్ నడుపుతున్నారు. బులియన్ మార్కెట్‌లో కొన్న వెండి బిస్కెట్లతో ఆభరణాలు తయారు చేసి క్రెడిట్ పద్ధతిలో సరఫరా చేస్తున్నారు. ఆమెకు రాజస్తాన్‌లోని నర్పత్ పట్టణానికి చెందిన జాలారామ్ అలియాస్ బాగ్దారామ్ అలియాస్ భరత్ ఆభరణాల వ్యాపారిగా పరిచయమయ్యాడు. తనకు వెండి ఆభరణాలు ఇస్తే వాటిని విక్రయించి ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లిస్తానని నమ్మించి 10 నెలలుగా ఆమెతో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాడు. జూన్‌లో 450 కిలోల వెండి ఆభరణాలు కావాలని.. వాటిని అమ్మి డబ్బులు చెల్లిస్తానంటూ ఆమెతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆభరణాలు తీసుకున్న తర్వాత డబ్బులు చెల్లించకపోగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న ఆమె మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇఫ్లూలో డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు ప్రవేశాలు

హైదరాబాద్: ది ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో పలు కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. బీఏలో లాంగ్వేజ్ కోర్సులు, ఎంఏలో ఇంగ్లిష్‌తో పాటు 12 విదేశీ భాషల కోర్సులు, పీజీలో జర్నలిజం, ఎంఈడీ, పీహెచ్‌డీ కోర్సులకుగానూ గురువారం (18న) నుంచి ఫిబ్రవరి 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. హైదరాబాద్, విజయవాడతో పాటు దేశంలోని 21 కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు ఫిబ్రవరి 24, 25 తేదీల్లో జరగనున్నాయి. సీటు సాధించిన విద్యార్థులకు ప్రతి నెలా రూ.1,000 స్కాలర్‌షిప్, పీహెచ్‌డీ వారికి రూ.8,000 ఫెలోషిప్ లభిస్తాయి. దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ఉంటాయి. డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇఫ్లూ క్యాంపస్‌లో హాస్టల్ వసతి ఉందని అధికారులు తెలిపారు. ఇఫ్లూలో ఉన్నత విద్యను అందుకోవడానికి విద్యార్థులకు ఇది మంచి అవకాశమని వీసీ సురేశ్‌కుమార్ తెలిపారు. వివరాలను ఇఫ్లూ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

బాలుర మధ్య ఘర్షణ

కత్తిపోటుతో ఒకరికి గాయాలు

హైదరాబాద్: ఇద్దరు బాలుర మధ్య తలెత్తిన ఘర్షణలో కత్తిపోటుకు గురై ఒకరు గాయపడ్డారు. నాచారంలోని ఎర్రకుంటకు చెందిన అరవింద్ (16), సాయినాథ్ (16) స్నేహితులు. వీరిద్దరూ అక్కడి ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. ఇదే స్కూల్‌లో అరవింద్ సోదరి సైతం చదువుతోంది. కొన్నాళ్లుగా అరవింద్ సోదరిని సాయినాథ్ వేధిస్తున్నాడనేది ఆరోపణ. ఇదే విషయంపై మందలించేందుకు అరవింద్ మంగళవారం ఉదయం సాయినాథ్ ఇంటికి వెళ్లాడు. ఇరువురి మధ్యా మాటామాటా పెరగడంతో ఆవేశానికి లోనైన సాయినాథ్ కత్తితో అరవింద్ కడుపులో పొడిచాడు. అనంతరం భయపడి పారిపోయాడు. గాయపడిన అరవింద్‌ను స్థానికులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అతడి పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో విద్యాశాఖ ప్రతి పాఠశాలలో మానసిక శాస్త్ర నిపుణుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంఘం గౌరవాధ్యక్షుడు అచ్యుతరావు డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ప్రభావంతో అభంశుభం తెలియని బాలలు నేరస్తులుగా మారుతున్నారని అన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరవింద్

ఓయూలో 29న 'హెల్త్‌కేర్' కౌన్సెలింగ్

హైదరాబాద్: ఓయూలో 29న హెల్త్‌కేర్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరగనుంది. నగరంలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో కొనసాగుతున్న 17 రకాల పీజీ డిప్లొమా ఇన్ కేర్ కోర్సుల్లో ప్రవేశాలకు క్యాంపస్‌లోని పీజీ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందని డైరెక్టర్ ప్రొఫెసర్ కిషన్ మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్ కేంద్రానికి హాజరుకావాలని చెప్పారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 21 వరకు, రూ.200 ఫైన్‌తో 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇటీవల డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు సైతం కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు.

సాక్షి
బుధవారం, జనవరి, 17

ఇజ్రాయెల్‌తో చెలిమి

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరు రోజుల పర్యటన కోసం శనివారం న్యూఢిల్లీ వచ్చినప్పుడు ఆయనకు ఘన స్వాగతం లభించింది. ప్రొటోకాల్ పక్కనపెట్టి విమానాశ్రయానికి వెళ్లడమే కాదు... ఆయనను గాఢంగా హత్తుకుని తన అభిమానాన్ని చాటుకున్న ప్రధాని నరేంద్ర మోదీ తీరును గమనిస్తే పాతికేళ్ల క్రితం మొదలైన ఇరు దేశాల బంధమూ ఏ స్థాయికి చేరుకుందో అర్ధమవుతుంది. సరిగ్గా ఆరునెలలక్రితం అంటే జూలై మొదటివారంలో మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఈ మాదిరి స్వాగత సత్కారాలే లభించాయి. మన ప్రధాని ఒకరు ఇజ్రాయెల్ పర్యటించడం అదే మొదటిసారి కాగా, ఇజ్రాయెల్ ప్రధాని ఇక్కడకు రావడం పదిహేనేళ్ల తర్వాత ఇది రెండోసారి. మోదీ జూలై పర్యటన సందర్భంగా వ్యవసాయం, జల సంరక్షణ, నవీకరణ రంగాల్లో సహకార ఒప్పందాలు కుదిరాయి. అవన్నీ వెనువెంటనే చకచకా కదిలాయి. ఇండో– ఇజ్రాయెల్ వ్యవసాయ పథకం కింద మన దేశంలో 35 ఎక్స్‌లెన్స్ కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించగా వాటిలో 20 ఇప్పటికే పనిచేయడం ప్రారంభించాయి. తీవ్రమైన నీటి కొరత ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్‌లో జల సంరక్షణ విధానాలను అభివృద్ధి చేసి అందులో ఉత్తమ సాంకేతికతను సాధించిన శాస్త్రవేత్తలు మన దేశంలో నీటి కరువు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వినియోగపడగల పథకాలకు తుదిరూపం ఇస్తున్నారు. నవీకరణ రంగానికి సంబంధించినంతవరకూ వ్యవసాయం, జల సంరక్షణ, ఆరోగ్యం అంశాల్లో ఇరు దేశాలకూ చెందిన 36 ఔత్సాహిక పరిశ్రమలకు అనుమతులు లభించాయి. ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటుచేసి ఏడాదికి చెరో 40 లక్షల డాలర్లు చొప్పున అయిదేళ్లపాటు కేటాయించాలని తాజాగా నిర్ణయించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని ఇప్పుడున్న 500 కోట్ల డాలర్ల స్థాయి నుంచి మరింత పెంచుకోవాలన్న ఉద్దేశం రెండు దేశాలకూ ఉంది. వాణిజ్య రంగంలో భారత్ భాగస్వాముల్లో ఇజ్రాయెల్ స్థానం 38. వివిధ అరబ్ దేశాలు మొదటి 15 ర్యాంకుల్లో ఉన్నాయంటే ఇజ్రాయెల్‌తో మన వాణిజ్యం ఎంత తక్కువగా ఉన్నదో అర్ధమవుతుంది. అయితే ఆయుధాలు, రక్షణ రంగానికి సంబంధించిన ఇతర కొనుగోళ్లకు సంబంధించినంత వరకూ ఇజ్రాయెల్‌దే అగ్ర స్థానం. ఇజ్రాయెల్ నుంచి ఏటా వంద కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు, ఇతర రక్షణ పరికరాలు మన దేశం కొనుగోలు చేస్తున్నది. ఇతర రంగాల్లో సైతం వాణిజ్యం ఈ స్థాయికి విస్తరించాలన్నది రెండు దేశాల ఆలోచన. దాన్ని దృష్టిలో పెట్టుకునే నెతన్యాహుతో పాటు భారీ పారిశ్రామికవేత్తల బృందం మన దేశం వచ్చింది.

అయితే ఇజ్రాయెల్‌తో మన సంబంధాలు సంక్లిష్టమైనవి. రెండు దేశాల మధ్య నెలకొన్న సంబంధాలనూ 'స్వర్గంలో కుదిరిన పెళ్లి'గా నెతన్యాహు అభివర్ణించడం మాటెలా ఉన్నా దాని పర్యవసానాలు కూడా తక్కువేమీ కాదు. ఎందుకంటే ఇజ్రాయెల్‌కు అరబ్ దేశాలతో ససేమిరా కుదరదు. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య పచ్చగడ్డేస్తే భగ్గున మండుతుంది. ఇక పాలస్తీనా సమస్య ఉండనే ఉంది. ఇజ్రాయెల్‌తో సంబంధాలు బలపడేకొద్దీ అరబ్ దేశాలతో, ఇరాన్‌తో మనకున్న సంబంధాలపై అవి తీవ్ర ప్రభావం కలగజేస్తాయని, ఇది మంచిది కాదని దౌత్య నిపుణులు చాన్నాళ్లుగా హెచ్చరిస్తున్నారు. మన చమురు దిగుమతుల్లో అరబ్ దేశాల వాటా 50 శాతం. సహజవాయువు అవసరాల్లో 85 శాతం ఆ దేశాలనుంచే లభిస్తుంది. అలాగే గల్ఫ్ సహకార మండలి(జీసీసీ)తో మన వాణిజ్యం 15000 కోట్ల డాలర్లు మించి ఉంది. మన దేశానికి చెందిన 80 లక్షల మంది యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, బహ్రైన్ దేశాలకు వలస పోయి అక్కడ ఉపాధి పొందుతున్నారు. సాధారణంగా అయితే ఒక దేశంతో సంబంధాలు మరో దేశంతో ఉన్న సంబంధాలను దెబ్బతీస్తాయని భావించనవసరం లేదు. తైవాన్‌తో మనకున్న సంబంధాలు చైనాతో ఉన్న సంబంధాలకు అడ్డు రాలేదు. అలాగే చైనా–పాకిస్తాన్ మైత్రి భారత్–చైనా సంబంధాలపై ప్రభావం చూపడం లేదు.

అయితే ఇజ్రాయెల్‌తో పశ్చిమాసియాకు, ఇరాన్‌కు ఉన్న వైరం నేపథ్యం వేరు. 1947లో ఇజ్రాయెల్ ఆవిర్భావం తమ ప్రయోజనాలకు భంగకరమని ముస్లిం ప్రపంచం భావిస్తోంది. జర్మనీలో యూదుల వేధింపును 1938లో మహాత్మా గాంధీ తీవ్రంగా ఖండించినా యూదుల కోసం ఇజ్రాయెల్ ఏర్పరచాలన్న ప్రతిపాదనను ససేమిరా అంగీకరించలేదు. అరబ్‌ల మనసు గెల్చుకుని, వారి ఇష్టంతో మాత్రమే అలాంటి ప్రయత్నం చేయాలని చెప్పారు. స్వాతంత్ర్యానంతరం కూడా మన దేశం ఆ మార్గాన్నే ఎన్నుకుంది. 1947లో ఇజ్రాయెల్ ఏర్పాటైనప్పుడు భారత్ గట్టిగా వ్యతిరేకించింది. మరో రెండేళ్లకు ఐక్యరాజ్యసమితిలో దానికి సభ్యత్వం ఇవ్వడాన్ని కూడా అంగీకరించలేదు. పాలస్తీనా ప్రజానీకంపై ఇజ్రాయెల్ దాడులు చేసినప్పుడల్లా వాటిని మన దేశం ఖండిస్తూనే ఉంది. అమెరికా తన దౌత్య కార్యాలయాన్ని వివాదాస్పద జెరుసలేంకు తరలించాలని నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ గత నెలలో ఐక్యరాజ్యసమితి అత్యవసర సమావేశం తీర్మానించినప్పుడు సైతం మన దేశం దానికి మద్దతునిచ్చింది. ఇటీవలికాలంలో అమెరికా–అరబ్–ఇజ్రాయెల్ దేశాల మధ్య లోపాయికారీగా సాన్నిహిత్యం పెరగడాన్ని, ముఖ్యంగా పర్షియన్ జలసంధిలో ఇరాన్ యుద్ధ నౌకల కదలికపై నిఘాకు అవసరమైన గూఢచార డ్రోన్‌లను సౌదీ అరేబియాకు ఇజ్రాయెల్ సరఫరా చేయడాన్ని గమనిస్తే పశ్చిమాసియా మునుపటిలా లేదని, అక్కడ సమీకరణాలు మారుతున్నాయని అవగతమవుతుంది. అటు చైనా తలపెట్టిన వన్ బెల్ట్ వన్ రోడ్(ఓబీఓఆర్)ను ఇజ్రాయెల్ స్వాగతించడాన్ని, సిరియాకు వ్యతిరేకంగా అల్ కాయిదా, ఐఎస్‌ల సాయం తీసుకోవడానికి అది ప్రయత్నించడాన్ని మన దేశం వ్యతిరేకించింది. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్ ఆశిస్తున్నట్టు ఇరు దేశాల సంబంధాలూ వ్యూహాత్మక స్థాయికి చేరడం ఏమేరకు సాధ్యమో, అసలు ప్రస్తుత సంబంధాల పరిధి, పరిమితి ఏమిటో రాగలకాలంలో తేటతెల్లమవుతుంది.



"పరస్పర ప్రయోజనాలే దేశాల మధ్య సంబంధాలకు ఆధారం. ఈ గీతను దాటనప్పుడే అది సమర్థ విదేశీ విధానం అనిపించుకుంటుంది."

– ఫరీద్ జకారియా
అమెరికన్ జర్నలిస్టు, రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి అమావాస్య ఉ.7.10 వరకు, తదుపరి మాఘ శు.పాడ్యమి నక్షత్రం ఉత్తరాషాఢ రా.9.52 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం రా.2.14 నుంచి 4.01 వరకు, దుర్ముహూర్తం ప.11.46 నుంచి 12.31 వరకు అమృతఘడియలు... ప.2.47 నుంచి 4.33 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.42
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్ : 5.33
జొహర్ : 12.26
అసర్ : 4.27
మగ్రీబ్ : 6.03
ఇషా : 7.19

విస్ఫోటనకు చేరువగా అస్సాం

విశ్లేషణ



యోగేంద్ర యాదవ్

గత అయిదేళ్లలో బీజేపీ అస్సాం వలస సమస్యను మతతత్వ సమస్యగా మార్చడంలో విజయవంతం కావడమే కాకుండా, భాషాపరమైన, జాతిపరమైన సమస్యకు మతం రంగు పులిమింది. అస్సాంలో బీజేపీ రాజకీయాలు ప్రధానంగా బెంగాలీ హిందూ ఓటు బ్యాంకుపైనే ఆధారపడ్డాయి. కాబట్టి ఈ పార్టీకి రెండంచెల అజెండా ఉంది. బెంగాలీ హిందువులకు పౌరసత్వ స్థాయిని కల్పించడం, బెంగాలీ ముస్లింలకు ఆ స్థాయిని నిరాకరించడం. ఈ విభజనే అస్సాంను ప్రమాదకరమైన విస్ఫోటక స్థాయికి చేరుస్తోంది.

అస్సాం నేడు ఒక ఉడుకుతున్న అగ్నిపర్వతం. రాష్ట్రంలో అనిశ్చితమైన జాతుల సమ్మేళనం విస్ఫోటించడానికి సిద్ధంగా ఉన్నందున, ఈ సంక్షోభంలో అవకాశం కోసం రాజకీయపార్టీలు వేచి చూస్తున్నాయి. ఇక మిగిలిన దేశం మొత్తంగా, ఆ ప్రాంతంలో ఏం జరుగుతోంది అనే విషయమై పట్టించుకోకుండా ఉంటోంది.

అస్సాంలో సాగుతున్న జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్‌ఆర్‌సీ) సన్నాహక చర్యలు పాత గాయాన్ని రేపాయి. దశాబ్దాలుగా అస్సాం రాజకీయాల్లో 'వలస' సమస్య ఆధిపత్యం చలాయిస్తోంది. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా రాష్ట్రం భారీస్థాయిలో 'బయటి వ్యక్తుల' చొరబాటుకు సాక్షీభూతమై నిలిచింది. దేశం లోపలి నుంచి హిందీ భాష మాట్లాడేవారు, జార్ఖండ్ నుంచి గిరిజనులు, పశ్చిమ బెంగాల్ నుంచి బెంగాలీ హిందువులతో పాటు నేపాల్, బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన వారు కూడా ఈ వలసల్లో ఉన్నారు. జనాభాలో గణనీయ నిష్పత్తిలో–ఎంతమంది అనేది పూర్తి వివాదాస్పద ప్రశ్నగా ఉంటోంది–బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి వచ్చిన హిందూ, ముస్లిం వలస ప్రజలున్నారు. వీరు మతపరమైన పీడనవల్లో లేక జీవిక కోసమో భారత్‌కు వలస వచ్చేశారు. విభజన సమయంలో బంగ్లాదేశ్‌లో (నాటి తూర్పు పాకిస్తాన్), 24 శాతం మంది హిందువులు ఉండేవారని గుర్తుపెట్టుకోండి. ఇప్పుడు అక్కడ వీరి జనాభా 9 శాతానికి పడిపోయింది. ఇంత జనాభా ఎక్కడికి వెళ్లివుంటుందో అంచనా వేస్తే బహుమతులు రావు మరి.

జాతుల సమతుల్యతను చెరిపేసిన వలసలు

భారీస్థాయి వలసలు అస్సాంకి కొత్త కాదు. రాష్ట్ర చరిత్ర మొత్తంగా వలసల వెల్లువల చరిత్రే. అయితే స్వాతంత్ర్యానంతరం సాగిన భారీ వలస రాష్ట్రంలోని జాతుల సమతుల్యతను చెరిపివేసింది. 2011 నాటి భారత జనాభా గణనకు చెందిన భాషాపరమైన సంఖ్యను ప్రభుత్వం ఇంకా విడుదల చేయనప్పటికీ, 2001 జనాభా లెక్కలు పరిశీలిస్తే సొంత రాష్ట్రంలోనే అస్సామీ భాష మాట్లాడే ప్రజలు మైనారిటీగా మారిపోయారని స్పష్టమవుతుంది. 1991 నుంచి 2001 మధ్య కాలంలో అస్సామీ భాషను మాట్లాడే జనాభా 58% నుంచి 48 శాతానికి పడిపోయింది. కాగా, బెంగాలీ మాట్లాడే జనాభా మాత్రం 21 నుంచి 28%కి పెరిగింది. ఈ ధోరణిని గమనిస్తే, అస్సామీ భాషని మాట్లాడే జనాభా ప్రస్తుతం 40 శాతం వరకు ఉండగా, బెంగాలీ మాట్లాడే వారు రాష్ట్ర జనాభాలో మూడింట ఒక వంతుగా ఉన్నారు. మతపర కమ్యూనిటీలుగా చూస్తే అస్సాంలో ముస్లిం జనాభా 1951లో 25 శాతం నుంచి 2011 నాటికి 34 శాతానికి పెరిగింది.

జనాభా పొందికలో ఈ భాషాపరమైన, మతపరమైన మార్పులు చాలా ఎక్కువగా బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉండే జిల్లాల్లోనే చోటుచేసుకున్నాయి. అస్సాం ముస్లిం ఆధిక్యతా రాష్ట్రంగా మారేందుకు తక్కువ అవకాశమే ఉన్నప్పటికీ అహోమియా, బోడోలు, ఇతర గిరిజన కమ్యూనిటీలు వంటి భూమిపుత్రుల ఆందోళనలను మాత్రం తోసిపుచ్చలేం. ఏదో ఒక సమయంలో రాష్ట్రంలో జాతుల సంఘర్షణ, హింస పెరిగే అవకాశం పొంచుకుని ఉంది.

నేడు, ఈ భూకంపం మరొకసారి పేలడానికి సిద్ధంగా ఉంది. 1971 మార్చి 25 తర్వాత అస్సాంలో ప్రవేశించిన వలస ప్రజలందరినీ గుర్తించి, రాష్ట్రం నుంచి పంపించివేయాలన్నది 1985లో కుదిరిన అస్సాం ఒడంబడికలోని ప్రధాన షరతుల్లో ఒకటి. అస్సాం గణ పరిషత్ రెండుసార్లు అధికారంలో ఉన్నప్పటికీ ఇది సాధ్యం కాలేదు. 2005లో ఆందోళనకు దిగిన విద్యార్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో కూడా పై వాగ్దానాన్నే మళ్లీ పొందుపర్చడం జరిగింది. కానీ సమస్య పరిష్కారం కాకపోవడంతో, సుప్రీంకోర్టుకు తీసుకెళ్లగా, 1951లో రూపొందించిన జాతీయ పౌరుల నమోదు –ఎన్‌ఆర్‌సి–ని తాజాగా మెరుగుపర్చి అసలైన పౌరులను గుర్తించవలసిందిగా కోర్టు ఆదేశించింది. ఈ పని గత మూడేళ్లుగా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరుగుతోంది. 2017 డిసెంబర్ 31కి ఇది పూర్తి కావలసి ఉంది. పొడిగింపుకోసం రాష్ట్రప్రభుత్వం అభ్యర్థించినప్పటికీ, గడువు తేదీలోపల తొలి ముసాయిదా జాబితానైనా విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది.



తొలి ముసాయిదాతో భయాందోళనలు

అలా విడుదలైన తొలి ముసాయిదా జాబితా గందరగోళానికి, భయాందోళనలకు దారితీసింది. జాతీయ పౌరుల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న 3.29 కోట్లమందిలో 1.9 కోట్లమంది పేర్లు ఈ తొలి ముసాయిదాలో ఉన్నాయి. ఇది తొలి జాబితాయే కావచ్చు. పైగా ఇది ముసాయిదా మాత్రమే. కానీ అంచనాలు మాత్రం చాలా ఎక్కువగా ఉన్నాయి. మైనారిటీ కమ్యూనిటీకి చెందినవారిలో జాబితానుంచి గల్లంతైన వారు ఎవరు అనేది తేల్చడంలో ఇది సహాయపడదు. జాబితాలో లేని వారిని మూడు కేటగిరీలుగా చేయవచ్చు: మూలవాసుల నుంచి పత్రాలు పూర్తి చేయని వారికి చెందిన సాధారణ ఉదంతాలు. సందేహాస్పదమైన కేసులు, పంచాయతీ జారీచేసిన సమర్పిత పత్రాలకు చెందిన ప్రత్యేక కేటగిరీ. ప్రస్తుత వివాదం ఈ మూడో కేటగిరీకి చెందినదే. ఈ ధ్రువపత్రాలను హైకోర్టు తిరస్కరించగా, రాష్ట్ర ప్రభుత్వం మద్దతునిచ్చింది కూడా. ఈ కేటగిరీలో 27 లక్షల మంది ముస్లిం మహిళలు ఉన్నారు. వీరి వివాహాలను నమోదు చేయనందున వీరికి కాగితపు రూపంలో ఎలాంటి రుజువూ లేదు. పైగా వీరికి ఎలాంటి విద్యాపరమైన డిగ్రీలు కూడా లేవు. వీరి పౌరసత్వ హక్కులు రద్దు కావచ్చు.

ఇక్కడే రాజకీయ నాయకత్వం లెక్కలేసుకుంటోంది. విషాదమేమంటే, ప్రధాన రాజకీయ పార్టీలన్నీ తమ ఎన్నికల లెక్కపక్కాలపైనే దృష్టి సారిస్తున్నాయి. సుదీర్ఘకాలం రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ఈ సమస్యను నిర్లక్ష్యం చేసినందుకు అపరాధభావంతో ఉంది. విదేశీ వలసప్రజలకు ఈ పార్టీ ఉచిత ప్రవేశం కల్పించి తర్వాత వారిని తన ఓటుబ్యాంకుగా మల్చుకుంది. దురదృష్టవశాత్తూ ఉదారవాద, ప్రగతిశీల మేధావుల్లో ప్రధానభాగం ఈ పరిస్థితి తీవ్రతను నిర్లక్ష్యం చేశారు. ఇక వామపక్షాలు బెంగాలీ వలసప్రజల పట్ల మౌనం పాటించడమే కాకుండా ఈ సమస్యను లేవనెత్తిన వారిని బహిరంగంగానే ఖండించాయి.

1977 నుంచి 1985 వరకు కొనసాగిన అస్సాం ఉద్యమం ద్వారా విద్యార్థి, యువజనులు భూమిపుత్రులకు సంబంధించిన చట్టబద్ధమైన ఆందోళనను వ్యక్తపర్చారు. ఈ విదేశీ వ్యతిరేక ఉద్యమానికి బెంగాలీ వ్యతిరేకత కూడా ఛాయామాత్రంగా తోడైంది. కాని ఈ ఉద్యమం ముస్లిం వ్యతిరేక రాజకీయాలను స్పష్టంగానే ప్రదర్శించింది. వలస ప్రజల సమస్యను లేవనెత్తడంలో ఉద్యమం విజయవంతమైనప్పటికీ సమర్థ పరిష్కార విషయంలో విఫలమైంది. ఇతర పార్టీలకు మల్లే, అస్సాం గణ పరిషత్‌కి చెందిన రెండు ప్రభుత్వాలు కూడా ఈ అంశంలో అసమర్థంగా ఉండిపోయాయి.

ఈ వైఫల్యమే వికృతమైన మతతత్వ రాజకీయాలకు దారి చూపింది. గత అయిదేళ్లలో బీజేపీ ఈ సమస్యను మతతత్వ సమస్యగా మార్చడంలో విజయవంతం కావడమే కాకుండా, భాషాపరమైన, జాతిపరమైన సమస్యకు మతం రంగు పులిమింది. రాష్ట్రంలో బీజేపీ రాజకీయాలు ప్రధానంగా బెంగాలీ హిందూ ఓటు బ్యాంకుపైనే ఆధారపడ్డాయి. కాబట్టి ఈ పార్టీకి రెండంచెల అజెండా ఉంది. బెంగాలీ హిందువులకు పౌరసత్వ స్థాయిని కల్పించడం, బెంగాలీ ముస్లింలకు ఆ స్థాయిని నిరాకరించడం. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీనే అధికారంలో ఉన్నందున, తన అజెండాను అమలు చేయడానికి ఈ పార్టీ చట్టపరమైన, పాలనా పరమైన మార్గాన్ని ఎంచుకుంది. రాష్ట్ర స్థాయిలో, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం పంచాయతీలు జారీ చేసిన సర్టిఫికెట్ల రద్దును సంతోషంగా సమర్థించింది. ఇక కేంద్ర స్థాయిలో బీజేపీ 1955 పౌరసత్వ చట్టానికి ప్రమాదకరమైన సవరణను తీసుకొస్తోంది. పార్లమెంటులో ఇప్పటికే ప్రవేశపెట్టిన ఈ సవరణ, నేపాల్ మినహా ఇతర దేశాలనుంచి వలస వచ్చినవారికి వారు ముస్లింలు కాదు అన్న ప్రాతిపదికన భారతీయ పౌరసత్వాన్ని ఇచ్చే ప్రక్రియను సరళతరం చేస్తుంది. కాబట్టి బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన హిందువులు ప్రత్యేక స్థాయిని పొందనుండగా అక్కడి నుంచే వచ్చిన ముస్లింలు దానికి దూరమవనున్నారు. ఈ సవరణకు చట్టరూపం కల్పిస్తే, భారతీయ పౌరసత్వానికి మతపరమైన అర్థాన్ని ప్రవేశపెట్టినట్లవుతుంది. మహమ్మదాలీ జిన్నా సూత్రీకరించి రెండు దేశాల సిద్ధాంతానికి ఇది యథాతథంగా సరిపోలుతుంది.

మత ప్రాతిపదికన విభజన ప్రమాదకరం

ముందే ఊహించినట్లుగా, అస్సాం ఈ సమస్యపై విభజితమవుతుంది. హిందూ మతతత్వ రాజకీయ శక్తులు స్థానికులు/బయటివారు అనే విభజనను హిందూ/ముస్లింలుగా మార్చడానికి జాతీయ పౌరసత్వ నమోదును కవచంగా ఉపయోగించుకుంటున్నాయి. మరోవైపున, పలు ముస్లిం సంస్థలు ఎన్‌ఆర్‌సీనే వ్యతిరేకిస్తున్నాయి. ఈ విభజనే ప్రమాదకరంగా విస్ఫోటక స్థాయికి చేరువవుతోంది.

అదృష్టవశాత్తూ, హీరేన్ గొహెయిన్, అపూర్వ బారువా వంటి ప్రముఖ అస్సాం మేధావులు కొందరు మూడవ, ఆరోగ్యకరమైన పంథాను చేపట్టారు. వీరి ప్రతిపాదన మైనారిటీలకు రక్షణ కల్పిస్తూనే, జాతీయ పౌరసత్వ నమోదుకు మద్దతిస్తోంది. అస్సాంలో ముందునుంచి ఉంటున్న వారి భాషాపరమైన, సాంస్కృతికపరమైన, జాతిపరమైన ఆందోళనలు చట్టబద్ధమైనవేనని వీరు గుర్తిస్తూనే, విదేశీయుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరముందని వీరు చెబుతున్నారు. కాబట్టి ఎన్‌ఆర్‌సీ ప్రక్రియను కొనసాగించాలి, మద్దతు ఇవ్వాలి కూడా. అదేసమయంలో ఈ ప్రక్రియలో మతపరమైన వివక్షను పాటించరాదు. ముస్లిం మహిళల పరిస్థితి దృష్ట్యా, పంచాయతీలు జారీచేసిన సర్టిఫికెట్లు చెల్లుతాయని గుర్తించాలి. అంతిమంగా ప్రతిపాదించిన పౌరసత్వం సవరణను ఉపసంహరించుకోవాలి. ఎందుకంటే ఇది భారత రాజ్యాంగానికి, భారత జాతీయోద్యమ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది.

ఈ వైఖరికి సంబంధించి అస్సాంలోనూ, వెలుపల కూడా మనం కచ్చితంగా జాతీయ ఏకాభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉంది. కాని దీనిని ఎవరైనా ఆలకిస్తున్నారా? లేక మనం మరొక నెల్లి తరహా జాతి ఊచకోత ఘటనకు సిద్ధపడుతున్నామా?

వ్యాసకర్త స్వరాజ్ ఇండియా పార్టీ జాతీయ అధ్యక్షులు
మొబైల్ : 98688 88986

నాకు తెలిసిన నందనవనం

విద్య, సామాజిక సేవ ఒక ఎత్తయితే, రమణయ్య సాహిత్యానికీ, పుస్తక ప్రచురణకీ చేసిన సేవ మరొక ఎత్తు. ఇది తెలుగు భాషకు, అభ్యుదయ భావాలకు చేసిన సేవగా భావిస్తాను. ఎన్వీ వెలువరించిన పుస్తకాలు ఆయన అభిరుచికి గీటురాళ్లు.



ప్రొ. వకుళాభరణం రామకృష్ణ

'లలితగారు పోయిన సంగతి తెలిసి, మీ అందరినీ ఒకసారి పలకరించాలని నాన్నగారు చాలా వాపోతున్నారు. కానీ కదలలేని స్థితి' అంటూ ఆ మధ్య నందనవనం వెంకటరమణయ్య కూతురు ఫోన్‌లో చెప్పి, ఆమె కూడా కన్నీటి పర్యంతమైంది. ఇప్పుడు ఆయనే మా అందరినీ విడిచి వెళ్లిపోయారు. రమణయ్య కుటుంబానికీ, నా కుటుంబానికీ; అంతకు మించి మా ఆశయాలకీ, విశ్వాసాలకీ మధ్య మంచి అనుబంధం ఉంది. రమణయ్యతో నా పరిచయం దాదాపు ఆరున్నర దశాబ్దాల నాటిది.


మా ఇద్దరిదీ సింగరాయకొండ ఫిర్కాయే. మాది పాకల. అక్కడికి సమీపంలోనే ఉన్న మరో సముద్రతీర గ్రామం బింగినపల్లి రమణయ్యగారి స్వస్థలం. 1952–53 నాటి మాట. నిజానికి అది చాలా గొప్ప కాలం. అప్పుడే ఆయన పరి చయం. సింగరాయకొండలోనే యువజన సభలు, విద్యార్థి సభలు నిర్వహించిన వాళ్లలో మేం కూడా ఉన్నాం. అవే మా సాన్నిహిత్యాన్ని పటిష్టం చేశాయి. మేమిద్దరం ఒక ఉన్నత పాఠశాల విద్యార్థులం కూడా కాదు. నేను సింగరాయకొండలో చదివాను. ఆయన వేరే చోట చదివేవారు. నేను కావలిలో చదువుకున్నాను. కానీ మా ఇద్దరికీ ప్రేరణ ప్రొఫెసర్ ఎన్. బాలకృష్ణారెడ్డి గారు. అప్పుడు ఆయన ఉపాధ్యాయుడు. తరువాత తిరుపతి విశ్వవిద్యాలయంలో ఆచార్యుడి స్థాయికి ఎదిగారు. అప్పుడు చాలామంది ఆలోచించినట్టే మేం కూడా విద్యార్థులను కూడగట్టాలనీ, యువజనోద్యమంతో సమాజంలో మార్పులు తీసుకురావాలనీ కోరుకునేవాళ్లం. నేను వామపక్షానికి అనుబంధంగా ఉన్న స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో ఉండేవాడిని, రమణయ్య సోషలిస్టు పార్టీ అనుబంధ సంస్థ డెమాక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్‌లో చురుకుగా ఉండేవాడు.

ఇంటర్ తరువాత నేను కావలి కళాశాలలోనే చేరాను. రమణయ్య మాత్రం విజయనగరం మహారాజా కళాశాలలో బి.ఎ.లో చేరాడు. విజయనగరంలో పురిపండా అప్పలస్వామిగారు రమణయ్యకి గురువు. తరువాత నేను ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో ఎం.ఎ.లో చేరాను. నాది చరిత్ర శాఖ. రమణయ్య మధ్యప్రదేశ్‌లోని సాగర్ విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్ర శాఖలో చేరాడు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తయిన తరువాత నేను కావలి కళాశాలలో చేరాను. ఇదే 1964లో జవహర్ భారతి అయింది.

రమణయ్య కూడా ఎంఏ పూర్తి చేసుకుని కావలి వచ్చాడు. ఆయనలో సమాజ సేవ ఒక తృష్ణలా ఉండేది. అలాంటి దశలోనే కావలి కళాశాల రెక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డిగారు రమణయ్యని రాజనీతిశాఖలో అధ్యాపకునిగా నియమించారు. సాహిత్య విమర్శకుడు, వామపక్ష సిద్ధాంతవేత్త కె. వి. రమణారెడ్డి, నా భార్య లలిత కూడా ఆ శాఖలోనే ఉండేవారు.

రమణయ్యని అలుపెరుగని సేవకుడని నేను ఊరికే అనలేదు. 1978 నాటి తుపాను బీభత్సం, తరువాత కావలి పట్టణంలో సర్వనాశనమైన పేదలకు ఆయన అందించిన సేవ, ఆఖరికి మా అందరికీ కూడా అభయ హస్తంలా నిలిచాడు కాబట్టే అలా చెప్పాను. ఆ దృశ్యాలు నాకు ఇప్పటికీ గుర్తే. నాకు ఎప్పటికీ మరపురాని ఘటన– 1981లో జవహర్ భారతి ప్రిన్సిపాల్ పదవి నేను చేపట్టాలని ఆయన పడిన తపన. ఆ సందర్భం అలాంటిది. నిజానికి ఆ తపనలో ఉన్నది కళాశాల గౌరవ ప్రతిష్టలను కాపాడాలన్న సదాశయం ఒక్కటే.

ఇలాంటి విద్య, సామాజిక సేవ ఒక ఎత్తయితే, రమణయ్య సాహిత్యానికీ, పుస్తక ప్రచురణకీ చేసిన సేవ మరొక ఎత్తు. ఇది తెలుగు భాషకు, అభ్యుదయ భావాలకు ఆయన చేసిన సేవగా నేను భావిస్తాను. ఆయన వెలువరించిన పుస్తకాలని ఆయన అభిరుచికి గీటురాళ్లుగా గౌరవిస్తాను కూడా. ప్రపంచ స్థాయి జ్ఞాన వీచికలని తెలుగునాట వీచేటట్టు చేయడానికి ఆయన పడిన శ్రమ వృథా కాలేదు కూడా. కావలిలోనే మేం ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు శతజయంతి వేడుకలు నిర్వహించాం. మళ్లీ ఈ బాధ్యత నెత్తికెత్తుకున్నవాడు రమణయ్యే. 'ఉన్నవ రచనలు కొన్ని' పేరుతో ఒక పుస్తకం వెలువరించాం. మాలపల్లి నవలకు ఏఆర్ కృష్ణ బృందం నాటక రూపం ఇచ్చింది. ఆ బృందంతో కావలిలో ప్రదర్శన ఏర్పాటు చేశాం. సొసైటీ ఫర్ సోషల్ చేంజ్ అనే ఒక వేదిక ఉండేది. దాని ద్వారా కొంత సేవ జరిగింది. దాదాపు పదిహేనేళ్లు కష్టపడి ఒక తపస్సులా ఆయన కొన్ని ప్రత్యేక సంకలనాలను వెలురించాడు.



నివాళి

దొడ్ల రామచంద్రారెడ్డి(జవహర్ భారతి వ్యవస్థాపకులు) గారు విద్యారంగానికి చేసిన సేవ విశేషమైనది. ఆయన పేరుతో రమణయ్య ఒక ప్రత్యేక సంచికను 2005లో వెలువరించారు. 'అక్షర'పేరుతో వచ్చిన ఈ అభినందన సంచికలో 200 వ్యాసాలకు చోటు కల్పించారు. మళ్లీ 2008లోనే 'ఇయర్స్ ఆఫ్ విజన్ – పద్మభూషణ్ పీఆర్ రావు ఫెస్టస్‌క్రిఫ్ట్' సంచికను 299 వ్యాసాలతో ప్రచురించారు. 'మధు మురళి–షెనాలియర్, పద్మభూషణ్ బాల మురళి అభినందన, (61 వ్యాసాలు, 2010); 'శంకరన్', (146 వ్యాసాలు 2012); 'పరిశోధన– సామల సదాశివ స్మృతి సంచిక', (244 వ్యాసాలు, 2014).

ఏ మనిషికైనా దేహయాత్ర ఒక చోట ఆగిపోతుంది. గొప్ప ఆశయాలు కలిగిన వాళ్లు, నిస్వార్థపరులు మిగిల్చి వెళ్లిన ధోరణి అనంతంగా సాగుతూనే ఉండాలని కోరుకుందాం. అదే అలాంటి వారికి మనమిచ్చే నివాళి. రమణయ్యగారి సేవా దృక్పథం, అభిరుచి మన సమాజ హితం కోసం అలా కొనసాగడం అవసరం.

వ్యాసకర్త హెచ్‌సీయూ విశ్రాంత ఆచార్యులు

కనుమరుగౌతున్న పొగ గొట్టాలు

ముంబై గత వైభవ చిహ్నాలుగా నిలిచిన బట్టల మిల్లుల పొగగొట్టాలు ఒక్కటొకటిగా అంతరిస్తుంటే వాటి కంటే ప్రమాదకరమైన విషవాయువులను వెదజల్లుతున్న నగల తయారీ గొట్టాలు పెనుసమస్యకు కారణమవుతున్నాయి.

విశ్లేషణ



మహేశ్ విజాపుర్కర్

ఒకప్పుడు ముంబైలో దాదాపు 80 టెక్స్‌టైల్ మిల్లులుండేవి. మొదటి ప్రపంచ యుద్ధ కాలం వరకు నగరంలో ప్రధాన పారిశ్రామిక కార్యాచరణ పత్తిని దుస్తులుగా మార్చడంగానే ఉండేది. నల్లమందు వ్యాపారంలోని మిగులుతో ఇవి 1850ల మధ్యలో వృద్ధి చెందాయి. ఇటీవలి వరకు దాదాపు 200 అడుగుల ఎత్తున్న బట్టల మిల్లుల పొగ గొట్టాలు ముంబై నగరానికి విశిష్ట చిహ్నంగా ఉండేవి.

ప్రముఖ కార్మిక నేత దత్తా సామంత్ నేతృత్వంలో 1982లో మిల్లు కార్మికులు విఫల సమ్మెను చేపట్టాక ముంబై మిల్లులు పనిచేయడం ఆగిపోయింది. దీంతో పరిస్థితి మారిపోయింది. 1990లో ప్రభుత్వం మిల్లులకు చెందిన భూములను రియల్ ఎస్టేట్‌లోకి మార్చడానికి అనుమతించింది. దీంతో ముంబై ఉజ్వల గతానికి చిహ్నంగా నిలిచిన ఎత్తైన చిమ్నీల స్థానంలో ఇప్పుడు ఆఫీసులు, మాల్స్, గృహసముదాయాలతో కూడిన ఆకాశాన్నంటే టవర్లను ఎవరైనా చూడవచ్చు.

కష్టంతో అయినా సరే, మీకు మంచి గైడ్ దొరికితే, ముంబైలో ఇంకా మిగిలివున్న ఒకటీ, రెండు మిల్లుల గొట్టాలను మీరు గుర్తించవచ్చు. కానీ ఇవి కూడా త్వరగానో, తర్వాతో కూల్చివేతకు సమీపంలో ఉన్నాయి. భూమి కోసం తహతహలాడుతున్న నగరంలో ఖాళీ స్థలాలకు విలువ పెరుగుతోంది. కానీ ఇప్పుడు ఎత్తైన చిమ్నీలు కాకుండా, మరెన్నో పొగగొట్టాలను నగరంలో చూడవచ్చు. కానీ ఇవి చిన్నపాటి స్థలంలో ప్రధానంగా అత్యంత రద్దీ ఉండే దక్షిణ ముంబైలోని కల్బాదేవి ప్రాంతంలో కనిపిస్తాయి. అయితే ఈ చిమ్నీలు బంగారాన్ని నగలుగా మార్చే యూనిట్లకు సంబంధించినవి. ఇక్కడ తయారైన నగలను వలస వచ్చిన మహిళలు ఉపయోగిస్తుంటారు. ఇవి సమీపంలోని జవేరి బజార్‌కు తరలి వెళతాయి. దేశంలోని అతి పెద్ద బంగారం మార్కెట్ ఇదే. ఇవి కల్బాదేవి ఆవరణలో ఈ తయారీ యూనిట్లున్నాయి కాబట్టే ఇక్కడినుంచి జవేరి బజార్‌కు తరలించడం సులభం. కానీ ఇక్కడి ఇతర నివాస ప్రాంతాలకు దీనివల్ల కలుగుతున్న అసౌకర్యం కానీ, ఆరోగ్యానికి కలుగుతున్న ప్రమాదం గురించి కానీ ఆలోచించరు.

బట్టల మిల్లులకు చెందిన పొగగొట్టాలు చిమ్మే పొగలాగా కాకుండా, ఈ నగల తయారీ గొట్టాలు వాటినుంచి విషవాయువులను వెదజల్లుతాయి. ఈ పొగ గొట్టాలు సమీపంలోని పాతవీ, అతి చిన్నవి అయిన నివాస ప్రాంతాలకు దగ్గరగా ఉంటున్నాయి. చావల్స్ అని పిలుస్తున్న ఈ చిన్న అపార్ట్‌మెంట్లు నగరంలోని తొలి సామూహిక గృహాలకు సంకేతాలు. ఒక ఉమ్మడి వరండాలో విడి గదులు ఉంటాయి. వీటి చివరలో ఉమ్మడి మరుగుదొడ్లు ఉంటాయి.

ఇవి ప్రారంభంలో మిల్లులకు సమీపంలో బట్టల మిల్లుల కార్మికులకు నివాసం కల్పించాయి. తర్వాత బట్టల మిల్లులకు వెన్నెముకగా ఉండే విస్తరిస్తున్న నగర ఆర్థిక వ్యవస్థకు సేవ చేసేందుకు వచ్చినవారికి ఆశ్రయం కల్పించాయి. ఈ చిన్న చిన్న గదులు ఇరుగ్గా, గాలి తక్కువగా, సౌకర్యాల లేమితో ఉంటున్నందున జనాభా గణన అధికారులు వీటిని సులువుగా మురికివాడలుగా గుర్తించేవారు. ఈ గృహాలు అక్కడి మొత్తం ప్రాంతాన్ని ప్రమాదకరంగా మార్చేశాయి.



ఈ నగల తయారీ యూనిట్లలో యాసిడ్లను, పెద్ద సంఖ్యలో ఎల్పీజీ సిలెండర్లను నిలువ చేస్తారు. ముడి బంగారాన్ని వీటితో కరిగించి ఒక రూపానికి తెస్తారు. ఈ క్రమంలో వచ్చే వాయువులు అగ్నిప్రమాదాలకు దారితీస్తుంటాయి. ఈ ఇళ్లకు చెందిన మెట్లు సాధారణంగా కొయ్యతో చేసి ఉంటాయి. ఇది మరీ ప్రమాదకరం. బంగారం వేడి చేసేటప్పుడు వచ్చే పొగలు ఇక్కడ రోజువారీ సమస్యగా మారిపోయాయి. ఇక్కడ అగ్నిప్రమాదాలు ఏర్పడే సమస్యే కాదు. ఇక్కడి రోడ్లు ఇరుగ్గా ఉండటంతో ఫైర్ ఇంజన్లు లోపలికి రాలేవు. ఇటీవల సంభవించినట్లుగా అగ్నిప్రమాదాలను ఎదుర్కోవడం ఇక్కడ పెనుసవాలు. నగల వ్యాపారం చేసే జిల్లాల నుంచి వచ్చే రోజువారీ జనాలు మరిన్ని సమస్యలకు కారణమవుతుంటారు.

ఈ నగల తయారీ యూనిట్లను తొలగించాలని ముఖ్యమంత్రి పురపాలక సంస్థను ఆదేశించినప్పటికీ, పసిడి రంగానికి చెందిన సంపన్న, శక్తివంతమైన శక్తులే ఈ యూనిట్ల వృద్ధికి కారకులని పురపాలక సంస్థకు తెలుసు కాబట్టి ఇక్కడ నివాసముంటున్న వారు పరిస్థితి మార్పుపై పెద్దగా ఆశలు పెట్టుకోరు. నగల తయారీ గొట్టాలను తొలగించాలని ఆదేశించి అమలు చేసినా, మళ్లీ అవి ఎలాగోలా ఏర్పడుతుండటంతో పురపాలక అధికారులు హేళనకు గురవుతుంటారు.

బులియన్ మార్కెట్ చాలా కఠోరమైంది. మొండిపట్టు గలది. బాంద్రా–కుర్లా కాంప్లెక్స్ లోని అత్యంత విలువైన డైమండ్ మార్కెట్‌లోని స్థలాలను వీరు కొనుగోలు చేసినప్పటికీ గత దశాబ్దంగా వీటిలో నివసించిన వారే లేకపోయారు. ఎందుకంటే జవేరీ బజార్ వారి వ్యాపారానికి అత్యంత సౌకర్యవంతంగా ఉంది. వ్యాపారానికి ముఖ్యమైనది సామీప్యతే కదా. కాబట్టి ఈసారి ఈ సమస్య పరిష్కారం అటు ముఖ్యమంత్రికీ, ఇటు మునిసిపల్ కార్పొరేషన్‌కీ పరీక్షే మరి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

హైదరాబాద్–కొచువెలి ప్రత్యేక రైలు

సాక్షి, హైదరాబాద్: రద్దీ దృష్ట్యా హైదరాబాద్–కొచువెలి మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఉమాశంకర్‌కుమార్ మంగళవారం తెలిపారు. హైదరాబాద్–కొచువెలి (07115/07116) ప్రత్యేక రైలు ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26, జూన్ 2, 9, 16, 23, 30 తేదీల్లో రాత్రి 9కు బయలుదేరి రెండవ రోజు ఉదయం 3.20కి కొచువెలి చేరుకుంటుంది. ఏప్రిల్ 9, 16, 23, 30, మే 7, 14, 21, 28, జూన్ 4, 11, 18, 25, జూలై 2 తేదీల్లో ఉదయం 7.45కు బయలుదేరి రెండవ రోజు మధ్యాహ్నం 2కు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–ఎర్నాకులం (07117/07118) ప్రత్యేక రైలు ఈ నెల 24, 31, ఫిబ్రవరి 7, 14, 21, 28, మార్చి 7, 14, 21, 28 తేదీల్లో మధ్యాహ్నం 12.50కు బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 25, ఫిబ్రవరి 1, 8, 15, 22, మార్చి 1, 8, 15, 22, 29న రాత్రి 9.45కు బయలుదేరుతుంది.

జేఈఈలో స్క్రైబ్‌గా 11వ తరగతి విద్యార్థులు

గతంలో పదో తరగతి విద్యార్థులకే అవకాశమిచ్చిన సీబీఎస్‌ఈ



సాక్షి, హైదరాబాద్: ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ రాత పరీక్షలో అంధులు, బుద్ధిమాంద్యం (డిస్లెక్సియా), చేతులు, వేళ్లు కోల్పోయిన వారికి ఇచ్చే సహాయకుల (స్క్రైబ్) నిబంధనల్లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ జాయింట్ అడ్మిషన్ బోర్డు మార్పులు చేసింది. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 8న రాత పరీక్ష, అదే నెల 15, 16 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల్లో అంధులు, డిస్లెక్సియాతో బాధపడేవారు, బబ్లింగ్ చేయడానికి వీల్లేకుండా చేతులు, వేళ్లు కోల్పోయిన వారు తమకు సహాయకులుగా 11వ తరగతిలో గణితం సబ్జెక్టు కలిగిన సైన్స్ కోర్సు చదివే విద్యార్థులను తెచ్చుకోవచ్చని స్పష్టం చేసింది. గతంలో పదో తరగతి చదివే విద్యార్థులనే సహాయకులుగా అనుమతించింది. ఈసారి 11వ తరగతి (ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం) విద్యార్థులను అనుమతించేలా జేఈఈ మెయిన్ నోటిఫికేషన్‌లో సవరణ చేసింది. జేఈఈ నిబంధనల ప్రకారం 40 శాతం పైగా అంధత్వం కలిగిన వారికే స్క్రైబ్‌ను అనుమతిస్తారు. సొంతంగా స్క్రైబ్‌ను వెంట తెచ్చుకోవాలనుకునే విద్యార్థులు పరీక్షకు రెండు రోజుల ముందే పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్‌కు చెప్పాలని స్పష్టం చేసింది. ఒకవేళ పరీక్ష కేంద్రం సూపరింటెండెంటే సహాయకుడిని ఏర్పాటు చేస్తే.. పరీక్షకు ఒకరోజు ముందు సహాయకుడిని కలసి, తనకు సహాయ పడగలడా లేదా అన్నది తెల్చుకుని సూపరింటెండెంట్‌కు తెలపాల్సి ఉంటుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ ఇవే నిబంధనలు వర్తించేలా ఐఐటీ కాన్పూర్ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది మే 20న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరగనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో స్క్రైబ్ కావాలనుకునే వారు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిర్ణీత ఫార్మాట్ ప్రకారం ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయా సంస్థలు స్పష్టం చేశాయి.

సీనియారిటీ కల్పించండి

రైల్వే బోర్డు చైర్మన్‌ను కోరిన ఉద్యోగుల సమాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: సంస్థాగత సేవల విభాగంలో రైల్వేలో గ్రూప్–ఎ పదోన్నతి పొందిన ఉద్యోగులకు సీనియారిటీ హోదా కల్పించాలని రైల్వే బోర్డు చైర్మన్‌ను అఖిల భారత జాతీయ రైల్వే ఉద్యోగుల సమాఖ్య నేతలు కోరారు. సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.రాఘవయ్య ఆధ్వర్యంలో నేతలు రైల్వే బోర్డు చైర్మన్‌ను కలసి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఉద్యోగులకు సీనియారిటీ కల్పించే విషయమై ఐఆర్ఈఎం నిబంధనలను అమలు చేయాలని కోరారు. సీనియారిటీ కల్పించడం వల్ల సంస్థాగతంగా సేవల విభాగంలో ఉద్యోగులు మెరుగైన పనితీరును కనబర్చే అవకాశం ఉంటుందని, భరోసా వస్తుందని లేఖలో తెలిపారు.

విద్యా ప్రమాణాల పెంపులో కేంద్రం నిర్లక్ష్యం

మంత్రి కడియం శ్రీహరి ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాల పెంపులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంత్రి కడియం శ్రీహరి అసహనం వ్యక్తం చేశారు. రెండు రోజుల నుంచి ఢిల్లీలో జరుగుతున్న కేంద్ర విద్యా సలహా సంఘ సమావేశాలు మంగళవారం ముగిశాయి. ప్రాథమిక, ఉన్నత విద్యా ప్రమాణాల పెంపునకు ఇచ్చిన సిఫార్సులను కేంద్రం పట్టించుకోవడం లేదని సమావేశంలో కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ ముందు ఆయన అసహనం వ్యక్తం చేశారు. బాలికా విద్యపై కమిటీ ఇచ్చిన నివేదికను సైతం కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. విద్యా ప్రమాణాల పెంపుపై కేంద్రం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ విషయం స్పష్టం చేస్తుందని మీడియాతో మాట్లాడుతూ కడియం శ్రీహరి అన్నారు. ఏటా నిర్వహించే సాధారణ సమావేశాల్లానే ఇప్పుడు కూడా జరిగిందని, ఇలాంటి నామమాత్రపు సమావేశాలతో ఏ ప్రయోజనం ఉండదని కేంద్ర మంత్రికి చెప్పానన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటులో తెలంగాణ ముందంజలో ఉన్న విషయాన్ని కేంద్రం గుర్తించిందన్నారు. కొత్త జిల్లాల్లో కూడా నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరానన్నారు. విద్యాలయాల ఏర్పాటుపై గతంలో ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా కేంద్రం పట్టించుకోలేదని చెప్పారు.

ఉన్నత విద్యలో నాణ్యతకు కార్యాచరణ!

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు స్వయంగా తెలంగాణ ఉన్నత విద్యా మండలే రంగంలోకి దిగాలని నిర్ణయించింది. వచ్చే ఏప్రిల్ నుంచి 2019 మార్చి వరకు ఈ కార్యాచరణను అమలు చేసేలా ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ప్రతి నెలలో చేపట్టబోయే కార్యక్రమాలతో కూడిన షెడ్యూలును వచ్చే నెలలో విడుదల చేయాలని భావిస్తోంది.

భారత ప్రభుత్వం
అణుశక్తి శాఖ
న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్
ఎలక్ట్రికల్ ప్రాజెక్ట్స్, 2వ అంతస్తు
సారథి బిల్డింగ్, ECIL పోస్ట్, హైదరాబాద్-500 062

టెండర్లు కోరుతూ ప్రకటన

దిగువ తెలిపిన పనుల కోసం ఇదే తరహా మరియు పరిమాణం గల పనులు నిర్వహించిన ఆమోదిత మరియు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి **భారత రాష్ట్రపతి తరఫున డిప్యూటీ చీఫ్ ఇంజినీర్(CED, EP&PD), సారథి బిల్డింగ్, న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్, హైదరాబాద్–500062వారు** సీల్డ్ ఐటమ్ రేట్ పబ్లిక్ టెండర్లు కోరుతున్నారు. టెండరు బుక్‌ను అవసరమగు ధర చెల్లించిన తరువాత NFC నుండి పొందవచ్చును.

క్ర. సం.	టెండరు ప్రకటన నం.	పని పేరు	అంచనా వ్యయం (రూ.)	టెండరు డాక్యుమెంట్ ధర (రూ.)	బయానా (రూ.)	టెండరు అమ్మకం కాలవ్యవధి	తెరుచు తేదీ
1	2	3	4	5	6	7	8
1	E/537/2017 (బహిరంగ టెండరు)	NUOFP(P), NFC, హైదరాబాద్ వద్ద డక్టింగ్ & సంబంధిత ఫిట్టింగ్స్ తోసహా వాష్డ్ ఎయిర్ సప్లయ్ యూనిట్/సిస్టమ్ సరఫరా, స్థాపన, పరీక్షించుట మరియు పనిచేయించుట.	48 లక్షలు	1000/– టెండరు బుక్‌ను NFC నుండి పొందవలెను.	96,000/-	24.01.2018 నుండి 10.02.2018	24.02.2018
2	E/535/2017 (బహిరంగ టెండరు)	NFC, హైదరాబాద్‌లోని వివిధ ప్రొడక్షన్ ప్లాంట్స్ మరియు ఇతర ఫెసిలిటీస్ వద్ద GI/SS/MS/FRP మెటీరియల్స్ యొక్క వివిధ పాడయిన/తుప్పుపట్టిన వెంటిలేషన్ డక్ట్స్ మరమ్మతు/రీప్లేస్‌మెంట్ కోసం వార్షిక నిర్వహణ కాంట్రాక్టు	11.33 లక్షలు	1000/– టెండరు బుక్‌ను NFC నుండి పొందవలెను.	22,660/-	24.01.2018 నుండి 10.02.2018	24.02.2018
3	E/539/2018 (బహిరంగ టెండరు)	NFC, హైదరాబాద్ వద్ద విండో, స్ప్లిట్ & క్యాసెట్ టైప్ AC యూనిట్స్ నిర్వహణ & సర్వీసింగ్ చేపట్టేందుకు పద్దెనిమిది (18) నెలల కోసం వార్షిక నిర్వహణ మరియు సర్వీస్ కాంట్రాక్టు.	62.12 లక్షలు	1000/– టెండరు బుక్‌ను NFC నుండి పొందవలెను.	1,24,240/-	17.01.2018 నుండి 31.01.2018	07.02.2018

అర్హతా ప్రమాణాలు, నియమనిబంధనలు మరియు టెండరు కోరుతూ సవివరమైన ప్రకటన కోసం లాగాన్ చేయండి **www.nfc.gov.in**

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ (CED, PD & EP)
భారత రాష్ట్రపతి తరఫున

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL-II,
1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD
O.A. No. 3753 OF 2017

Between:
RBL Bank Limited ....Applicant

AND

M/s. Manisha Agri Biotech Pvt. Ltd & Others ...Defendants

To,1) **M/s. Manisha Agri Biotech Pvt.Ltd.** i) Sy. No. 47/48/49, Near Petrol Station, Gandi Myasamma Road Checkpost, Medchal, R.R. Dist, Telangana 501401. ii) Plot No. 797 & 798, Mallesh Yadav Landmark, 3rd Floor, 100 ft Road, Near YSR Statue, Swamy Ayyappa Housing Society, Madhapur, Hyderabad, Telangana 500081. **Rep. by its Director Mr. M V Krishna Rao** ...**Defendant No.1**

3) **Mr. Mannam Ramana Rao.** S/o. M. Venkateshwara Rao, R/o. H.No.7-04-9/20, Plot No.20, Yashodara Nagar Colony, Bairamalguda Village, L.B. Nagar, Hyderabad, Telangana - 500 074. ...**Defendant No.3**

4) **Mrs. B.Kalavathi Bai,** W/o. B. Satyanarayana, R/o. H.No.6-2-57/A, Sangameshwara Temple, Sangareddy Town, Sanga Reddy Dist, Telangana 502001. ...**Defendant No.4**

5) **Mrs. Putta Bhanu Priya,** W/o. Putta Kishore Kumar, R/o. Plot No.288, Road No.10, MLA & MPs Colony, Jubliee Hills, Hyderabad, Telangana - 500 033. ...**Defendant No.5**

6) **Mr. Putta Kishore Kumar,** S/o. Putta Sanjeev, R/o. Plot No.288, Road No.10, MLA & MPs Colony, Jubliee Hills, Hyderabad, Telangana - 500 033. ...**Defendant No.6**

7) **Mr. Kanumuri Venkata Subba Raju,** S/o. K.S.N.Raju, R/o. Plot No.224, Road No.78, Jubliee Hills, Hyderabad, Telangana - 500 033. ...**Defendant No.7**

9) **M/s.Koundanyashya Power Generation Pvt. Ltd.** Plot No. 797 & 798, Mallesh Yadav Landmark, 3rd Floor, 100 ft Road, Near YSR Statue, Swamy Ayyappa Housing Society, Madhapur, Hyderabad, Telangana 500 081. ...**Defendant No.9**

Summons By Paper Publication, Whereas the applicant has instituted an Original Application under section 19 of the Recovery of Debts Due to Banks and Bankruptcy Act, 1993 against you for recovery of **Rs.4,48,44,732.49/- (Rupees Four Crores Forty Eight Lakhs Forty Four Thousand Seven Hundred Thirty Two and Forty Nine Paise Only) as on 17-01-2017** along with the current and future interest and other reliefs. You are hereby required to show cause on 19.02.2018 at 10:30am in the forenoon in person or by Pleader/Advocate duly instructed as to why the relief prayed for should not be granted. Take Notice that in case of default the application will be heard and determined in your absence.

Sd/-
Registrar
Debts Recovery Tribunal,
Triveni Complex, 1st Floor, Abids, Hyderabad-500 001.

భారత ప్రభుత్వం
జలవనరులు, నది అభివృద్ధి & గంగా పునరుద్ధరణ
మంత్రిత్వ శాఖ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ
18/11, జామ్‌నగర్ హౌస్, మాన్‌సింగ్ రోడ్, న్యూఢిల్లీ–110011

No. T.24011/6/2017-GW/Part-I   తేది : 3 జనవరి, 2018

బహిరంగ ప్రకటన నంబరు 2/2018

భూగర్భ జలాలు తీయుటకోసం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ కోసం CGWA ద్వారా రూపొందించబడిన ముసాయిదా మార్గదర్శక సూత్రాలపై కోరబడిన పరిశీలనలు/సూచనల క్రింద బహిరంగ ప్రకటన నంబరు 7/2017 తేది 13.10.2017ను గమనించవలసిందిగా కోరడమైనది. (అసలు ప్రకటన మరియు ముసాయిదా మార్గదర్శక సూత్రాల వివరాల కోసం వెబ్‌సైట్ **www.mowr.gov.in, www.cgwb.gov.in, www.cgwa.noc.gov.in** రిఫర్ చేయండి)

ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోగా సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీకి చేరు విధంగా పరిశీలనలు/సూచనలు/వ్యాఖ్యల దాఖలు కోసం గడువు తేదీని పొడిగించాలని నిర్ణయించబడింది. పరిశీలనలు/సూచనలు/వ్యాఖ్యలను మెయిల్ చిరునామా : **cgwa@nic.in** పై చైర్మన్/మెంబర్ సెక్రటరీకి అడ్రస్ చేసి పంపాలి లేదా పోస్టుద్వారా మెంబర్ సెక్రటరి, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ 18/11, జామ్‌నగర్ హౌస్, మాన్‌సింగ్ రోడ్, న్యూఢిల్లీ–110011కు పంపాలి.

సం/– అఖిల్ కుమార్
చైర్మన్

davp 45103/11/0027/1718

ఏవోలకు 'పెట్టుబడి సాయం' చెక్ పవర్

సూత్రప్రాయంగా నిర్ణయించిన వ్యవసాయశాఖ

సాక్షి, హైదరాబాద్: రైతులకు పెట్టుబడి సాయం పథకం కింద సొమ్ము పంపిణీకి చెక్ పవర్‌ను మండల వ్యవసాయాధికారి (ఏవో)కి అప్పగించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పారదర్శకత కోసం చెక్‌పై తహసీల్దార్ సంతకం కూడా ఉండాలని యోచిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఖరీఫ్ నుంచి రైతులకు ఎకరాకు రూ.4 వేల చొప్పున పెట్టుబడి సాయంగా ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ సొమ్మును చెక్కుల ద్వారానే అందజేయాలని కూడా నిర్ణయించింది. దీంతో ఈ చెక్కుల జారీ కోసం చెక్ పవర్ ఎవరికి ఇవ్వాలన్న దానిపై వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. ఏడీఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)లకు ఈ బాధ్యత అప్పగించాలని కొందరు అధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే ఒక ఏడీఏ పరిధి అసెంబ్లీ నియోజకవర్గం మేర ఉండటంతో చెక్కుల జారీ ఆలస్యమవుతుందని అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. అదే ఏవోలకు చెక్ పవర్ ఇవ్వడం వల్ల జాప్యం జరిగే అవకాశముండదని భావిస్తున్నట్లు తెలిసింది. దీని ప్రకారం.. పథకం కింద లబ్ధిపొందే రైతుల తుది జాబితాలను, ఆయా రైతుల పేరిట ఉన్న చెక్కులను ఏవోలకు పంపుతారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే ఆ చెక్కులను గ్రామసభల్లో పంపిణీ చేస్తారు.

నదుల అనుసంధానంపై చర్చించాలి

మండలిలో కాంగ్రెస్ ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నదుల అనుసంధానంపై అఖిలపక్షంతో చర్చించాలని శాసనమండలిలో కాంగ్రెస్ ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి మంగళవారం డిమాండ్ చేశారు. నేడు (బుధవారం) ఢిల్లీలో జాతీయ జలవనరుల సంస్థ నిర్వహించనున్న సమావేశంలో ప్రభుత్వం తీసుకోబోయే వైఖరిని ముందే ప్రజలకు చెప్పాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నక్క జిత్తులను, కుటిలత్వాన్ని బయటపెట్టేలా వ్యవహరించాలని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని టీఆర్ఎస్ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. పోలవరం డిజైన్‌ను మార్చేందుకు ఒత్తిడి చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో 40 ఏళ్ల నీటి లెక్కలను ప్రామాణికంగా తీసుకుంటుండగా.. గోదావరి నదిపై మాత్రం 110 ఏళ్ల నీటి లెక్కలను ప్రామాణికంగా తీసుకుంటుందని తెలిపారు. నీటి లెక్కల ప్రామాణికతలను సమీక్షించేలా ఒత్తిడి చేయాలన్నారు. రైతుల పట్టాదారు పాసు పుస్తకాల విషయంలో ప్రభుత్వం అయోమయంతో ఉందన్నారు. పాసు పుస్తకాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని, కంది రైతుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యక్ష ఎన్నికలే మేలు: చాడ



సాక్షి, హైదరాబాద్: పంచాయతీల్లో ప్రత్యక్ష ఎన్నికల విధానమే సరైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. వార్డు సభ్యుల ద్వారా సర్పంచ్‌ను ఎన్నుకోవడమంటే గ్రామాల్లో కక్షలకు బీజం వేయడమేనని ఆయన హెచ్చరించారు. పంచాయతీరాజ్ చట్ట సవరణపై తొందరపాటు నిర్ణయాలు వద్దన్నారు. దీనిపై అన్ని పార్టీలతో అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పదవీకాలం పూర్తయిన సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించకుండా గడువు ఉన్న పంచాయతీలకు ఎన్నికలంటూ హడావుడి చేయడం సరికాదన్నారు.

ఖైదీలకు క్షమాభిక్ష పెట్టండి

సీఎం కేసీఆర్‌కు రేవంత్ లేఖ



సాక్షి, హైదరాబాద్: యావజ్జీవశిక్ష పడిన ఖైదీల్లో ఏడేళ్ల వాస్తవిక జైలుశిక్ష పూర్తి చేసిన వారికి రిపబ్లిక్ డే సందర్భంగా క్షమాభిక్ష పెట్టాలని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంగళవారం ఆయన లేఖ రాశారు. క్షమాభిక్షపై కేసీఆర్ ఇచ్చిన ఎన్నికల హామీ అమలుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. క్షమాభిక్ష కోసం ఎదురు చూస్తున్న ఖైదీలు వారి కుటుంబాలకు నాలుగేళ్లుగా నిరాశ ఎదురవుతుందన్నారు. 1969 నుంచి 2013 దాకా ప్రభుత్వాలు ఇచ్చిన జీవోలను ఆయన గుర్తు చేశారు.

అఖిలపక్షం ఏర్పాటు చేయండి

ప్రత్యక్ష ఎన్నికల విధానంపై సీఎం కేసీఆర్‌కు ఆర్.కృష్ణయ్య లేఖ



సాక్షి, హైదరాబాద్: పంచాయతీల్లో ప్రత్యక్ష ఎన్నిక విధానం మార్పుపై ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టీటీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య కోరారు. దీనిపై అన్ని రాజకీయపార్టీల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో సంస్కరణలకు అభ్యంతరం లేదని, ప్రత్యక్ష ఎన్నికలను మార్చవద్దని సీఎం కేసీఆర్‌కు మంగళవారం రాసిన లేఖలో పేర్కొన్నారు. చట్టసవరణ కోసం ఏర్పాటు చేసిన ఉపసంఘం గ్రామాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ములాఖత్‌లో మంద కృష్ణను కలసి తిరిగి వస్తున్న ఉత్తమ్, కాంగ్రెస్ నేతలు

హక్కులపై ఉక్కుపాదమా?

- చంచల్‌గూడ జైలులో మంద కృష్ణతో ఉత్తమ్ ములాఖత్
- మానవ హక్కుల కోసం ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మానవ హక్కులపై, ప్రజాస్వామ్య ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నారని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. చంచల్‌గూడ జైలులో ఉన్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను, టీడీపీ నేత ప్రతాపరెడ్డిని మంగళవారం ఆయన పరామర్శించారు. రాష్ట్రంలో దళిత, గిరిజన, బీసీలపై పోలీసుల దమనకాండ, నిర్బంధం రోజురోజుకూ పెరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయపరమైన హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని మండిపడ్డారు. మంద కృష్ణ, వంటేరు అరెస్టు పాలకుల దమనకాండకు పరాకాష్ట అని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణకు మంద కృష్ణ రెండు దశాబ్దాలకు పైగా పోరాడుతున్నా.. ఏ ప్రభుత్వమూ ఆయనను జైలులో పెట్టలేదన్నారు. మంద కృష్ణకు బెయిల్ రాకుండా రెండు వారాల పాటు ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు.

నియంత పాలన సాగుతోంది

కేసీఆర్ నియంతలాగా దుర్మార్గమైన, నిర్బంధ పాలనను సాగిస్తున్నారని ఉత్తమ్ విమర్శించారు. సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకున్నందుకు దళిత, బీసీ యువకులను చిత్రహింసలు పెట్టారని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లాలో గిట్టుబాటు ధర కావాలని అడిగిన మిర్చి రైతులను దొంగలుగా చిత్రీకరించి, బేడీలు వేసి జైలులో వేశారని, ఇంతకంటే రాక్షసపాలన ఎక్కడుంటుం దని ప్రశ్నించారు. గజ్వేల్ లో కేసీఆర్‌పై పోటీచేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయిన ప్రతాపరెడ్డిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉద్యోగం రాలేదని ఉస్మానియా యూనివర్సిటీలో ఆత్మహత్య చేసుకున్న మురళి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన ప్రతాపరెడ్డిపై కేసు పెట్టడం దారుణమన్నారు. హక్కుల సాధన కోసం పోరాటాలు చేయక తప్పని పరిస్థితులను పాలకులే కల్పిస్తున్నారని హెచ్చరించారు. మానవ హక్కుల సాధనకు గవర్నర్ సహా అన్ని వేదికల్లో తాము గొంతు వినిపించినా ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. మందకృష్ణ, ప్రతాపరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేసి, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సంపత్, ఎమ్మెల్సీ రంగారెడ్డి, మాజీమంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ మల్లురవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులున్నారు.

18న టీపీసీసీ భేటీ

ఈ నెల 18న టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం ఉంటుందని ఉత్తమ్ వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త పంచాయతీరాజ్ చట్టం తీసుకురానున్న నేపథ్యం లో పార్టీ వ్యూహంపై చర్చించనున్నట్లు తెలిపారు.

2020కల్లా కలల తెలంగాణ

కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

- సాగునీటితో ముమ్ముందు అంతా అద్భుతమే
- శాశ్వత ప్రయోజనం కల్పించేలా ప్రాజెక్టుల నిర్మాణం
- వేగంగా రిజర్వాయర్లను పూర్తి చేయాలి
- నీళ్లు వచ్చిన వెంటనే ఎప్పటికప్పుడు చెరువులు నింపాలని సూచన



సోమవారం ప్రగతి భవన్‌లో కాళేశ్వరం పనులపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రానికి శాశ్వత ప్రయోజనం కలిగే రీతిలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాగుతోందని.. 2020 కల్లా మనం అనుకున్న కలల తెలంగాణ వస్తుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ముమ్ముందు అంతా అద్భుతంగా ఉండబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పరిధిలో రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని.. నీళ్లు రాగానే ఎప్పటికప్పుడు చెరువులను నింపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వివరంగా అధ్యయనం చేసి పనులు కొనసాగించాలని సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల తీరుపై సీఎం కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో మంత్రి హరీశ్‌రావు, ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సీఈ హరిరాం తదితరులతో సమీక్షించారు. తెలంగాణకు ఉజ్వలమైన భవిష్యత్ రూపకల్పనలో భాగమే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణమని కేసీఆర్ పేర్కొన్నారు. మంజీరా, దుందుభి, కనగల్ వాగు, మూసీ, పాకాల సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉప నదులపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సూచించారు.

రిజర్వాయర్ల పనులు వేగిరం చేయండి

అనంతగిరి, రంగనాయక సాగర్ రిజర్వాయర్ల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కరువు ప్రాంతాలు సస్యశ్యామలం కావడానికి ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సాగునీరివ్వాలని, నీళ్లు వచ్చిన వెంటనే చెరువులు నింపుకొంటూ పోవాలని సూచించారు. మిడ్ మానేరు నీటితో చెరువులు, చెక్‌డ్యామ్‌లు నింపాలన్నారు. మల్లన్నసాగర్ కింద కాల్వల పనులను కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. మల్లన్నసాగర్ నుండి సింగూర్‌కు గ్రావిటీ ద్వారానే నీళ్లు పోవాలని, ఆ మార్గంలో ఎక్కువ ప్రాంతం సాగులోకి వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. జాతీయ రహదారి నుంచి మెదక్ పట్టణం వరకు, గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేట నియోజకవర్గాల్లో ఒక్క గుంట భూమి కూడా మిగలకుండా సాగులోకి రావాలన్నారు. గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ లాంటి చోట అద్భుతమైన వసతి గృహాలు నిర్మించాలని మంత్రి హరీశ్ రావుకు సూచించారు. ఆ వసతి గృహాలు ఎత్తైన ప్రదేశాల్లో.. సుమారు 20–30 ఎకరాల స్థలంలో నిర్మిస్తే బాగుంటుందన్నారు.

జీవధారలతో..

అప్పర్ మానేరు ఎట్టి పరిస్థితుల్లో ఎండిపోయే అవకాశం లేదని, అప్పర్ మానేరు నుంచి లోయర్ మానేరు వరకు ఈ ప్రాజెక్టు ఒక జీవధార వంటిదని కేసీఆర్ పేర్కొన్నారు. అలాగే కాకతీయ కాలువ మరో జీవధార అని, గోదావరి మీద కడుతున్న బ్యారేజీలతో ఉత్తర కరీంనగర్ ప్రాంతం ఒక జీవధార అవుతుందని చెప్పారు. ఈ జీవధారలతో పంటలతోపాటు నిత్యం పచ్చదనం నెలకొంటుందన్నారు. ఇక సింగూరు ప్రాజెక్టు నుంచి కొండ పోచమ్మ, మల్లన్నసాగర్ వరకూ జీవధారేనని, దీనివల్ల మెదక్ జిల్లాకున్న మెతుకుసీమ పేరు సార్థకమవుతుందని వ్యాఖ్యానించారు. ఎస్సారెస్పీ ఎప్పటికీ నిండి ఉండాల్సిన అవసరముందని, దానిమీదే మిషన్ భగీరథ ఆధారపడి ఉందని స్పష్టం చేశారు.

'అమ్మ ఒడి' సేవల విస్తరణ

- కొత్తగా మరో 200 వాహనాలు
- 50 ద్విచక్ర అంబులెన్సులు
- ఏఎన్ఎంలకు తక్కువ ధరకు టూ వీలర్లు
- నేడు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ వైద్య సేవలలో మరో ముందడుగు పడింది. అమ్మ ఒడి (102 సేవలు) విస్తరణ, కొత్తగా ద్విచక్ర అంబులెన్సులు, ఏఎన్ఎంలు వినియోగించే ద్విచక్ర వాహనాల (వింగ్స్) సేవలను సీఎం కేసీఆర్ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. కేంద్రం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా అమలవుతున్న జననీ సురక్ష యోజన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పు అయిన మహిళను, శిశువును సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చడం లక్ష్యంగా ఈ కార్యక్రమం మొదలైంది. 2016 డిసెంబర్ 28న రాష్ట్రంలో అమ్మ ఒడి సేవలను ప్రారంభించారు. మొదటి దశలో 41 వాహనాలతో సేవలు మొదలయ్యాయి. జీవీకే ఈఎంఆర్ఐ భాగస్వామ్యంతో 102 వాహనాలకు విస్తరించింది. అయితే 12 జిల్లాల్లోనే ఈ సేవలను కొనసాగిస్తున్నారు. మిగతా జిల్లాల్లోనూ ఈ పథకం అమలుకు కొత్తగా 200 వాహనాలను కొనుగోలు చేశారు. ఈ వాహనాల సేవలు బుధవారం ప్రారంభం కానున్నాయి. అలాగే అత్యవసర సమయాల్లో వేగంగా రోగుల దగ్గరకు వెళ్లేందుకు వినియోగించే ద్విచక్ర అంబులెన్స్ సేవలు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ సేవల కోసం 50 వాహనాలను కొనుగోలు చేశారు. మరోవైపు గ్రామీణ ఆరోగ్య సేవలలో కీలకమైన ఏఎన్ఎంల కోసం తక్కువ ధరతో ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేయించనున్నారు. ఈ వాహనాలను సైతం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఏఎన్ఎంలకు పంపిణీ చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది.

జాప్యం జరిగితే క్రమశిక్షణ చర్యలు

రైతుల సొమ్ము పెండింగ్‌పై హరీశ్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: కంది కొనుగోళ్ల చెల్లింపుల్లో ఆలస్యంపై మార్కెటింగ్ మంత్రి హరీశ్‌రావు అధికారులపై మండిపడ్డారు. రైతులకు చెల్లించాల్సిన సొమ్ము పెండింగ్‌లో ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.145 కోట్లు కందుల రైతులకు, రూ.21 కోట్లు మొక్కజొన్న రైతులకు చెల్లించాలని.. వీటిని వెంటనే చెల్లించాలన్నారు. ఇకపై తాను జిల్లాలు పర్యటించినపుడు తప్పనిసరిగా వ్యవసాయ మార్కెట్ కమిటీలను సందర్శిస్తానని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు తర్వాత రైతులకు చెల్లింపులో జాప్యం జరిగితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానన్నారు. మంగళవారం సచివాలయంలో మార్కెటింగ్ కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సీజన్‌లో కంది దిగుబడి 1.50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా రానుందని అంచనా వేశామన్నారు. 33 వేల మెట్రిక్ టన్నులు కొనేందుకే కేంద్రం సుముఖత చూపిందన్నారు. ఇప్పటివరకు 26,200 మెట్రిక్ టన్నుల కందులు మార్కెట్‌కు వచ్చినట్టు వివరించారు. ఈ నేపథ్యంలో కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలని కోరుతూ బుధవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లో పెండింగులో ఉన్న చెల్లింపులను వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గడ్డిఅన్నారం మార్కెట్‌ను కోహెడకు తరలించనున్నందున.. అత్యాధునిక హంగులు, సాంకేతిక పరిజ్ఞానంతో దాని ఏర్పాటుకోసం 3 ప్రైవేటు సంస్థలు ప్రజెంటేషన్ ఇచ్చాయన్నారు. 15 రోజుల్లో పూర్తి ప్రాజెక్టు రిపోర్ట్ సమర్పించాలని ఆయా సంస్థలను కోరారు.

ఏపీ మంత్రి దేవినేనికి హరీశ్‌రావు లేఖ

రాజోలిబండ ఆధునీకరణ పనులపై చర్చిద్దామని, అందుకు సమయమివ్వాలని ఏపీ జల వనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వర్‌రావుకు మంత్రి హరీశ్ లేఖ రాశారు. ఈ నెల 14న రాసిన లేఖను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. ఆధునీకరణ పనులను ఈ ఏడాది జూలై నాటికి పూర్తి చేసేందుకు కర్ణాటక జల వనరుల మంత్రి ఎంబీ పాటిల్ ఒప్పుకున్నారని, ఈ అంశంలో ఏపీ సహకారం కీలకం అయినందున మూడు రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

'కాకతీయ' నాలుగో దశ ప్రారంభానికి ఫిబ్రవరి 3 డెడ్‌లైన్

మిషన్ కాకతీయ నాలుగో దశ పనులను ఫిబ్రవరి 3 లోగా ప్రారంభించాలని హరీశ్ రావు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈసారి మిషన్ కాకతీయలో ఫీడర్ చానల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్లు, ఎస్పీలను కూడా భాగస్వాములను చేయాలన్నారు. కాకతీయ 4వ దశ పనులపై మంగళవారం సచివాలయం నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెలాఖరులోగా పనుల గ్రౌండింగ్ జరగాలని, ఏ రోజుకారోజు పనుల ఫొటోలను వాట్సాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

కోనేరే లేదు.. తెప్పోత్సవమట!

హైదరాబాద్‌లో పలు ఆలయాల్లో నిధులు స్వాహా



సాక్షి, హైదరాబాద్: దేవాలయాల్లో తెప్పోత్సవానికి చాలా ప్రాధాన్యముంటుంది. కోవెల సమీపంలోని నదిలోనో, సరస్సులోనో, కాదంటే చెరువులోనో, అదీ లేకుంటే పుష్కరిణిలోనో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తెప్పలో ఉంచి సంప్రదాయబద్ధంగా ఊరేగించడమే తెప్పోత్సవం. కానీ... ఆలయం వద్ద కనీసం నీళ్ల మడుగు కూడా లేకుంటే? అయినా తెప్పోత్సవం సాధ్యమా? దీన్ని కూడా సుసాధ్యం చేస్తున్నారు మన దేవాదాయ అధికారులు! ఆ పేరుతో లక్షల్లో ఖర్చు చేసినట్టు చూపి దర్జాగా బిల్లులు పెట్టి డబ్బులు దండుకుంటున్నారు!!

అది సికింద్రాబాద్‌లోని ప్రధాన దేవాలయం. చుట్టూ ఎటు చూసినా భవనాలే తప్ప ఎక్కడా కనీసం చెరువు కూడా ఉండదు. కానీ అక్కడ వేడుకగా తెప్పోత్సవం నిర్వహిస్తున్నారట. పైగా అందుకు రూ.లక్షల్లో ఖర్చయిందంటూ లెక్కలు చూపి మరీ డబ్బులు డ్రా చేస్తున్నారు.

పోనీ ఆలయం చుట్టూ వీధుల్లోనే పల్లకీ సేవ తరహాలో సాదాసీదాగా నిర్వహిస్తున్నారా అంటే అదీ లేదు. ఒక్క సేవకు రూ.15 లక్షలు అయ్యాయంటూ చిట్టాపద్దులు రాశారు! ఇంత చేస్తున్నా కనీసం ఆడిట్ అధికారులు అభ్యంతర పెట్టడం లేదు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులూ ప్రశ్నించడం లేదు. నిధుల అక్రమాలకు సంబంధించి దాఖలైన కేసులో ఇటీవల అధికారులు కోర్టుకు సమర్పించిన చిట్టాపద్దుల్లో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఈ తప్పుడు లెక్కల వ్యవహారంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు కొందరు ఇటీవల సీఎం కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేశారు.

ఆడిట్ లేక ఆగమాగం...

దేవుడికి భక్తులు సమర్పించే సొమ్మును స్వాహా చేసేందుకు ఆలయాల కార్యనిర్వహణాధికారులు తోచిన పేర్లతో లెక్కలు రాసి ఎడాపెడా 'ఖర్చులు' చూపిస్తున్నారు. రాజధానిలో ఆదాయం బాగున్న చాలా దేవాలయాల్లో ఇదే తంతు! స్వామి, అమ్మవార్లకు నానా రకాల సేవల పేరుతో ఆలయ బొక్కసానికి యథాశక్తి కన్నం వేస్తున్నారు. దేవాదాయ శాఖకు సొంతంగా ఆడిట్ విభాగం లేకపోవటం, ప్రభుత్వ ఆడిట్ శాఖ తూతూ మంత్రం తనిఖీలతో సరిపెడుతుండటంతో వారు ఆడింది ఆటగా సాగుతోంది.

బంగారు నగల్లోనూ గోల్‌మాల్!

దేవుడికి భక్తులు సమర్పించే నగలు, బంగారు ముక్కలను బ్యాంకు లాకర్లలో భద్రపరుస్తారు. ఏటా వాటి లెక్కలు రాస్తుండాలి. కానీ రాజధానిలోని ఆ దేవాలయంలో బంగారం లెక్కల్లోనూ గోల్‌మాల్ జరుగుతోంది. వాటి వివరాలను సరిగా నమోదు చేయక చాలావరకు గల్లంతవుతున్నాయని చెబుతున్నారు.

ఎన్నెన్ని సిత్రాలో...!

- తెప్పోత్సవం పేరుతో భారీగా నిధులు స్వాహా చేసిన దేవాలయంలో ఆడిట్ పేరిట కూడా భారీగా ఖర్చు చూపడం విశేషం. సాధారణంగా రూ.25 వేల నుంచి రూ.30 వేలుండే ఆడిట్ ఖర్చు కాస్తా ఓ అధికారి బదిలీపై రాగానే ఏకంగా రూ.2 లక్షలకు చేరింది.
- ఘనంగా ఉత్సవాలు జరిపే ఆలయాల్లో సదరు ఖర్చు ఆధారంగా ఉన్నతాధికారులు ఏటా బడ్జెట్ మంజూరు చేస్తుంటారు. కొందరు ఇక్కడే అధికారులు చక్రం తిప్పుతున్నారు. బడ్జెట్‌ను అమాంతం పెంచి, వచ్చిన నిధులు చాలావరకు ఖర్చయినట్టు బిల్లులు పెడుతున్నారు. భక్తులకు పంచే ప్రసాదాలకు, స్వామివారి నిత్య నివేదన తదితరాలకు ఏటా ఏకంగా రూ. 40 లక్షల వరకు ఖర్చు చూపుతూ వీలైనంత నొక్కేస్తున్నారు.

కేసీఆర్‌ను కలిసిన కొడంగల్ నేతలు

అభివృద్ధి పనుల మంజూరుకు ముఖ్యమంత్రి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయాలని కోరుతూ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి నేతృత్వంలో అక్కడి ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రగతిభవన్‌లో మంత్రులు మహేందర్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి సమక్షంలో వీరందరూ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. కోస్గి మండల కేంద్రంలో బస్ డిపో, కొడంగల్ నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్, కోస్గిలో పోలీస్ సర్కిల్ కార్యాలయం, దౌల్తాబాద్ – బొమ్మరాస్‌పేట్ మండల కేంద్రాల్లో జూనియర్ కాలేజీలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం వెంటనే వీటిని మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.



పెట్రో మంటలు..

▶ మొదటి పేజీ తరువాయి

ఉంది. డీజిల్ ధర అయితే దేశంలోనే అత్యధికంగా ఉండడం గమనార్హం. పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోతుండడంతో.. బండి బయటికి తీద్దామంటే భయమేస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

నొప్పి తెలియకుండా..

చమురు సంస్థలు గతంలో ప్రతి 15 రోజులకోసారి పెట్రోల్, డీజిల్‌ల ధరలను సవరించేవి. అలా చేసినప్పుడు ఒక్కోసారి రెండు మూడు రూపాయల వరకు పెంపు ఉండేది. దాంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమయ్యేది. దీంతో ప్రభుత్వం గతేడాది జూన్ 16 నుంచి రోజువారీ ధరల సవరణ విధానాన్ని తెరపైకి తెచ్చింది. నామమాత్రంగా తొలి 15 రోజుల పాటు ధరలు తగ్గించగా... ఆ తర్వాతి నుంచి మెల్లమెల్లగా మోత మొదలైంది. హైదరాబాద్‌లో గతేడాది జూలై 16న రూ.67.11గా ఉన్న లీటర్ పెట్రోల్ ధర ప్రస్తుతం రూ.75.47కు.. డీజిల్ ధర రూ.60.67 నుంచి రూ.67.23కు చేరింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.76.92కు, డీజిల్ ధర రూ.68.79కు చేరాయి.

సగానికిపైగా మోత పన్నులతోనే..

పెట్రోల్, డీజిల్ అసలు ధరలకు.. వినియోగదారుడికి చేరేవరకు ఉన్న ధరలకు అసలు పోలికే లేదు. ప్రస్తుతం మనం కొనుగోలు చేస్తున్న ధరలో సగానికిపైగా కేంద్ర రాష్ట్రాల పన్నులు, సుంకాలే ఉండడం గమనార్హం. దీనికితోడు దాదాపు రెండేళ్ల కింద అంతర్జాతీయంగా చమురు ధరలు బాగా తగ్గాయి. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశంలో పెట్రోల్, డీజిల్‌ల ధరలు తగ్గించకుండా.. సుంకాలు పెంచి ధరల వ్యత్యాసాన్ని సొమ్ము చేసుకుంది. అలా రెండు మూడు సార్లు సుంకాలు పెంచింది. తర్వాత పెట్రోల్, డీజిల్‌ల ధరలను కూడా కొద్దిగా తగ్గించింది. అయితే కొద్ది నెలలుగా అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమంటున్నాయి. దాంతో దేశంలోనూ పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచుకుంటూ వస్తున్నారు. పెంపుపై ప్రజల్లో వ్యతిరేకత వస్తుండడంతో రోజువారీ ధరల సవరణ విధానాన్ని తెరపైకి తెచ్చారు. ఇలా తరచూ పది పన్నెండు పైసలు పెంచడం, నాలుగైదు పైసలు తగ్గించడం చేస్తూ.. మొత్తంగా పెట్రోల్, డీజిల్‌ల ధరలు బాగా పెంచేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ కింద ఒక్కో లీటర్ పెట్రోల్‌పై రూ.21.48, డీజిల్‌పై రూ.17.33 వసూలు చేస్తోంది. ఈ పన్ను తర్వాతి మొత్తం ధరపై రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్ పన్ను మోత మోగిస్తున్నాయి. మొత్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు కలిపి పెట్రోల్‌పై 57 శాతం, డీజిల్‌పై 44 శాతం భారం పడుతున్నట్లు అంచనా.

రెండో స్థానంలో తెలుగు రాష్ట్రాలు

పెట్రోల్ ఉత్పత్తుల అమ్మకాలపై వ్యాట్, అదనపు సుంకాల విధింపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు దేశంలోనే రెండో స్థానంలో ఉన్నాయి. మహారాష్ట్ర పెట్రోల్‌పై 26 శాతం వ్యాట్‌తో పాటు ప్రతి లీటర్‌పై రూ.9 చొప్పున అదనపు సుంకం వసూలు చేస్తోంది. దీంతో పెట్రోల్‌పై పన్ను 43.71 శాతంగా ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై 31 శాతం వ్యాట్‌కు తోడు ప్రతి లీటర్‌పై రూ.4 అదనపు సుంకం వసూలు చేస్తున్నారు. దీంతో పన్ను 38.82 శాతానికి చేరింది. డీజిల్‌పై 22.25 శాతం పన్ను, ప్రతి లీటర్‌పై రూ.4 సుంకంతో పన్ను శాతం 30.71కి చేరింది. రాష్ట్రంలో పెట్రోల్‌పై 35.20 శాతం, డీజిల్‌పై 27 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఢిల్లీలో పెట్రోల్‌పై పన్ను 27 శాతం, గోవాలో 17 శాతం ఉన్నాయి.

ఇక ముందు బాదుడే!

అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు, చమురు ఉత్పత్తి దేశాలు క్రూడాయిల్ ఉత్పత్తిని తగ్గించాలని నిర్ణయం తీసుకోవడం నేపథ్యంలో.. ధరలు ఎగసిపడుతున్నాయి. మార్కెట్‌లో ప్రస్తుతం ఇండియన్ క్రూడ్ బాస్కెట్ (బ్యారెల్) ధర రూ.4,085గా ఉంది. ఒక బాస్కెట్‌లో 159 లీటర్ల చమురు ఉంటుంది. దానిని రిఫైనరీల్లో శుద్ధి చేసి.. పెట్రోల్, డీజిల్, కిరోసిన్‌లతో పాటు ఇతర ఉత్పన్నాలను వేరుచేస్తారు. వాటిని వేర్వేరు ధరలతో విక్రయిస్తారు. మొత్తంగా పెట్రోల్, డీజిల్‌ల ఉత్పత్తి ఖర్చులు మాత్రం ప్రస్తుతమున్న ధరల్లో దాదాపు సగం మాత్రమే ఉంటాయి. మిగతాదంతా పన్నుల భారమే.

జీఎస్టీలోకి చేర్చితే తగ్గుతాయా?

ప్రస్తుతం దేశవ్యాప్తంగా వస్తుసేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చినా.. పెట్రోలియం ఉత్పత్తులను అందులో చేర్చలేదు. రాష్ట్రాలకు దీని ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం వస్తుండడంతో జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. అదే జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులను తీసుకువస్తే ద్వంద్వ పన్నుల భారం తగ్గి ధరలు తగ్గే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

పలు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ శాతం

రాష్ట్రం	పెట్రోల్	డీజిల్
ఢిల్లీ	27.00	17.37
ఆంధ్రప్రదేశ్	38.82	30.71
తెలంగాణ	35.20	27.00
మహారాష్ట్ర	43.71	26.17
తమిళనాడు	34.00	25,00
ఉత్తరప్రదేశ్	32.46	19.85
కర్ణాటక	30.00	19.00
గోవా	17.00	19.00

(వ్యాట్‌తో పాటు అదనపు పన్నులు కలిపి)

అడ్డగోలు పన్నులు తగ్గించాలి

పెట్రో ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరీ ఎక్సైజ్, అమ్మకం పన్ను వసూలు చేస్తున్నాయి. అందువల్లే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ ఖజానా నింపేందుకు ప్రజలపై పన్ను పోటు వేయడం తగదు. జీఎస్టీ పరిధిలోకి చేర్చితే ధరలు దిగివస్తాయి.

– రియాజ్ ఖాద్రీ, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ చైర్మన్

పైసలు తగ్గిస్తూ.. రూపాయల్లో పెంచుతున్నారు



అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినా ఇక్కడ తగ్గించడం లేదు. పెరిగినప్పుడు మాత్రం పెంచుకుంటూ పోతున్నారు. అప్పుడప్పుడు పైసలు మాత్రమే తగ్గిస్తూ.. పెంచినప్పుడు రూపాయల్లో బాదుతున్నారు.

– సతీష్ దేవ్‌కట్, మిట్టికాషేర్

డ్రైవింగ్ ఫీల్డ్ వదిలేద్దామనిపిస్తోంది..



పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను చూస్తే భయమేస్తోంది. వాహనాన్ని క్యాబ్ లింకులో పెట్టాను. బండి ఫైనాన్స్‌లో ఉంది కాబట్టి తిరగక తప్పడం లేదు. ఫీల్డ్‌నే వదిలేయాలనిపిస్తోంది.

– యూనస్, తార్నాక

వాహనదారులపై మోయలేని భారం



ప్రతి ఒక్కరు ఏదో ఒక వాహనాన్ని వినియోగించక తప్పని పరిస్థితి. ఇలా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ పోతే మోయలేని భారం పడుతోంది.

– శ్రీకాంత్‌రెడ్డి, నానక్‌రాంగూడ

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం, 17-1-2018

బీడు భూమి నుంచి రొట్టెను తుంచితే
అచ్చం చందమామలా ఉంటుంది.. చల్లగా!
వచ్చిన అతిథి కడుపు చల్లగా.
గుజరాత్‌లోని బాకుత్రా ప్రాంతంలో
అతిథులు కావలసినంతమంది.
గింజే కరువవుతుంది.
మగాళ్లయితే వలస పారిపోతారు.
మహిళయితే బీడును పిండి, రొట్టెను చేసి
అతిథికి అన్నం పెడుతుంది.
జీవితాన్ని నిలబెట్టుకుంటుంది.
అలాంటి మహిళల్లో గౌరీబెన్ ఒకరు.





అతిథి సేవోభవ

''వెల్‌కమ్ టు గుజరాత్.. హార్టీ వెల్‌కమ్ టు బాకుత్రా'' స్థానిక వెలకమ్ డ్రింక్ (గంజి)తో ఆహ్వానం పలికింది గౌరీబెన్. అతిథుల్లో ఇద్దరు విదేశీయులు, ఒకరు దక్షిణాది రాష్ట్రం వారు. మూడు గదుల ఆ ఇంట్లో ముందు వరండాలాంటిది ఉంది. అందులో ఒక తూగుటుయ్యాల. దాని మీద ఆసీనులయ్యారు ఆ ముగ్గురూ! వచ్చిన కొత్తవాళ్లు కాస్త పాతబడ్డాక వరండాను ఆనుకొని ఉన్న కాస్త పెద్ద గదిలోకి తీసుకెళ్లింది గౌరీ. మూడు ఎయిర్‌బెడ్స్, వాటి మీద హ్యాండ్ ఎంబ్రాయిడరీ చేసిన బెడ్‌షీట్స్ వేసి ఉన్నాయి. మట్టిగోడలకు వెదురు ఫ్రేమ్స్ ఉన్న పెద్ద కిటికీ ఉంది. దానికీ చేత్తో చేసిన ఎంబ్రాయిడరీ కర్టెన్స్ వేళ్లాడుతున్నాయి. ఓ మూలన చిన్న టేబుల్ ఉంది. దాని మీద కచ్ వర్క్ క్లాత్ పరచుకుని ఉంది. ఇంగ్లిష్ దినపత్రిక రెపరెపలాడుతోంది.

వచ్చిన వాళ్లు కాస్త సేదతీరి స్నానానికి రెడీ అయ్యారు. వాళ్లు అలా ఫ్రెష్ అయి వచ్చేలోపు స్థానిక బ్రేక్‌ఫాస్ట్‌ను వేడివేడిగా ప్లేట్స్‌లో వడ్డించింది గౌరీ. తినేసి బయటకు వెళ్లి పోయారు. మళ్లీ సాయంకాలానికి ఆ గూటికి చేరారు. బయట నుంచి తెచ్చుకున్న డిన్నర్ ముగించి, మళ్లీకాసేపు విశ్రాంతి తీసుకొని రాత్రి చీకటిపడ్డాక నైట్‌లైఫ్ చూడ్డానికి ఊళ్లోకి వచ్చారు.

గుంపులు గుంపులుగా ఆ ఊరివాళ్లు చేస్తున్న రాస్‌గర్బా నృత్యంలో వీళ్లూ చేరి అడుగులు వేస్తున్నారు. గుజరాతీ పదాల అర్థాలను అడిగి మరీ తెలుసుకుంటున్నారు. ప్రాంతీయ తినుబండారాలను రుచి చూస్తున్నారు. అలా స్థానికులతో ఆడిపాడి అలసిసొలసి గౌరీబెన్ ఇల్లు చేరి.. స్నానాల గదిలో పెట్టిన ఆమె పెట్టిన వేడినీళ్లతో స్నానం చేసి ఆదమరిచి నిద్రపోయారు.

ఇలా మూడు రోజులు గౌరీబెన్ ఇంట్లో ఉండి బాకుత్రా, చుట్టుపక్కల ఊళ్లను చూసి నాలుగోరోజు గౌరీ చేతిలో కొంత పైకం పెట్టి వెళ్లిపోయారు.

దాంతో ఆమె సంపాదన ఆ నెలకు 55వేల రూపాయలు! గౌరీ ఆనందానికి అవధుల్లేవు! ఆ డబ్బును బొడ్లో దోపుకున్న బట్వాలో దాచుకుని గతాన్ని గుర్తుచేసుకుంది ఒక్కసారిగా!



● గౌరీబెన్: ఇల్లే అతిథి గృహం

> ''టూరిస్ట్‌లు మా ఊళ్లు చూడ్డమే కాదు మా దగ్గర ఎంబ్రాయిడరీ, కచ్‌వర్క్స్ కూడా నేర్చుకుంటున్నారు. అవి నేర్పినందుకు ఎంతోకొంత డబ్బు ఇస్తున్నారు. మేమూ వాళ్ల దగ్గర ఇంగ్లీష్ నేర్చుకుంటున్నాం. ఇప్పుడు నాకు ఇంగ్లిష్‌లో ముఖ్యమైన పదాలన్నీ వచ్చు.
> – గౌరీబెన్

అదోక విషాదం

బాకుత్రానే కాదు ఆ చుట్టుపక్కలున్న మెహస్నా, ఛోటా ఉదేపూర్, సురేంద్రనగర్, ఆరావళి.. వంటి ఊళ్లో విపరీతమైన నీటి ఎద్దడి. కడివెడు నీటికోసం కోసుల దూరం నడిచివెళ్లాలి. వర్షాలు పడితేనే వ్యవసాయం. అదీ అప్పులమయం. సంవత్సరానికి కనాకష్టంగా రెండు పంటలు వస్తాయి. గౌరీబెన్‌కు ముగ్గురు కొడుకులు. మూడు ఎకరాల పొలం. యేడాదికి 45 వేల రూపాయల ఆదాయం. అందులోనే కుటుంబమంతటికీ కూడు, గుడ్డ, బడి, గుడి, ఆరోగ్యం అన్నీ! అప్పుల భారాన్నీ తగ్గించుకునేది ఆ డబ్బుతోనే! ఈ కష్టాలను ఈదాలంటే కళ్లల్లో నీళ్లొచ్చేవి గౌరీకి. అప్పటికే సెల్ఫ్ ఎంప్లాయ్డ్ విమెన్స్ అసోసియేషన్ (సేవా)లో చేరి ఎంబ్రాయిడరీ, కచ్‌వర్క్‌కు మెరుగులు దిద్దుకున్నారు గౌరీ, ఆమె ముగ్గురు కోడళ్లు. కుర్తీలు, చీరల మీద ఎంబ్రాయిడరీ కుట్టడాన్నీ ఒక వృత్తిగా చేసుకున్నారు అదనపు ఆదాయం కోసం. కాని అరకొరగానే ఉండేది. ఎందుకంటే ఆ ఊరితోపాటు చుట్టుపక్కల ఊళ్లలోని చాలామంది మహిళలూ సేవాలో చేరారు.. ఇదే పనిచేస్తున్నారు. కాబట్టి వచ్చిన డబ్బును పంచుకోవాల్సి వచ్చేది. ఇది సేవాకూ సవాలే అయింది. అప్పుడు ఆ ప్రాంతాలను పరికించింది సేవా. టూరిజం ఎక్కువ. రాన్ ఆఫ్ కచ్‌కు దగ్గరగా ఉన్న ఆ ఊళ్లను చూడ్డానికి, ఆ జీవనశైలిని అధ్యయనం చేయడానికి, పరిశీలించడానికి నిరంతరం టూరిస్ట్‌లు వస్తూనే ఉంటారు. దరిదాపుల్లో మంచి హోటళ్లు లేవు. 'హమ్ సబ్ ఏక్‌హై'అనే ప్రయోగాత్మక ప్రోగ్రామ్ కింద ఇళ్లల్లో టూరిస్ట్‌లకు బసను ఏర్పాటు చేసే ఎయిర్‌బిఎన్‌బి (Airbnb) అంటే ఎయిర్‌బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్నీ ప్రారంభించింది సేవా. ఇదీ మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించేదే. ఆసక్తి ఉన్నవాళ్లు ఈ జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలి. తొలుత కేవలం తొమ్మిది మందితోనే మొదలైంది. వాళ్లలో గౌరీబెన్ ఒకరు. ఈ తొమ్మిది మందికి వస్తున్న ఆదాయం చూసి మరికొంత మంది చేరారు. అలా గౌరీబెన్ తన చెల్లెలినీ చేర్పించింది. ఆమె కూడా నెలకు సగటున 45వేల రూపాయలు సంపాదిస్తోంది టూరిస్ట్‌లకు ఆతిథ్యం ఇస్తూ.

ఎవరో తలుపు తట్టడంతో ఈ జ్ఞాపకాల్లోంచి బయట పడింది గౌరీబెన్. కొత్త అతిథులు అయిదుగురు గుమ్మం ముందు ఉన్నారు నవ్వుతూ! సాదరంగా ఆహ్వానిస్తూ తన రొటిన్‌పనిలో పడిపోయింది గౌరీబెన్.



● 'సేవా' సంస్థ ఆధ్వర్యంలో ఆతిథ్యంపై శిక్షణ పొందుతున్న గుజరాత్ మహిళలు

ఎంతోమందికి ఆధారం

ఇప్పుడు ఆ ఊళ్లల్లో ఈ ఎయిర్‌బిఎన్‌బిలో చేరిన వాళ్ల సంఖ్యా యాభై! నెలకు 35 వేల వరకు సంపాదిస్తున్నారు. సీజన్‌లో అంటే గుజరాత్ సందర్శనకు అనువైన కాలంలో ఒక్క నెలలోనే గరిష్ఠంగా ఎనభైవేలు సంపాదిస్తున్నారు. మెహసనా అనే ఊళ్లో నలభైఏళ్ల మాయాబెన్‌ది ఒకప్పుడు తన ఇద్దరు పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని పరిస్థితి. ఇప్పుడు నెలకు 30 వేల రూపాయలు గడిస్తోంది. మొన్న డిసెంబర్‌లో అయితే 80 వేల రూపాయలు సంపాదించింది. టూరిస్ట్‌లకు తన ఇల్లు సరిపోక పక్కనున్న ఇళ్లను కూడా అద్దెకు తీసుకుంది.

'సముద్ర తీరంలో చింతపండు దొరకదు.. అడవిలో ఉప్పు దొరకదు. ఈ రెండూ దొరికే చోట వీటిని కలిపి పచ్చడి చేసి అమ్మితే అదే ఉపాధి' అని ఓ సినిమాలోని డైలాగ్! గుజరాత్‌లోని ఈ ఊళ్లకు ఇలాంటి ఉపాయాన్నే కనిపెట్టి అక్కడ లేనిదాన్ని వదిలేసి ఉన్నదాంతో ఉపాధి చూపించింది 'సేవా'! చదువు లేని మహిళలనూ ఎంట్రప్రెన్యూర్స్‌గా మార్చింది. ఈ ఎయిర్‌బిఎన్‌బిని గుజరాత్ అంతటకీ విస్తరింపచేస్తూ రాజస్తాన్, ఉత్తరాఖండ్, జమ్మూ అండ్ కశ్మీర్, అస్సామ్, సిక్కిం, నాగాల్యాండ్ రాష్ట్రాల్లోనూ పరిచయం చేయాలనే ప్లాన్‌లో ఉంది సేవా. ఈ స్ఫూర్తి మన ఊళ్లకూ విస్తరిస్తే, ఇక్కడి మహిళలకూ బాగుంటుంది.

– శరాది

జైలు శిక్షణ

వదినామరదళ్లు! కన్నడం పరవళ్లు

జైలు జీవితం ఎందుకని అడిగితే... చేసిన తప్పుకు శిక్షను అనుభవించడానికి అని చెప్తాం. నిజానికి నేరం చేసిన వారిని జైల్లో ఉంచడం వెనుక ఉన్న పరమార్థం వారిలో పరివర్తన తీసుకురావడమే. అలాంటి పరివర్తన అన్నాడీఎంకే నాయకురాలు శశికళకు మొదలైనట్లే ఉంది. నాలుగేళ్ల శిక్షలో భాగంగా శశికళ కర్ణాటకలోని పరప్పన అగ్రహార జైల్లో ఉంటున్నారు. అక్కడ ఆమె 'అడల్ట్ లిటరసీ ప్రోగ్రామ్' (వయోజన అక్షరాస్యత కార్యక్రమం)లో చేరి కన్నడ అక్షరాలు దిద్దుతున్నారు. కన్నడలో పదాలు చదవడం, రాయడం నేర్చుకుంటున్నారు. అలాగే కంప్యూటర్ ఎడ్యుకేషన్ క్లాస్‌లకూ హాజరవుతున్నారు. లైబ్రరీలో ఎక్కువ సమయం గడుపుతున్నారు.



● శశికళ, ఇళవరసి (ఫైల్ ఫొటో)

మౌనమే సమాధానం

శశికళ కన్నడ భాషను ఏ మేరకు నేర్చుకున్నారనేది నిర్ధారించడానికి అధికారులు ఇప్పటికే ఒక మౌఖిక కూడా నిర్వహించారు. అయితే ఆ రోజు శశికళ మౌనవ్రతంలో ఉండటంతో ఏ ప్రశ్నలకూ నోరు తెరిచి సమాధానం ఇవ్వలేదు. మౌఖికంగా సమాధానాలివ్వకపోయినా ఆమె కన్నడ అక్షరాలు, పదాలను చక్కగా రాస్తున్నారని, సిలబస్‌ను చక్కగా పూర్తి చేశారనే ఒక అంచనాకు రావడానికి అది సరిపోతుందని జైలు వర్గాలు అంటున్నాయి. అంటే.. 'లిటరసీ ప్రోగ్రామ్'లో విజయవంతంగా పాల్గొన్నట్లు శశికళ చేతికి త్వరలోనే ఒక సర్టిఫికెట్ రాబోతోంది. శశికళతోపాటు అదే కేసులో శిక్షను అనుభవిస్తున్న ఆమె మరదలు ఇళవరసి కూడా కన్నడం నేర్చుకుంటున్నారు.

మహిళలకు లైబ్రరీ!

ఇప్పటి వరకు పరప్పన సెంట్రల్ జైలులో మహిళల విభాగంలో లైబ్రరీ లేదు. ఇప్పుడు శశికళ చొరవతో లైబ్రరీని విస్తరించి మరో రెండు విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో ఒకటి విచారణ ఖైదీలకు, మరొకటి మహిళా ఖైదీల కోసం. మహిళల లైబ్రరీ కోసం ముప్పై వేలు పెట్టి వార్తాపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు అన్నీ కలిపి 91 పత్రికలు తెప్పించడానికి రంగం సిద్ధమైంది. ర్యాక్‌లు రెడీ అవుతున్నాయి!

– మంజీర

గుడ్‌ఫుడ్

జీర్ణసమస్యలను తగ్గించే వంకాయ...

వంకాయను చాలామంది దూరం పెడుతుంటారు గానీ... నిజానికి వంకాయ ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది. ● వంకాయలో అనేక పోషకాలు, విటమిన్లు, ఫాస్ఫరస్, కాపర్, డయటరీ ఫైబర్, ఫోలిక్ యాసిడ్, పొటాషియమ్, మాంగనీస్ పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఇది రోగనిరోధక శక్తిని పెంపొందించి, ఆరోగ్యానికి అన్ని విధాలా మేలు చేస్తుంది ● వంకాయలో పీచు పదార్థాలు చాలా ఎక్కువ. అందుకే ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ● వంకాయలోని ఫైబర్ చెడు కొలెస్ట్రాల్‌ను చాలావరకు అడ్డుకుంటుంది. దాంతో గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశాలు తగ్గుతాయి ● వంకాయలో ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉండటం వల్ల గర్భస్థపిండంలోని పుట్టుకతో వచ్చే న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్ వంటి లోపాలను నివారిస్తుంది. అందుకే దీన్ని గర్భిణులకు సిఫార్సు చేయవచ్చు.





చెట్టు నీడ

తొంభై తొమ్మిది

ఒకానొక రాజ్యంలో ఒక రాజుగారు ఉండేవారు. రాజ్య ధనాగారాలు ఎప్పుడూ సిరి సంపదలతో పొంగిపొర్లుతూ ఉండేవి. రాజుగారు కూడా అతి విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ ఉండేవారు. అయినా గానీ ఆయన ముఖంలో నిత్యం అసంతృప్తి తాండవిస్తుండేది! ఓ రోజు ఉదయాన్నే నిద్ర లేచిన రాజుకు, మందిర సేవకుడొకడు ఉల్లాసంగా పల్లె పదాలు పాడుకుంటూ పనిచేసుకోవడం కనిపించింది. రాజు ఆశ్చర్యపోయాడు. ఏమీ లేనివాడు ఇంత సంతోషంగా ఉండటం ఏమిటి? అన్నీ ఉన్న తను అసంతృప్తితో జీవించడం ఏమిటి? అనుకున్నాడు. వెంటనే సేవకుడిని పిలిచి, 'నీ సంతోషానికి కారణం ఏమిటి?' అని అడిగాడు.

అందుకు ఆ సేవకుడు వినయంగా నమస్కరించి, ''మహారాజా.. ఇది సంతోషం అని నాకు తెలీదు. అదే సంతోషమైతే కనుక అది తప్ప నా దగ్గర ఏమీ లేదు'' అన్నాడు.

రాజుకు ఆ సమాధానం సంతృప్తి కలిగించలేదు. ఆంతరంగిక సలహాదారును పిలిచి, ''ఆ సేవకుడు ఎందుకు అంత సంతోషంగా ఉన్నాడు? నాకెందుకు అంత సంతోషం లేకుండా పోయింది'' అని అడిగాడు. సలహాదారుకు విషయం అర్థమైంది. ''మహారాజా.. ఆ సేవకుడు 'తొంభై తొమ్మిది' కూటమిలో సభ్యుడైనట్లుగా లేడు. అందుకే అంత సంతోషంగా ఉండగలుగుతున్నాడు'' అని చెప్పాడు.


''తొంభై తొమ్మిది అనే కూటమి ఒకటి ఉందా?'' అడిగాడు రాజు ఆశ్చర్యపోతూ.

''అవును మహారాజా, ఇప్పుడే ఆ సేవకుడిని ఆ కూటమిలో చేరుస్తాను. తర్వాత ఏం జరుగుతుందో చూడండి'' అని చెప్పి, ఆ తెల్లారే తొంభై తొమ్మిది బంగారు నాణేలు ఉన్న సంచినీ ఆ సేవకుడి ఇంటి గడప ముందు పెట్టించాడు సలహాదారు.

సంచీని చూసి ఆశ్చర్యపోయిన సేవకుడు ఇంట్లోకి వెళ్లి, తలుపులు వేసుకుని నాణేలను లెక్కించి చూసుకున్నాడు. తొంభై తొమ్మిది నాణేలు ఉన్నాయి. అన్ని బంగారు నాణేలు ఉన్నందుకు సంతోషించకపోగా, ఇంకొక్క నాణెం ఉంటే నూరు నాణేలు అయి ఉండేవి కదా అని సేవకుడి మనస్సు ఉసూరుమంది. ఎలాగైనా సరే వాటిని నూరు నాణేలను చేయాలనుకున్నాడు. ఆ క్షణం నుంచీ మితిమీరి కష్టపడటం మొదలుపెట్టాడు. నూరో నాణేనికి అవసరమైనంత బంగారం కోసం డబ్బు కూడబెట్టడం మొదలు పెట్టాడు. సరిగ్గా తినడం మానేశాడు. ఇంట్లోవాళ్లను పట్టించుకోవడం మానేశాడు. పైగా వాళ్లేదైనా మాట్లాడుతుంటే వాళ్లపై చికాకు పడటం మొదలుపెట్టాడు. చివరికి ఆ సేవకుడు ఎప్పుడూ ఆ నూరో నాణెం గురించే ఆలోచిస్తూ సంతోషం అన్నదే మర్చిపోయాడు. ఇదంతా ఆంతరంగిక సలహాదారు ద్వారా విన్న రాజుగారికి తన అసంతృప్తికి కారణం ఏమిటో తెలిసింది. ఎక్కువ కోసం ఎప్పుడైతే మనలో ఆరాటం మొదలౌతుందో ఆ క్షణం నుంచే మనకు ఉన్నవన్నీ తక్కువైపోతాయి. సంతోషం, నిద్ర, ఆరోగ్యం, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడ్డం.. అన్నీ తగ్గిపోతాయి.



వియ్ ది విమెన్



నేప్‌క్వీన్

వయసుకు తగిన పనే అయినప్పటికీ, పదిహేడేళ్ల అమికా జార్జి తన వయసుకు మించిన కార్యాన్నే భుజాన వేసుకున్నారు! లండన్‌లో చదువుకుంటున్న ఈ కేరళ అమ్మాయిని.. టీవీలో యథాలాపంగా కనిపించిన వార్త ఒకటి 'ఫ్రీ పీరియడ్స్' అనే ఉద్యమానికి పురికొల్పేలా చేసింది! ఇంగ్లండ్‌కు ఉత్తరాన ఉన్న లీడ్స్ నగరంలోని అనేక నిరుపేద కుటుంబాలలో శానిటరీ నేప్‌కిన్స్ కొనే స్తోమత లేక, నెలకు కనీసం నాలుగైదు రోజులు స్కూలు మానేస్తున్న పదీ, ఆపై వయసుగల బాలికలపై వచ్చిన ప్రత్యేక వార్తాకథనం అది. అంతగా ఆ వార్త తనను కదిలించిన కొన్నాళ్ల తర్వాత అమికా జార్జి 'ఫ్రీ పీరియడ్స్' ఉద్యమాన్ని ప్రారంభించి, లక్షా ముప్పైవేల సంతకాలు సేకరించి గత నెలలో బ్రిటన్ ప్రభుత్వ దృష్టికి ఈ 'నెలసరి పేదరికాన్ని' తీసుకెళ్లారు. త్వరలోనే ఆమె బ్రిటన్ విద్యాశాఖ మంత్రి జస్టిన్ గ్రీనింగ్‌ని కూడా కలిసి, బాలికల చదువుకు ఆటంకం కలిగిస్తున్న 'పీరియడ్ పావర్టీ'ని నిర్మూలించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అభ్యర్థించబోతున్నారు! స్త్రీల అసౌకర్యాలను గుర్తించడం కూడా స్త్రీల సదుపాయాల కల్పనలో ఒక భాగమేనని అంత పెద్ద ప్రభుత్వానికి ఇంత చిన్న పిల్ల గుర్తుచేయవలసి వచ్చింది!

జ్ఞాపకాల రచయిత్రి

బెర్లిన్‌లోని పార్లమెంటు భవనం 'రీచ్‌స్టాగ్' గోడలపై రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి రష్యా సైనికుల భావోద్వేగ లేఖనాలు ఇంకా అలాగే పదిలంగా ఉన్నాయి. జర్మనీని ఓడించే క్రమంలో రీచ్‌స్టాగ్‌లో భవనంలోకి ప్రవేశించిన రష్యా సైనికులు అక్కడి గోడల నిండా జర్మనీ దురహంకారంపై నిప్పులు చెరుగుతూ ఆగ్రహావేశాలతో కూడిన వ్యాఖ్యలను లిఖించారు. 'నీకు జరగవలసిందే జరిగింది', 'ఏ విత్తనాలైతే నువ్వు వేశావో, అవే విత్తనాలు నీకోసం మొలకెత్తాయి', 'లక్షల కుటుంబాలను విచ్ఛిన్నం



చేసిన జర్మనీ ఇప్పుడు తన కుటుంబాన్ని కోల్పోయి దిగాలుగా కూర్చోబోతోంది'.. ఇలా వివిధ ఉద్వేగాలు అక్షరాలుగా గోడలకెక్కాయి. యుద్ధం అనంతరం వచ్చిన ప్రభుత్వాలు రీచ్‌స్టాగ్ భవనానికి ఎన్ని మెరుగులు దిద్దినప్పటికీ గోడలపై రాతల రూపంలో ఉన్న ఆనాటి జ్ఞాపకాలు చెరిగిపోకుండా జాగ్రత్త పడ్డాయి. ఇప్పుడు వీటన్నిటినీ కెరిన్ ఫెలిక్స్ అనే 68 ఏళ్ల జర్మన్ మహిళ పుస్తక రూపంలోకి తేబోతున్నారు! ఆ కుడ్య లేఖనాలన్నిటినీ ఒక క్రమ పద్ధతిలో అమర్చి, అనువదించి, వాటికి ఓ ముప్పై వరకు రష్యన్ సైనికుల కథలను ఆమె జోడిస్తోంది. ఈ గెలుపు ఓటముల ప్రపంచంలో జ్ఞాపకాలు, గుణపాఠాలు మిగిలేది ఎప్పటికైనా మహిళల వల్లనే.



అమలా పాల్

ఏం చదివారు?

ఆడపిల్లలు చదువుకు వ్యాల్యూ ఇస్తారు. శ్రద్ధగా చదువుతారు. మంచి మార్కులు సంపాదిస్తారు. ఇంకా చదివిస్తే మంచి ఉద్యోగం కూడా తెచ్చుకుంటారు. మనమే చదివించం! మన బాధ్యతలు మనకు ఉంటాయి కదా, మంచి అబ్బాయిని చూసి పెళ్లి చేసేయాలని! మన భయాలు మనకు ఉంటాయి కదా, ఆడపిల్లను ఎక్కువ చదివిస్తే, అబ్బాయి దొరకడం కష్టమౌతుందని! (మన బాధ్యతలు నిజమే కానీ, మన భయాలు నిజమైనవి కావు. అమ్మాయిలను చక్కగా చదివించి చూడండి.. భయాలు ఎగిరిపోయి, బాధ్యతలు తేలికైపోతాయి). మన అమ్మాయిలే కాదు, బాగా డబ్బు, అందం, సొసైటీలో పలుకుబడి ఉన్న సినీ సెలబ్రిటీ కుటుంబాలలోని ఆడపిల్లలు కూడా చదువునే ఎక్కువగా ఇష్టపడతారు. కాలేజీలో ఉన్నప్పుడు సినిమా చాన్స్ వస్తే, ముందు స్టడీస్ ఫినిష్ అవ్వాలి అంటారు. సొసైటీలో కూడా చదువుకున్న అమ్మాయిలంటే రెస్పెక్ట్ ఉంది. అందుకే చూడండి, సినిమాల్లో ఎంత పెద్ద స్టార్ అయినా, ఏదో ఒక ఇంటర్వ్యూలో 'ఏం చదువుకున్నారు?' అని ప్రశ్న వచ్చేస్తుంది. ప్రస్తుతం నయనతార మన తెలుగు స్క్రీన్ మీద ఉన్నారు. ఆమెతో పాటు, మరికొందరు సినీ తారలు ఏం చదువుకుని, వెండితెరపైకి వచ్చారో ఒక లుక్కేద్దాం. వాళ్ల బుక్కుల్ని తిరగేద్దాం.


నయనతార బి.ఎ. ఇంగ్లిష్ లిటరేచర్, **అనుష్క** బి.సి.ఎ. (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్), **సమంత** బి.కాం., **తమన్నా** బి.ఎ., **త్రిష** బి.బి.ఎ. (బ్యాచిలర్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్), **కాజల్** మాస్ మీడియాలో బ్యాచిలర్స్ డిగ్రీ, **రకుల్‌ప్రీత్ సింగ్** మాస్ మీడియాలో బ్యాచిలర్స్ డిగ్రీ, **శ్రియ** బి.ఎ. (లిటరేచర్), **తాప్సీ** బి.టెక్. కంప్యూటర్ సైన్స్, **అమలా పాల్** బి.ఎ. (కమ్యూనికేటివ్ ఇంగ్లిష్), **నిత్యా మీనన్** జర్నలిజంలో గ్రాడ్యుయేషన్, **సాయి పల్లవి** ఎం.బి.బి.ఎస్.



సాయి పల్లవి

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
బుధవారం
17-1-2018

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా.. నేను ఒక అబ్బాయిని లవ్ చేస్తున్నాను. అంతా బాగానే ఉంది అనుకునే సమయంలో ''నన్ను వదిలెయ్యి.. నువ్వంటే నాకు ఇష్టం లేదు'' అని వదిలేశాడు. చాలా ఏడ్చాను. కాలేజ్‌కి కూడా వెళ్లడం మానేశాను. ఆ విషయం తెలిసిన నా బెస్ట్‌ఫ్రెండ్ నాకు ధైర్యం చెప్పాడు. ఆ విషయం మర్చిపోవాలి అనుకునే సమయంలో.. నా బెస్ట్‌ఫ్రెండే నాకు ప్రపోజ్ చేశాడు. ''నువ్వు నాతో ఉంటానని చెప్పు చాలు.. మా అమ్మలా నిన్ను చూసుకుంటా'' అంటున్నాడు. నా పరిస్థితి ఏంటో నాకే అర్థం కావడంలేదు. మీరైనా నాకో మంచి సలహా ఇవ్వండి అన్నయ్యా. మీ ఆన్సర్‌తో నా లైఫ్ ముడిపడి ఉంది ప్లీజ్.

\- ఆశ

ఏం.... వాడికి అమ్మలేదా?
ఇప్పుడు మనమే అమ్మ అవ్వాలా?
ఈ పెంట డైలాగులు కొట్టి..
వీక్‌గా ఉన్న నీకు పూస్తున్నాడు బటర్...!
జారీపడ్డావో.. ఖేల్ ఖతం చెల్లెమ్మా... బీ కేర్‌ఫుల్!

'ఏంటి సార్ కష్టాల్లో ఉన్నప్పుడు...
అన్నయ్యగా మీరు ఓదార్చగా లేనిది...
ఒక కొడుకుగా ఓదార్చడం తప్పా సార్ ఆ గుడ్ బాయ్‌ది?'

కొడుకు కొడుకులా ఉండాలి...!
ప్రపోజ్ చేస్తే అమ్మలా చెంప పగలకొట్టాలి...!
డర్టీ ఫెలో.. కన్నీరు తుడిచినట్టు చేసి...
సింపతి చూపినట్టు నాటకం ఆడి...
పడేద్దామనుకుంటున్నాడు.. రాస్కెల్!

'ఏమో సార్..! మీరు చెబుతుంటే కరెక్టే అనిపిస్తోంది. వద్దు ఆశ.. వాడిది దురాశ!'

అబ్బా... నువ్వు కూడా మీటర్‌లో మాట్లాడుతున్నావు నీలూ!

'సావాస దోషం సార్!' అని నవ్వింది నీలాంబరి.

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సుడోకు

4		2	5	8			7	
8		9			7		2	
6			1	2		3		
	8	1		7				
7				3				8
				1		6	5	
		7		9	8			3
	2		3			7		1
	9			5	1	8		2

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	1	5	8	9	4	3	2	6
2	4	9	6	7	3	8	5	1
8	6	3	5	2	1	9	7	4
4	9	1	2	5	7	6	8	3
6	8	7	1	3	9	2	4	5
5	3	2	4	8	6	7	1	9
3	7	4	9	1	8	5	6	2
9	5	6	7	4	2	1	3	8
1	2	8	3	6	5	4	9	7

ప్రపంచ అందగాళ్లలో హృతిక్ ఫస్ట్



హృతిక్ రోషన్

'ఆసియన్ సెక్సియస్ట్ మేన్, మేన్ ఆఫ్ ది ప్లానెట్' వంటి టైటిల్స్ దక్కించుకున్న బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ తాజాగా మరో అరుదైన టైటిల్ సొంతం చేసుకున్నారు. ఓ అంతర్జాతీయ వెబ్‌సైట్ ఇచ్చిన 'వరల్డ్ టాప్ టెన్ హ్యాండ్సమ్ హీరో'ల ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో నిలిచారు ఈ ఆరడుగుల అందగాడు. అది కూడా ప్రముఖ హాలీవుడ్ నటులు రాబర్ట్ ప్యాటిన్సన్, క్రిస్ ఇవాన్స్‌లను వెనక్కి నెట్టి మరీ తొలి స్థానంలో నిలవడం విశేషం. మరో బాలీవుడ్ హీరో, కండల వీరుడు సల్మాన్ ఈ జాబితాలో ఐదో స్థానంలో నిలిచారు. ఇంతవరకూ ఏ భారతీయుడూ సాధించని ఘనతను హృతిక్ సాధించాడంటూ ఆయనపై ప్రశంసల జల్లు కురుస్తున్నాయి. పలువురు బాలీవుడ్ ప్రముఖులు హృతిక్‌ని అభినందిస్తున్నారు. ఇక ఆయన ఫ్యాన్స్ ఆనందాలకు అవధుల్లేవు. మా హీరోనే అందగాడు అంటూ పండగ చేసుకుంటున్నారు. ప్రపంచ టాప్‌టెన్ హ్యాండ్సమ్ హీరోల్లో వరుసగా హృతిక్ రోషన్, రాబర్ట్ ప్యాటిన్సన్, గాడ్‌ఫ్రే గావో, క్రిస్ ఇవాన్స్, సల్మాన్ ఖాన్, డేవిడ్ బోరియానాజ్, నోవా మిల్స్, హెన్రీ కవిల్, టామ్ హిడిల్‌స్టన్, సామ్ హ్యూగన్ నిలిచారు.



రామ్‌చరణ్

ఆనందానికి ముహూర్తం ఫిక్స్

చిట్టిబాబు జోరు చూశారా? నీళ్లల్లో చిందులేస్తూ తెగ ఎంజాయ్ చేస్తున్నాడు కదూ. ఇంతకీ ఇంత ఆనందం దేనికి? మహాలక్ష్మి తన లవ్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? లేక వేరే కారణం ఏదైనా ఉందా? అది తెలుసుకోవడానికి టైమ్ ఉంది. ముందు చిట్టిబాబు ఫ్యాన్స్‌కి ఓ స్వీట్ న్యూస్. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై ఎర్నేనీ నవీన్, చెరుకూరి మోహన్, వై. రవిశంకర్ నిర్మిస్తున్న చిత్రం'రంగస్థలం'. ఇందులో రామ్‌చరణ్ పాత్ర పేరు చిట్టిబాబు. హీరోయిన్ సమంత పాత్ర పేరు మహాలక్ష్మి అని టాక్. ''ఈ నెల 24న సాయంత్రం 4 గంటల 15నిమిషాలకు 'రంగస్థలం' టీజర్‌ను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్రబృందం అధికారికంగా ఎనౌన్స్ చేసింది. అంటే.. చిట్టిబాబు అభిమానుల ఆనందానికి ముహూర్తం ఫిక్స్ చేశారన్నమాట. మార్చి 30న చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రిపబ్లిక్ డేకి ప్రమాణం

ఈ నెల 26న మహేశ్‌బాబు ప్రమాణం చేయబోతున్నారు. ఏమని ప్రమాణం చేస్తారు? అంటే.. వెయిట్ అండ్ సీ. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మాణంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'భరత్ అనే నేను' టైటిల్ అనుకుంటున్నారట. ఇందులో సీయం భరత్ పాత్రలో మహేశ్‌బాబు కనిపించనున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ముఖ్యమంత్రి పదవి చేపట్టే ముందు ప్రమాణ స్వీకారం చేస్తారుగా. బహుశా.. మహేశ్ 26న చేయబోయేది అలాంటిదే అయ్యుండొచ్చు. సో.. 26న సినిమాలోని డైలాగ్స్ వినిపిస్తారేమో? లేక ప్రమాణం చేస్తున్నట్లుగా ఉన్న లుక్‌ని విడుదల చేస్తారేమో? ''రిపబ్లిక్ డే సందర్భంగా సూపర్‌స్టార్ మహేశ్‌బాబు ఫస్ట్ ఓత్ (ప్రమాణం) చేయనున్నారు'' అని సంక్రాంతి సందర్భంగా సినిమా అప్‌డేట్‌ను తెలియజేసింది చిత్రబృందం. ఈ సినిమా క్లైమాక్స్ షూటింగ్‌ను రేపటి నుంచి స్టార్ట్ చేసి నెలాఖరు వరకు షూట్ చేయనున్నారు.



మహేశ్‌బాబు



లాయిడ్ స్టీవెన్స్, ఎన్టీఆర్

ఇద్దరూ టీచర్లే

'ఇలా చేస్తే ఈజీగా తగ్గొచ్చు'... ఎన్టీఆర్‌కి సలహా ఇస్తున్నారు లాయిడ్ స్టీవెన్స్, 'ఇలా చేస్తే ఈజీగా గాలిపటం ఎగరేయొచ్చు'... స్టీవెన్స్‌కి సలహా ఇచ్చారు ఎన్టీఆర్. బాగుంది.. తగ్గే విషయంలో ఎన్టీఆర్‌కి స్టీవెన్స్ గురువు అయితే.. గాలిపటాలు ఎగరేసే విషయంలో స్టీవెన్స్‌కి గురువు అయ్యారు ఎన్టీఆర్. ఇంతకీ ఏంటి కహానీ అంటే... ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ కొత్త లుక్‌లో కనిపిస్తారు. అందుకే హాలీవుడ్ నుంచి లాయిడ్ స్టీవెన్స్ ఇండియా వచ్చారు. దగ్గరుండి ఎన్టీఆర్‌కి ఫిజికల్ ట్రైనింగ్ చేయిస్తున్నారు. సంక్రాంతి పండగకి మాత్రం ఎన్టీఆర్ దగ్గరుండి స్టీవెన్స్ చేత గాలిపటాలు ఎగరేయించారు. ''గాలి పటాలు ఎలా ఎగరేయాలో ఎన్టీఆర్ నేర్పించారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు'' అని విదేశీ ట్రైనర్ లాయిడ్ పేర్కొన్నారు.



మోహన్‌లాల్

మహాబలి

బాహుబలి చూస్తిరా? అంతకంటే పెరియ (పెద్ద) సినిమా చూస్తరా? బాహుబలి కంటే మహాబలి లాంటి సినిమాలు ఇండియాలో హల్‌చల్ చేయబోతున్నాయి. బోట్లలో నింపినా సరిపోవు. అన్ని దుడ్లు... మునుగుతాయా? తేలతాయా? చూస్తమా?



దిశా పాట్నీ



విక్రమ్



అల్లు అరవింద్

వెయ్యి కోట్ల భీముడు

భీముడు బలవంతుడా లేక బాహుబలినా! అయినా ఆ పోలికేంటి? భీముడు రియల్ క్యారెక్టర్. బాహుబలి రీల్ క్యారెక్టర్ కదా అనుకుంటున్నారా? కరెక్టే. అయితే ఈ ఇద్దరి బలానికి పోలిక పెట్టింది రీల్ వైజ్‌గానే. బడ్జెట్ వైజ్‌గా ఎవరు పెద్ద అంటే. నిన్న మొన్నటి వరకూ 'బాహుబలి' పెద్ద. ఇప్పుడు భీముడే బిగ్. 'బాహుబలి' రెండు పార్ట్స్ బడ్జెట్ దాదాపు 300 కోట్లు. మరి భీముడికి అయ్యే బడ్జెట్ ఎంతో తెలుసా? 1000 కోట్లండి బాబు. వీఏ శ్రీకుమార్ మీనన్ దర్శకత్వంలో జ్ఞానపీఠ్ అవార్డుగ్రహీత ఎమ్‌టీ వాసుదేవన్ నాయర్ రాసిన బుక్ ఆధారంగా 'మహాభారతం'పై ఈ సినిమా తీయడానికి బీఆర్ శెట్టి అనే బిలియనీయర్ రెడీ అయ్యారు. భీముడి క్యారెక్టర్ చుట్టూ తిరిగే ఈ సినిమాకయ్యే బడ్జెట్ 1000 కోట్లు. టైటిల్ రోల్‌ని మోహన్‌లాల్ చేయబోతున్నారు. కర్ణుడి పాత్రలో నాగార్జున కనిపిస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ విషయం తెలియడానికి ఇంకా టైమ్ పడుతుంది. మోహన్‌లాల్ మాత్రం భీముడిగా కనిపించడానికి రెడీ అవుతున్నారు. ''రెండు పార్ట్స్‌గా సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం. మొదటి పార్ట్‌ను విడుదల చేసిన, నెక్ట్స్ 90 డేస్ తర్వాత సెకండ్ పార్ట్‌ను రిలీజ్ చేస్తాం'' అని వాసుదేవన్ నాయర్ అన్నారు. యూనిట్ అనుకున్నట్లుగానే ఈ సినిమా సెట్స్‌పైకి వెళితే.. దేశంలో 1000కోట్లతో నిర్మించిన తొలి సినిమా ఇదే అవుతుంది. వెయ్యి కోట్లా? తీసినవాళ్లు, కొన్నవాళ్లు 'సేఫ్' అవుతారా? అంటే.. టూ పార్ట్స్, మల్టీస్టారర్, మల్టీ లాంగ్వేజెస్‌లో రిలీజ్.. మునిగే చాన్స్ లేదని ఊహించవచ్చు.

* * *

500 కోట్ల రామాయణం

రామబాణానికి తిరుగులేదంటారు. అందుకే భీముడు గదతో బాక్సాఫీసు దగ్గరకు వస్తుంటే.. విల్లును ఎక్కుపెట్టి నేనూ వస్తున్నా అంటున్నాడు రాముడు. రామాయణం అంటే సీతను అడవులపాలు చేసిన రాముడు అని ఈతరం వారు అనుకుంటారు. కొందరికి అది కూడా తెలియకపోవచ్చు. ఇలాంటి టైమ్‌లో రామాయణం వస్తే? అబ్బో.. బడ్జెట్ బోలెడంత అవుతుంది. అయినా ఓకే అంటూ అల్లు అరవింద్ రామాయణం ఆధారంగా సినిమా తీయబోతున్నట్లు ప్రకటించారు. మధు మంతెన, నమిత్ మల్హోత్రాలతో కలిసి త్రీ పార్ట్స్‌గా ఆయన ఈ సినిమాని ప్లాన్ చేస్తున్నారు. రాముడు ఎవరంటే రామ్‌చరణ్ అట. అంతేకాదు.. మెగా కాంపౌండ్‌కి చెందిన హీరోలు కీలక పాత్రల్లో కనిపిస్తారని టాక్. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేవరకు ఇలాంటి వార్తలు హల్‌చల్ చేస్తుంటాయి. ఇంతకీ రాముడు ఎప్పుడు కెమెరా ముందుకు వస్తాడు? దర్శకుడు ఎవరనేది ప్రస్తుతానికి నో క్లారిటీ. ''రామాయణం వంటి సినిమాను నిర్మించాలంటే ఎంతో బాధ్యతగా ఉండాలి. బిగ్ స్క్రీన్‌పై చూపించడం అంత ఈజీ కాదు. అందుకే పర్ఫెక్ట్‌గా ప్లాన్ చేస్తున్నాం'' అని అల్లు అరవింద్ అప్పట్లో అన్నారు. సో... 500 కోట్లు వర్కవుట్ అవుతుందా అంటే... త్రీ పార్ట్స్ బాస్. పైగా పర్ఫెక్ట్ ప్లానింగ్ కూడా. రాముడికి తిరుగుండకపోవచ్చు.

250 కోట్ల సంఘమిత్ర

బాక్సాఫీసుపై యుద్ధం చేయడానికి భీముడు, రాముడు, కర్ణుడు రెడీ అవుతున్నారు. వీళ్లతో పాటు తలపడటానికి ఓ రాణి రెడీ అవుతోంది. పేరు... సంఘమిత్ర. 250కోట్ల ఖర్చుతో దండయాత్రకు రెడీ అవుతున్నారు సంఘమిత్ర. లేడీని నమ్మి 250 కోట్లు ఖర్చుపెడుతున్నారా? అంటే.. హాలో... 'అరుంధతి', 'రుద్రమదేవి', 'డర్టీ పిక్చర్', 'క్వీన్'.. ఇలా చాలా సిన్మాలున్నాయి. ఒకట్రెండు మినహా అన్నీ ఆల్‌మోస్ట్ లాభాలు తెచ్చినవే. ఆ ఒకటీ రెండూ సినిమాలూ 'భేష్' అనిపించుకున్నాయి. ఇక.. 'సంఘమిత్ర' గురించి చెప్పాలంటే.. ముందు శ్రుతీహాసన్ ఒప్పుకుని ఆ తర్వాత తప్పుకున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులకు సీన్లోకి దిశా పాట్నీ వచ్చారు. సుందర్. సి దర్శకత్వంలో తేనాండాళ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో జయం రవి, ఆర్య కీలక పాత్రలు చేయనున్నారు. ఎప్పుడో అనౌన్స్ చేసినా ఇంకా ప్రాజెక్ట్ పట్టాలెక్కకపోవడంతో సంఘమిత్ర దండయాత్రకు స్టార్టింగ్ ప్రాబ్లమా? అనే డౌట్స్ వచ్చాయి. సినిమా లేట్ అవుతున్నది స్టార్టింగ్ ప్రాబ్లమ్ వల్ల కాదని, ప్రిపరేషన్ ప్లాన్ వల్ల అని అంటున్నారు చిత్ర బృందం. "ప్రీ-ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. స్క్రిప్ట్‌కి చాలా టైమ్ పట్టింది. చిన్న చిన్న మార్పులు చేస్తున్నాం. గ్రాఫిక్ వర్క్ ఆల్రెడీ స్టార్ట్ అయ్యింది. ఏప్రిల్ లేదా మేలో షూటింగ్ స్టార్ట్ చేయాలనుకుంటున్నాం" అని సుందర్ సి. స్పష్టం చేశారు. ఇది ట్రైలింగ్యువల్ మూవీ. పెట్టిన పెట్టుబడిని 'సంఘమిత్ర' సునాయాసంగా లాగేస్తుంది సారూ.

* * *

300 కోట్ల కర్ణుడు

కర్ణుడి దానగుణం ఎంత గొప్పది? ప్రాణాలనైనా తృణప్రాయంగా ఇచ్చేంత గొప్పది. మరి కురుక్షేత్ర రణరంగంలో దుష్టులైన కౌరవుల వైపు ఎందుకు ఉండాల్సి వచ్చింది? పాండవులకు కర్ణుడు ఎందుకు వ్యతిరేకం అయ్యారంటే చరిత్ర తెలుసుకోవాలి. మలయాళ దర్శకుడు ఆర్. ఎస్. విమల్ ఆ పని మీదే ఉన్నారు. విక్రమ్ టైటిల్ రోల్‌లో ఆయన 'మహావీర్ కర్ణ' అనే సినిమా తీయబోతున్నారు. 300 కోట్ల రూపాయలతో యునైటెడ్ ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ''రెండేళ్లుగా స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నా. కొన్ని సీన్లు రీ-రైట్ కూడా చేశా. తమిళ్, హిందీ భాషల్లో తీసి, మిగతా భాషల్లో డబ్ చేయాలనుకుంటున్నాం. ఇంటర్‌నేషనల్ లెవల్లో యాక్టర్స్ అండ్ టెక్నీషియన్స్‌ని తీసుకోబోతున్నాం'' అన్నారు విమల్. డైరెక్టరే చెప్పేశారుగా.. ఇంటర్నేషనల్ లెవల్ ఆర్టిస్టులు, టెక్నీషియన్లు అని.. ఇంకేం? బొమ్మ మునిగే చాన్సే లేదు.

* * *

400 కోట్ల రోబో



రజనీకాంత్, అమీజాక్సన్

ఇండియన్ బాక్సాఫీస్ కలెక్షన్ రికార్డుల గురించి చెప్పుకోవాలంటే ప్రజెంట్ బాహుబలి, దంగల్ వసూళ్ల నుంచి స్టార్ట్ చేయాలి. ''హలో... ఫ్యూచర్‌లో మా గురించి కూడా చెప్పుకుంటారు'' అంటున్నారు '2.0' టీమ్. 'రోబో'కి సీక్వెల్‌గా శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా రిలీజ్ డేట్స్‌లో కాస్త అయోమయంగా ఉన్నా కలెక్షన్స్ విషయంలో ఫుల్ క్లారిటీతో దూసుకెళ్లేలా మార్కెట్‌ను రెడీ చేస్తున్నారు. ఆల్రెడీ ఇప్పటికే వంద కోట్లకు పైగా శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకున్నారు. రజనీకాంత్, అక్షయ్‌కుమార్, అమీజాక్సన్ ముఖ్యతారలుగా సుమారు 400 కోట్ల బడ్జెట్‌తో లైకా ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇండియన్ సినిమాల్లో ఇప్పటికి ఇది హయ్యస్ట్ బడ్జెట్ మూవీ. ఆల్రెడీ శాటిలైట్, ఇతర హక్కుల రూపంలో 150 కోట్లు వచ్చేశాయట. రోబో మునిగే చాన్సే లేదు. టోటల్ కలెక్షన్స్ మిగతా సినిమాలకు షాక్ ఇస్తాయేమో! వెయిట్ అండ్ సీ.

సోనమ్ భారతం

బీటౌన్‌లో మహాభారతం సినిమాపై మోస్ట్ ఇంట్రస్టెడ్ యాక్టర్ ఎవరంటే.. ఆమిర్ ఖాన్ అని చెప్పేయొచ్చు. మరి.. యాక్ట్రస్ విషయానికొస్తే సోనమ్ కపూర్. భారతంలో నటించడానికి ఆమిర్ ప్రయత్నాలు చేస్తున్నారట. మరోవైపు సోనమ్ కపూర్ అయితే ఏకంగా ఈ నేపథ్యంలో వచ్చిన పుస్తకాల రైట్స్ కూడా కొనేశారు. మహాభారతంపై 'ఆర్యావతార క్రానికల్స్' అనే టైటిల్‌తో మూడు పార్ట్స్‌గా బుక్ రచించారు ఉదయశంకర్. అందులో ఫస్ట్ పార్ట్ 'గోవింద' రైట్స్‌ను సోనమ్ కపూర్ కొన్నారు. దీంతో మహాభారతంపై సినిమా తీయడానికి సోనమ్ రెడీ అయ్యారన్న వార్తలు వచ్చాయి. "మహాభారతం గొప్ప కథ. ఇందులో ఏ క్యారెక్టర్ చేస్తానో ప్రస్తుతం నాకు తెలీదు" అని సోనమ్ పేర్కొన్నారు. సో.. ఈ సినిమా సెట్స్‌పైకి వెళితే బడ్జెట్ రెండు వందల కోట్ల పైనే ఉంటుందని ఊహించవచ్చు.



సోనమ్ కపూర్

\- ముసిమి శివాంజనేయులు

200 కోట్లకు దగ్గరగా..

ఆల్రెడీ విడుదలకు సిద్ధమైన చిత్రాల్లో 'పద్మావత్' బడ్జెట్ దాదాపు 180 కోట్లు అని బాలీవుడ్ టాక్. దీపికా పదుకోన్ ముఖ్య పాత్రలో సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ అవుతోంది. ఇప్పటికే పలు వివాదాలు, పలుమార్లు విడుదల వాయిదా పడిన ఈ సినిమా రిలీజయ్యాక ఎన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



దీపికా పదుకోన్



కమల్‌హాసన్

రెండో ఇండియన్ @ 180 కోట్లు

శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ నటించిన 'భారతీయుడు' అప్పట్లో ఓ సంచలనం. ఆ చిత్రానికి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' ని ప్లాన్ చేస్తున్నారు. కమల్ నటిస్తారు. శంకర్ తెరకెక్కిస్తారు. 'దిల్' రాజు తీస్తారనే వార్త వచ్చింది. అయితే 'దిల్' రాజు తప్పుకున్నారు. ఫస్ట్ పార్ట్ నిర్మించిన ఎ.యం. రత్నం నిర్మించడానికి రెడీగా ఉన్నారట. ఇక, శంకర్ ప్లాన్ చేయడం, కమల్ డేట్స్ లాక్ చేయడమే ఆలస్యం. ఈ చిత్రానికి 180 కోట్లు బడ్జెట్ అవుతుందట. 'భారతీయుడు'పై ఉన్న క్రేజ్ సీక్వెల్‌కి వర్కవుట్ అవుతుంది. సో.. రెండో భారతీయుడు వసూళ్లు ఇరగదీస్తాడని అంచనా వేయొచ్చు.

Dwaraka

హైదరాబాద్
బుధవారం
17-1-2018



నటి సీత

నేను నా దైవం

కష్టం వచ్చినప్పుడు నమ్మితే? ... కోరిక కలిగినప్పుడు నమ్మితే?
ఎవర్నయినా కాపాడాలి అని నమ్మితే? ... నలుగురు బాగుండాలి అని నమ్మితే?
ఉన్నప్పుడు ఇవ్వాలి అని నమ్మితే?... లేనప్పుడు ఉన్నాడని నమ్మితే?
నమ్మితే... దేవుడున్నాడు... అంటున్నారు నటి సీత.

నమ్మితే ఉన్నాడు

హావభావాలు శక్తిమంతంగా ప్రదర్శించే నటి సీత. 'చిన్నారి స్నేహం', 'పోలీసు భార్య', 'ఆడదే ఆధారం', 'ముత్యమంత ముద్దు' వంటి పెద్ద హిట్స్ ఆమె జాబితాలో ఉన్నాయి. సెకండ్ ఇన్నింగ్స్‌లో 'సింహాద్రి', 'బన్ని', 'కరెంటు తీగ' వంటి సినిమా లలో నటించారు. 'నేను–నా దైవం' గురించి ఆమె సాక్షితో కొన్ని ఆలోచనలు పంచుకున్నారు.

- **జీవితంలో చాలా ఆటుపోట్లు ఎదుర్కొన్నట్టున్నారు?**

అవును. జీవితం అంటే అదే. సాఫీగా ఉండేది జీవితం కాదు. మనం ఊహించినట్టుగా ఉండేది కూడా జీవితం కాదు. జీవితం సముద్రంలాంటిది. దాని వీపు మీద మనం ప్రయాణం చేస్తుంటాం కాని అది ఏ క్షణం ఎలా మారుతుందో ఊహించలేము.

- **పురుషుల కంటే స్త్రీలకు ఈ విషయంలో ఎక్కువ దైవ ఆలంబన అవసరమా?**

దైవ ఆలంబన విషయంలో స్త్రీలకు, పురుషులకు తేడా ఉండదు. కాని గమనించి చూస్తే స్త్రీలు కాసేపు దేవుని దగ్గర తమ మనసులో ఉన్నదంతా గుమ్మరించుకుని తేలిక పడతారు. కాని మగవాళ్లు దేవుణ్ణి పట్టుకుంటే అలాగే పట్టుకునే ఉండాలి. స్త్రీలకు కుటుంబం ఉంటుంది. ఇంటిని చక్కదిద్దుకోవడమే వాళ్లకు అసలైన పుణ్యకార్యం. అందుకే పురాణాల్లో సతీ అనసూయ వంటి పతివ్రతలు ఎక్కువ కనిపిస్తారు. పురుషులలో భక్త సిరియాళ, భక్త మార్కండేయ, భక్త ప్రహ్లాద వంటి వీర భక్తులు ఎక్కువ కనిపిస్తారు.

- **మీ మీద భక్తి ప్రభావం ఎలా ఉండేది?**

చాలా ఎక్కువ ఉండేది. మా ఇంట్లో ప్రతి శుక్రవారం అమ్మ ప్రత్యేక పూజలు చేసేది. పూజకు ఉపయోగించే సామగ్రిని శుభ్రం చేసే పని నేనే చేసేదాన్ని. ఆరేళ్ల వయసు నుంచి అనుకుంటా నేనే దేవుడి సామాన్లన్నీ తళతళ



మెరిసేలా శుభ్రం చేసి పెట్టేదాన్ని. బిడ్డకు జలుబు చేస్తుంది అని తాత వారించినా ఒప్పుకునేదాన్ని కాను. దేవుళ్ల బొమ్మలు, పటాలు కూడా శుభ్రం చేసి పూజకు సిద్ధం చేసేదాన్ని. కొంచెం పెద్ద అయ్యాక కేసరి, పొంగల్, వడ ప్రసాదాలను రుచిగా వండేదాన్ని. ప్రతి ఉదయం పూజ, ప్రసాదాల అలవాటు నా జీవితంలో పాజిటివ్ ఎనర్జీని పెంచేది.

- **ఈ దేవుళ్లు హిందువుల దేవుళ్లు వీళ్లనే పూజించాలి అని అనుకునేవారా?**

అలా ఏం లేదు. ఏ ఇంట్లో అయినా మన సంప్రదాయాన్నే మన పెద్దవాళ్లు నేర్పిస్తారు. దాంతో పాటు పొరుగు సంప్రదాయాన్ని కూడా గౌరవించే సహనం, ప్రేమ మన సంస్కృతిలో ఉన్నాయి. మన బాల్యమంతా అలాంటి సంస్కృతిలోనే గడిచిందని మనమంతా గుర్తు చేసుకుంటే ఈ సమాజం ఎంతో బాగుండనిపిస్తుంది. చిన్నప్పుడు కాన్వెంట్ స్కూల్‌లో చదువుకునేటప్పుడు చర్చికి తరచూ వెళ్లేదాన్ని. క్రీస్తు ప్రార్థనలు భక్తిగా చేసేదాన్ని. చెన్నై మౌంట్‌రోడ్డులోని దర్గాకు ఇప్పుడూ తరచూ వెళుతుంటాను. పుదుప్పేటలో మా ఇంటికీ సమీపంలోని దర్గాలో తెల్లవారుజాము 5 గంటలకు ప్రార్థనలు జరిపేవారు. అలారంతో పని లేకుండా ఆ టైమ్‌కి నిద్రలేచి పూజలు చేసుకునేదాన్ని. అలా ఆ దర్గా నాలో ఒక సమయ పాలనను నేర్పింది. ఒంట్లో బాగోలేకపోతే ఇంట్లోవాళ్లు దర్గాకు తీసుకువెళ్లి మంత్రం వేయించేవారు, తాయెత్తులు కట్టించేవారు. జబ్బు నయం అయ్యేది.

- **ఏ దేవుడంటే ఇష్టం ఉండేది?**

మా ఇష్ట దైవం వేంకటేశ్వర స్వామి. ఇంట్లో ఆయనకే ఎక్కువగా పూజలు జరిపేవారు. నా చిన్నతనంలో తరచూ తిరుమల వెళ్లేవాళ్లం. అలా వెళ్లేముందు తెలిసిన వారి ఇళ్లకు వెళ్లి 'గోవిందా' అంటూ ముడుపులు, విరాళాలు సేకరించి అలా సేకరించిన సొమ్మును తిరుమలలో స్వామి వారి సన్నిధిలోని హుండీలో వేసేవాళ్లం. ఇందుకోసమని నేను, అన్నయ్య, తమ్ముడు కలిసి ఇంటింటికి తిరిగేవాళ్లం. వాళ్లు కాస్త సిగ్గుపడుతుంటే 'గోవిందా....గో....విందా' అని నేను మాత్రమే బిగ్గరగా అరిచేదాన్ని (చిన్న నవ్వు).

- **అసలు దైవానికి ఎలా కనెక్ట్ అవ్వాలి?**

నేనైతే ఉదయం నిద్ర లేవగానే కాలకృత్యాలు ముగించుకొని పూజ చేసుకుంటాను. తరువాత 20 నిమిషాలైనా ధ్యానం చేస్తాను. శరీరం మాత్రమే శుభ్రంగా ఉంటే సరిపోదు మనసు కూడా శుభ్రంగా ఉంటేనే అక్కడ దేవుడు ఉంటాడు. ముందు మనల్ని మనం ప్రేమించుకోవాలి. అప్పుడు దేవుడు ఉన్నాడనే భావన కలుగుతుంది. దేవుడంటే ఎక్కడో కాదని, మనలోనే ఉన్నాడని, దేహమే దేవాలయం అనే భావన ఉండాలి. అప్పుడే కనెక్ట్ అవుతాం.

- **ఇది దైవ మహిమా అని ఎప్పుడైనా అనిపించిందా?**

ఒకసారి ఫుడ్ అలర్జీ వచ్చి ముఖమంతా ర్యాష్ వచ్చింది. డాక్టర్ వద్దకు వెళితే మందులిచ్చి పది రోజుల పాటు మేకప్ వేసుకోవద్దని చెప్పారు. నాకేమో రోజూ షూటింగ్ ఉంది. నేను వెళ్లకుండా సహ నటుల కాంబినేషన్ మిస్సయితే నిర్మాతకు నష్టం వస్తుంది. దేవుడిని ప్రార్థిస్తూనే షూటింగ్ స్పాట్‌కు వెళ్లాను. చిత్ర దర్శకులు నా వద్దకు వచ్చి ఈ క్యారెక్టర్‌కు బొత్తిగా మేకప్ అవసరం లేదని చెప్పారు. నాకైతే అప్పుడు నోటమాటరాలేదు. అద్భుతం అనిపించింది. అలాగే మరొకటి. నాకు షిరిడీ సాయిబాబా అన్నా చాలా భక్తి. షిరిడీకి వెళ్లిన ఒక ఫ్యామిలీ ఫ్రెండ్‌తో వచ్చేటప్పుడు నా కోసం బాబా విగ్రహం తీసుకురావాలని చెప్పాను. అయితే వాళ్లు మర్చిపోయి వచ్చారు. అదే రోజున ఒక షాప్ ఓపెనింగ్‌కు వెళుతూ బాబా విగ్రహం రాలేదే అని తలచుకుంటూ వెళ్లాను. నన్ను ముఖ్యఅతిథిగా పిలిచిన నిర్వాహకులు నా మనసులో ఎలా ఊహించుకున్నానో సరిగ్గా అలాంటి షిరిడీ బాబా విగ్రహాన్ని బహూకరించారు. ఆరోజు నా సంతోషానికి అవధులు లేవు.

- **దేవుడిపై ఎప్పుడైనా కోపం వచ్చిందా?**

తట్టుకోలేని చేదు అనుభవం ఎదురైనపుడు క్షణం పాటు కోపం కలుగుతుంది. అయితే అంతలోనే ఆ కోపం మాయం అవుతుంది. ఏదో కారణం ఉంటేనే కానీ ఈ సంఘటన చోటు చేసుకోదు. దీని వెనుక దేవుడి మర్మం ఏదో ఉంది. అంతా మన మంచి కోసమేనని గట్టిగా అనుకుంటాను. కష్టాలు వచ్చినపుడు దేవుడా నాకెందుకీ ఆవేదనలు అంటారు. అదే కోటి రూపాయలు కలిసొస్తే దేవుడా నాకే ఎందుకిచ్చావు అని ఆలోచించరు. దైవం విషయంలో మనిషికి అలాంటి పరిణతి వస్తే ఎంతో బాగుంటుంది.

- **దైవానికి నైవేద్యం పెట్టడం ఏంటని మీకెప్పుడైనా సందేహం కలిగిందా?**

దేవునికి నైవేద్యం పెట్టడం మంచిదే కాని అంతకంటే మనిషి ఆకలి తీర్చడం అవసరం. మీకు ఒక కథ చెబుతాను. కరువు పీడిస్తుండగా ఒక రైతు దేవుడికి పరీక్ష పెట్టాడు. నీవు నిజంగా ఉంటే నా అరటితోట విరగగాయాలి అన్నాట్ట. తోటకు చుక్కనీరు పోయకున్నా చక్కని పంట చేతికి రావడంతో దేవుడున్నాడని నమ్మాడు. వెంటనే గుడికి గంపలు గంపలు అరటి పళ్లను నైవేద్యానికి పంపాడు. అదే రోజు రాత్రి దేవుడు కలలోకి రాగా నేను పంపిన పండ్లు తిన్నావా అని అడిగాడు రైతు. ఒక్కటే తిన్నాను అని బదులిచ్చాడు దేవుడు. దాంతో రైతు తన పనివాళ్లు పండ్లు మొత్తం కాజేశారని తలచి వాళ్లను పిలిచి అసలేం జరిగిందని ప్రశ్నించాడు. అందరూ అరటి పండ్లను దేవునికి నైవేద్యంగా పెట్టాం అని చెప్పారు. కాని ఒక్క పనివాడు మాత్రం వాటిని తీసుకెళ్లే దారిలో ఒక యాచకుడు ఆకలితో అలమటిస్తుంటే ఒక అరటిపండు ఇచ్చినట్టు చెప్పాడు. రైతుకు జ్ఞానోదయం అయింది– ఆకలితో ఉన్న వాడికి ఇచ్చిన ఆ ఒక్కపండే దేవుడికి చేరిందని.

- **ఇప్పుడు దేవుణ్ణి ఏం కోరుకుంటున్నారు?**

నేను జీవించినంతకాలం అమ్మ నాతో ఉండాలి అని మొదటగా వేడుకుంటుంటాను. మనిషికి అష్టైశ్వర్యాలు ఉన్నా ఆరోగ్యం అనేది లేకుంటే అంతా వృథా. అందుకే నా ఫ్యామిలీనే కాదు ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా చూడు స్వామి అని ప్రార్థిస్తుంటాను. అలాగే, ప్రకృతి వైపరీత్యాలకు ప్రజలు గురికాకుండా కాపాడు స్వామి అని నమస్కరిస్తా. 2015 డిసెంబర్‌లో చెన్నైని వరదనీరు ముంచెత్తినపుడు ప్రజలు పడిన బాధలు చూసి ఎంతో చలించిపోయాను. అలాగే నటిగా వృత్తిపరంగా బాగా బిజీగా ఉండాలి అని కోరుకుంటాను.

– కొట్రా నందగోపాల్,
సాక్షి ప్రతినిధి, చెన్నై

దైవంపై నమ్మకం అంటే ఎలా ఉండాలి ?

ఈ విషయంపై ఒక చిన్న కథ చెబుతాను. ఒక పేదవాడికి దేవుడు కలలో కనపడి ఫలానా చోట తవ్వితే నీకు నిధి దొరుకుతుంది, దరిద్రం తీరుతుందని చెప్పాడు. దానిని నమ్మి అతడు భూమి తవ్వుతుండగా సైనికులు వచ్చి ఇది రాజు గారి భూమి అని చెప్పి ఆ నేరానికి రాజు ముందు నిలబెట్టగా చెట్టుకు కట్టి కొరడా దెబ్బలు కొట్టమని రాజు శిక్ష వేశాడు. శిక్షను అమలుచేస్తున్న సైనికుడికి పేదవానిపై జాలి వేసి 'అసలు గుంట ఎందుకు తవ్వుతున్నావు?' అని అడిగారు. పేదవాడు విషయం చెప్పాడు. అది విని నవ్వుకున్న సైనికుడు నాకు కూడా నిన్న రాత్రి దేవుడు కలలో కనపడి నిన్ను కట్టేసిన చెట్టులో అపార నిధి ఉంది తీసుకో అన్నాడు, అలాగని చెట్టును తొలిచానా అని వెళ్లిపోయాడు. ఆ దేవుడు సైనికుని రూపంలో మరోసారి నాకు అవకాశం ఇచ్చాడని విశ్వసించిన పేదవాడు చెట్టులోని తొర్రను వెతగ్గా నిధి దొరికింది. దరిద్రం తీరింది. దేవుడిపై నమ్మకం అంటే సైనికుడిలా ఉండ కూడదు, పేదవాడిలా ఉండాలి.

ఊపిరి మొక్క

ఆరోగ్య వర్ధిని



ఈ మధ్య జపాన్‌లోని ప్రతి ఇంటిలోనూ తులసిమొక్కలు పెంచుతున్నారట. ఎందుకంటే జపనీయులు తులసి ప్రాధాన్యత గుర్తించారు కాబట్టే జపాన్‌లో కూడా ప్రతి ఇంటిలో తులసి చెట్టు తప్పక పెంచుతున్నారు. ఇంతకీ ఏమిటా ప్రాధాన్యత అంటారా? అదేంటో చూద్దాం... తులసి లక్ష్మీ స్వరూపం. తులసి చెట్టు దగ్గర చేసే ప్రాణాయామం, ధ్యానం, యోగా మరిన్ని మంచి ఫలితాలని ఇస్తాయని శాస్త్రం చెబుతోంది. మన పూర్వీకులు దేనినైనా పూజించండి అంటే, అందులో ఆధ్యాత్మిక, ఆరోగ్య, వైజ్ఞానిక కారణాలు తప్పకుండా ఉంటాయి. మనకు అవి తెలియవి, అంతే. తులసి గురించి ఒక నాలుగు మాటలు చెప్పుకుందాం.

- సాధారణంగా అన్ని మొక్కలు, చెట్లు ఉదయం మొత్తం కార్బన్–డై–ఆక్సయిడ్ పీల్చుకుని, ఆక్సిజన్ వదులుతాయి, రాత్రి సమయంలో ఉదయం తాము పీల్చుకున్న కార్బన్–డై–ఆక్సైడ్ మొత్తాన్నీ పర్యావరణంలోనికి విడిచిపెడతాయి. కానీ తులసి మాత్రం రోజులో 22 గంటలపాటు ఆక్సిజన్ (ప్రాణవాయువు) ను విడిచిపెడుతుందని పరిశోధనలో తేలింది. వృక్షజాతిలో మరే మొక్కకు ఈ ప్రత్యేకత లేదు. తులసి ఔషధగని. తులసిలో ప్రతి భాగం ఆయుర్వేద చికిత్సలో వాడుతారు.
- తులసికున్న ఘాటైన వాసన కారణంగా తులసి వాసన వ్యాపించినంత మేర ఈగలు, దోమలు, పాములు రావు. అందుకే మనం సంప్రదాయంలో ఇంటి ముందు, వెనుకా కూడా తులసిమొక్కను పెట్టి పూజించమన్నారు, ఫలితంగా ఇంట్లోకి పాములు రాకుండా ఉంటాయి. తులసిలో ఉన్న ఔషధగుణాల వల్ల గొంతులోని కఫం కరిగిపోతుంది.
- తులసి ఎంత గొప్పదంటే తులసి వనంలో పెట్టిన శవం తొందరగా చెడిపోదని మన ఆయుర్వేద గ్రంథాలు చెప్పాయి. దీన్ని ఆధునిక శాస్త్రవేత్తలు కూడా అంగీకరించారు. ప్రపంచాన్ని హడలుగొట్టిన స్వైన్‌ఫ్లూ భారత్‌లో స్వైరవిహారం చేయకుండా అడ్డుకున్నది తులసి మొక్కేనని తేలింది. ఎందుకంటే, తులసి గాలి కారణంగా జనంలో స్వైన్‌ఫ్లూను తట్టుకునే రోగనిరోధక శక్తి పెరిగిందట.
- ఏ ఇంట్లో అధికంగా తులసిమొక్కలు ఉంటాయో, ఆ ఇంట్లో జనం ఆరోగ్యంగా ఉంటారు. తులసిచెట్టు కాలుష్య ప్రభావాన్ని తగ్గిస్తుంది. తాజ్‌మహల్ కాలుష్యం బారినపడి మసకబారకుండా ఉండడం కోసం, తాజ్‌మహల్ పక్కనే, లక్ష తులసి మొక్కల వనాన్ని ప్రత్యేకంగా పెంచారు.
- అంతకంతకూ పెరిగిపోతున్న ఈ కాలుష్య జీవనంలో కనీసం మనిషి ఒక తులసి మొక్కైనా పెంచాలి.
- నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ వ్యాప్తిని తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. తులసి ఆకులు నీటిలోని ఫ్లోరోసిస్ వ్యాప్తిని తగ్గిస్తాయని ఈ మధ్యే ధృవీకరించారు.
- మనం పెరటి తులసిని సక్రమంగా వాడుకుంటే, రూపాయి ఖర్చు లేకుండా అనేక మంది జీవితాల్లో వెలుగు నింపవచ్చు. ఇది తులసి మహత్మ్యం.

గ్యాస్ట్రోఎంటరాలజీ కౌన్సెలింగ్



గుండె సమస్య కాదంటున్నారు... మరెందుకీ నొప్పి?

నా వయసు 39 ఏళ్లు. నాకు తరచూ ఛాతీ ఎడమభాగంలో నొప్పి వస్తోంది. గత మూడేళ్ల నుంచి ఈ నొప్పితో బాధపడుతున్నాను. కార్డియాలజిస్టును కలిసి గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలూ చేయించుకున్నాను. సమస్య ఏమీ లేదని అంటున్నారు. కానీ నొప్పి మాత్రం తగ్గడం లేదు. రాత్రివేళల్లో నొప్పి మరీ ఎక్కువ అవుతోంది. సమస్య ఏమై ఉంటుంది? ఈ నొప్పి తగ్గే మార్గం లేదా?

– ఆంజనేయరెడ్డి, కర్నూలు

మీరు తెలిపిన వివరాలు, పేర్కొన్న లక్షణాలను బట్టి మీకు ఆహార వాహికకు సంబంధించిన 'రిఫ్లక్స్ డిసీజ్'తో బాధపడుతున్నట్లు అర్థమవుతోంది. ఇది సాధారణంగా స్థూలకాయం ఉన్నవారిలో ఎక్కువగా కనిపిస్తుంది. మీరు ఒకసారి ఎండోస్కోపీ పరీక్ష చేయించుకోండి. అందులో మీ రిఫ్లక్స్ డిసీజ్ తీవ్రత తెలుస్తుంది. రాత్రి వేళల్లో నొప్పి ఎక్కువ అంటున్నారు కాబట్టి గ్యాస్ట్రో ఎంటరాలజిస్టును కలసి, ఆ నొప్పిని తగ్గించుకునే మందులు వాడండి. మంచి ఫలితం ఉంటుంది. దీంతోపాటు జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని రకాల ఆహారపదార్థాలు మీ సమస్యను తీవ్రతరం చేస్తాయి. వాటిని వాడటం వల్ల లక్షణాలు పెరుగుతాయి. వాటిని గుర్తించి, వాటినుంచి దూరంగా ఉండాలి. ఇటువంటి మార్పులతో మీ సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది.




ఛాతీలో మంట.. తగ్గేదెలా?

నా వయసు 42 ఏళ్లు. నేను చాలా రోజుల నుంచి ఛాతీలో మంటతో బాధపడుతున్నాను. యాంటాసిడ్ సిరప్ తాగినప్పుడు మంట తగ్గుతోంది. ఆ తర్వాత కొద్ది సేపటికి మళ్లీ పరిస్థితి మామూలే. దీన్ని శాశ్వతంగా తగ్గించుకోవడానికి ఏం చేయాలి? నాకు తగిన సలహా ఇవ్వగలరు.

– అనిల్‌కుమార్, మిర్యాలగూడ

మీరు తెలిపిన వివరాలు, లక్షణాలను బట్టి చూస్తే మీరు గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ డిసీజ్ (జీఈఆర్‌డీ)తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వల్ల వచ్చే అనారోగ్యమిది. మీ రోజువారీ జీవనశైలినీ, ఆహారపు అలవాట్లనూ సరిచేసుకుంటే ఈ వ్యాధి చాలావరకు తగ్గుముఖం పడుతుంది. ఈ సమస్య తగ్గడానికి కొన్ని సూచనలివి... ● మీరు తీసుకునే ఆహారంలో కొవ్వు పదార్థాలు తగ్గించడం ●కాఫీ, టీలను పూర్తిగా మానేయడం ● పొగతాగే అలవాటు ఉంటే పూర్తిగా మానేయడం, మద్యం అలవాటుకు దూరంగా ఉండటం ● బరువు ఎక్కువగా ఉంటే దాన్ని సరైన స్థాయికి తగ్గించడం ● భోజనం చేసిన వెంటనే పడుకోకుండా కాస్త సమయం తర్వాతే నిద్రకు ఉపక్రమించాలి ● తలవైపున పడక కొంచెం ఎత్తుగా ఉండేలా అమర్చుకోవాలి.

పై సూచనలతో పాటు మీ డాక్టర్ సలహా మీద పీపీఐ డ్రగ్స్ అనే మందులు వాడాలి. అప్పటికీ తగ్గకపోతే ఎండోస్కోపీ చేయించుకొని తగిన చికిత్స తీసుకోండి.



హెచ్‌బీఎస్‌ఏజీ పాజిటివ్... పరిష్కారం చెప్పండి

నా వయసు 32 ఏళ్లు. నేను ఒక సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాను. ఇటీవల మా సంస్థ నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో నాకు హెచ్‌బీఎస్‌ఏజీ పాజిటివ్ వచ్చిందని తెలిసింది. దీనివల్ల కాలేయం చెడిపోయే అవకాశం ఉందని అంటున్నారు. నిజమేనా? నా వ్యాధి మందులతో తగ్గిపోతుందా? తగిన సలహా చెప్పి, పరిష్కారం చూపండి.

– ఎమ్.ఎస్.ఎస్.
హైదరాబాద్

మీరు హెపటైటిస్–బి అనే ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఈ వైరస్ రక్తంలో ఉన్నంత మాత్రాన కాలేయం చెడిపోయే అవకాశం లేదు. రక్తంలో ఈ వైరస్ ఉండే దశను బట్టి లివర్ చెడిపోయే అవకాశం ఉంటుంది. వైరస్ ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి కొన్ని రక్త పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. లివర్ ఫంక్షన్ పరీక్షలో తేడా వస్తే ఒకసారి మీకు దగ్గర్లో ఉండే గ్యాస్ట్రోఎంటరాలజిస్టును కలిసి చికిత్స తీసుకోవచ్చు.

కడుపులో అల్సర్, పిత్తాశయంలో రాయి...!

నా వయసు 40 ఏళ్లు. గత నెలరోజులుగా కడుపులో మంట, నొప్పి వస్తుంటే డాక్టర్‌ను సంప్రదించాను. పరీక్షల్లో కడుపులో అల్సర్ (చిన్న పుండు) ఉంది అని తేలింది. అల్ట్రాసౌండ్‌లో పిత్తాశయంలో రాయి ఉన్నట్లుగా వచ్చింది. ఈ సమస్య మందులతో తగ్గుతుందా, ఆపరేషన్ అవసరమా?

– మల్లయ్య, వరంగల్

సాధారణంగా వయసు పెరిగేకొద్దీ పిత్తాశయంలో (గాల్‌బ్లాడర్‌లో) రాళ్లు ఏర్పడటానికి అవకాశం ఉంటుంది. పిత్తాశయంలో రాళ్లు ఉన్నంతమాత్రాన ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఈ రాళ్ల వల్ల తరచూ నొప్పి వస్తుంటే అప్పుడు గాల్‌బ్లాడర్‌ను తొలగించాల్సి ఉంటుంది. మీరు రాసిన వివరాలను బట్టి చూస్తే మీకు యాసిడ్ పెప్టిక్ డిసీజ్‌తో బాధపడుతున్నట్లు అనిపిస్తోంది. మీకు వచ్చే నొప్పి పిత్తాశయానికి సంబంధించినది కాదు. కాబట్టి మీరు భయపడాల్సిందేమీ లేదు. ఒకసారి వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోండి.



డాక్టర్ భవానీరాజు
సీనియర్
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
కేర్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్,
హైదరాబాద్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
హైదరాబాద్
బుధవారం
17-1-2018

డబ్బింగ్ క్లాసిక్స్- 8

ఒక పల్లవి నాలుగు చరణాలు



అమ్మాయిలని నోట్స్ అడగడం కూడా చాలా కష్టమైన రోజులు అవి.

వారి కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం తప్పు.

పలకరించడం నేరం.

కాఫీకి పిలవాలంటే న్యూక్లియర్ ఫార్ములాను డిరైవ్ చేసినంత పని.

ఇక లవ్ లెటర్... హడల్.

అబ్బాయిలు వేరు... అమ్మాయిలు పూర్తిగా వేరు అనుకునే 1990ల రోజులు అవి.

పొడుగు జడలు, పవిటా పావడాలు, బిఎస్‌ఏ ఎస్సెల్లార్ ఎక్కి తల వొంచుకుని వెళ్లి చదువుకునే అలాంటి రోజుల్లో ఇవాళ అమెరికాలో జరుగుతున్నట్టుగా, ఇండియాలో ఇంకా మొదలు కాలేదు, ఒక అమ్మాయి నలుగురు అబ్బాయిలు ఒకే గదిలో ఉంటే? వారు రూమ్‌ను షేర్ చేసుకుంటే? స్నేహాన్ని పంచుకుంటే... ఒకరిని ఒకరు గౌరవించుకునేలా ఉంటే?

ఇలాంటి కథా?

ఇలాంటి కథే అన్నాడు త్రివిక్రమన్.

తీశాడు. ప్రేక్షకుల ముందు ఉంచాడు.

జనం ఏం చేశారు?

* * *

వాళ్లల్లో ఒకడు తనను తాను ఎస్.పి.బి అనుకున్నాడు. ఇంకొకడు ఇళయరాజా అనుకున్నాడు. మరొకడు కె.వి.మహదేవనో, పుహళేందో. నలుగురూ మద్రాసు చేరారు మ్యూజిక్ రంగంలో రాణిద్దామని. ఎవరూ ఆదరించలేదు. ఏవీఎం, విజయా గార్డెన్స్ గేట్లు వారి కోసం తెరుచుకోలేదు. పాట అందుకుంటే, కీర్తన ఆలపిస్తే కడుపు నిండదు. తినడానికి డబ్బులు కావాలి. వారి దగ్గర లేవు. ఆత్మాభిమానానికి ఆకలి ప్రథమ శత్రువు. వాళ్లు నలుగురు స్ట్రీట్ సింగర్స్‌గా మారారు. చెట్టు కింద, పేవ్‌మెంట్ మీద, బీచ్‌లో, బస్టాండ్ సమీపంలో గుడ్డ పరిచి పాట మొదలుపెట్టారు. రోజూ నాలుగు చోట్ల కచ్చేరీలు. దారిన పోయేవాళ్లు ఆగి కాసేపు విని చిల్లర పడేస్తే ఆ పూటకు భోజనం. లేకుంటే లేదు.

వాళ్లు బతకడమే కష్టం అనుకుంటే ఇంకో పొట్ట కూడా తోడు చేరింది.

అమ్మాయి.

ఇప్పుడేమవుతుంది?

* * *

మద్రాసులో ఏదో అడ్రస్ కోసం వెతుక్కుంటూ ఆ అమ్మాయి ఊరు విడిచి వచ్చింది. ఆ అడ్రస్‌లో ఆమెకు కావలిసిన వారు లేరు. వీళ్లు కనిపించారు. ఆ అమ్మాయి వీరి వెంట నడిచింది. వయసులో ఉన్న కుర్రాళ్లందరూ గోడలు దూకేవాళ్లే అయి ఉండరు. కొందరు ఆశ్రయం కోరేవారికి పైకప్పుగా కూడా నిలబడగలుగుతారు. ఆ అమ్మాయి కష్టంలో ఉందని ఆ నలుగురు గ్రహించారు. తమ గదిలోనే చోటు ఇచ్చారు. వీధి ఆశ్చర్యపోయింది. హౌస్ ఓనరమ్మ ముక్కున వేలేసుకుంది. కాని మన ప్రవర్తనే మనకు సర్టిఫికెట్ ఇస్తుంది. త్వరలోనే వారిని ఆ వాడ యాక్సెప్ట్ చేసింది. డాబా మీద గది. రోజూ కనిపించే చందమామ. పిసినారితనం చూపకుండా హాయిగా వీచే చల్లగాలి. కొద్దిగా తిన్నా కడుపు నింపగల అన్నం. చేయగలిగిన కూర. బోలెడన్ని కబుర్లు. శ్వాస అంత సులభంగా తోడుగా ఉండే పాట.

పాటలలోన జీవితమే పలికేను అంట..

మాటలలో చందనమే వెదజల్లేనంట...

* * *

ఒక పల్లవికి నాలుగు చరణాలు తోడయ్యాయి. వాళ్లు జీవితంలో పైకి రావాలంటే వీధుల వెంట పాడటం మాని మంచి అవకాశాల కోసం ప్రయత్నించాలి అని ఆ అమ్మాయి వారికి చెబుతుంది. దాని కోసం జరిగే కాంపిటీషన్‌లో పాల్గొనడానికి ఏరోజుకారోజు డబ్బు కూడబెట్టేలా చేస్తుంది. ఈ లోపు ఆమె గతం కూడా వారికి చెబుతుంది. ఆమె ప్రేమించినవాడు దేశంలో లేడు. రేపో మాపో వస్తాడు... వస్తే అతడిని పెళ్లి చేసుకోవాలి... అందుకోసమే ఎదురు చూస్తోంది... ఆ విషయం తెలిసి వాళ్లు నలుగురు సంతోషపడతారు. అందరూ ఆ రాబోయేవాడి కోసం ఎదరు చూస్తూ ఉంటారు.

కాని వచ్చేవాడు ఫల్గుణుడు కాదు. ఫాల్తు వెధవ. కుసంస్కారి.

* * *

ఆడపిల్లకు వ్యక్తిత్వం ఉందని లోకం అంగీకరించదు. మగవాళ్లు స్నేహానికి, వ్యక్తిత్వానికి విలువ ఇస్తారన్నా లోకం నమ్మదు. ఒక అమ్మాయి నలుగురు అబ్బాయిలు ఒకే గదిలో సంవత్సరం పాటు ఉంటున్నారంటే వాళ్ల మధ్య ఏమీ ఉండకుండా ఉంటుందా? కథ చూస్తున్న ప్రేక్షకులకు వారి మధ్య ఏమీ లేదని తెలుస్తూ ఉంటుంది. కాని పాత్రధారి అయిన ఆ అమ్మాయి ప్రియుడికి మాత్రం తెలియదు. అతడు తెలివి మీరుతాడు. ఏకంగా ఆ అమ్మాయిని తీసుకెళ్లి కన్యత్వ పరీక్ష చేయిస్తాడు. అమ్మాయి హర్ట్ అవుతుంది. ఎందుకు చేయించావ్ అని అడిగితే పావలా రీఫిల్ కొనేటప్పుడు కూడా నాలుగుసార్లు రాసి చూసి కొంటాము... జీవితాంతం చూసుకోవాల్సిన వ్యక్తి ఎలా ఉందో తెలుసుకోవాల్సిన అవసరం లేదా అంటాడు. సీతకు కూడా అగ్నిపరీక్ష ఉందని అంటాడు. 'సీత చెడిపోవాలనుకుంటే అయోధ్యలోనే చెడిపోయి ఉండవచ్చు. అశోకవనంలోనే కాదు' అంటుంది ఆ అమ్మాయి. 'ఎవరైతే నన్ను నమ్మాలో నువ్వు నన్ను నమ్మలేదు. ఎవరినైతే నేను అనుమానంగా చూడాలో వారు నన్ను నమ్మారు. ఇక నీకూ నాకూ పడదు. గుడ్‌బై' అని ఆ అమ్మాయి అతణ్ణి వదిలి తను ఇష్టపడే, గౌరవించే నలుగురు స్నేహితుల దగ్గరకు వచ్చేస్తుంది. వాళ్ల ట్రూప్‌లో సభ్యురాలిగా ఉండిపోతుంది.

ఆ ఐదుగురు కలిసి ఇప్పుడొక స్నేహగీతం అయ్యారు. దానిని సరిగా వినగలిగే సంస్కారం ఉన్నవాళ్లే వాళ్లకు తోడవుతారు. లేకుంటే? వాళ్ల దారిలో వారలా సాగిపోతూనే ఉంటారు.

అమ్మాయి అబ్బాయి అనగానే ప్రేమ, కామం అని స్థిరపడిన లోకానికి వారి మధ్య స్నేహం కూడా సాధ్యమే అని చాలా తర్కబద్ధంగా, సంస్కారవంతంగా నిరూపించిన కథ కొద్దిగా అయినా ప్రేక్షకులను మారుస్తుంది. ఈ సినిమా అవసరం ఆ కాలం కంటే ఈ కాలం ఎక్కువగా ఉంది.

ప్రేమ కోసం కత్తిపట్టుకునే వాళ్లంతా ఈ సినిమా డీవీడీ పట్టుకుంటే ఎంత బాగుండు?


- కె

పుదు వసంతం


● విక్రమన్


● ఎస్.ఎ.రాజ్‌కుమార్

దర్శకుడు విక్రమన్ తన తొలి సినిమాగా ప్రేక్షకుల మీదకు సంధించిన ఈ కొత్త తరహా కథ 'పుదు వసంతం'గా 1990లో విడుదలయ్యి తమిళంలో సినిమా కథా ధోరణినే మార్చేసింది. పాడే హీరోలు, స్నేహం చేసే హీరోలు, నలుగురు కుర్రాళ్ల కథలు... ఇలాంటివి భారతీయ భాషలలో పుంఖాను పుంఖాలుగా రావడానికి ఈ సినిమా బీజం వేసింది. తమిళ నటుడు మురళి, ఆనంద్ బాబు, సితార వీళ్లంతా ఈ సినిమాతో చాలా పేరు సంపాదించుకున్నారు. సంగీత దర్శకుడు ఎస్.ఏ.రాజ్‌కుమార్ ఈ సినిమా పాటలతో ఇళయరాజా ధాటికి తట్టుకుని నిలబడగలిగాడు. 'స్త్రీని పరీక్షించే పురుష స్వభావాన్ని' ప్రశ్నించినందుకే ఈ సినిమా హిట్ అయ్యిందని చెప్పాలి. ప్రఖ్యాత దర్శకుడు కె.ఎస్.రవికుమార్ ఈ సినిమాకు అసిస్టెంట్‌గా పని చేశారు. దీని ప్రభావంతో చిరంజీవి, సాక్షి శివానంద్‌లతో 'ఇద్దరు మిత్రులు' తీశారు కాని సఫలం కాలేదు. అలాగే తరుణ్ హీరోగా ఇదే ధోరణిలో 2002లో ఒక 'నవ వసంతం' వచ్చింది. సూపర్‌గుడ్ ఫిలిమ్స్ చౌదరి, విక్రమన్ కాంబినేషన్‌లో వచ్చిన హిట్ సినిమాలలో 'శుభాకాంక్షలు', 'రాజా', 'మా అన్నయ్య', 'సూర్యవంశం' తదితర భారీ హిట్స్ ఉన్నాయి. తమిళంలో విక్రమన్‌ది ఒక శకం.


● రామ్‌చరణ్, రాజమౌళి, ఎన్టీఆర్

ఇద్దరూ ఇద్దరే

...ఈ టైటిల్ వినగానే శోభన్‌బాబు–కృష్ణంరాజు (1976), అక్కినేని నాగేశ్వరరావు–నాగార్జున(1990) నటించిన సినిమాలు గుర్తుకు రాకమానవు. ఇప్పుడు మరోసారి ఈ టైటిల్ తెరపైకి వచ్చింది. 'బాహుబలి' వంటి విజువల్ వండర్ తర్వాత రాజమౌళి నెక్స్ రామ్‌చరణ్–ఎన్టీఆర్‌తో ఓ మల్టీస్టారర్ మూవీ చేసే ప్లాన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఫిల్మ్‌నగర్‌లో ప్రచారమవుతున్న వార్తల ప్రకారం ఈ చిత్రానికి 'ఇద్దరూ ఇద్దరే' అనే టైటిల్ పరిశీలిస్తున్నారని సమాచారం. ఎన్టీఆర్–చరణ్‌లకు ఈ చిత్రంలో సమ ప్రాధాన్యత ఉంటుందట. అందుకే ఏ టైటిల్ అయితే బాగుంటుందా? అని ఇద్దరు హీరోలకు సరిపడేలా 'ఇద్దరూ ఇద్దరే' అనుకుంటున్నారట. ప్రస్తుతం 'రంగస్థలం' షూటింగ్‌లో ఉన్న రామ్‌చరణ్ తర్వాతి సినిమాని బోయపాటి శ్రీనుతో చేయనున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ చేయనున్న సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ హీరోలిద్దరూ ఈ చిత్రాలు చేసేలోపు రాజమౌళి ప్లానింగ్‌లో ఉంటారట. ఆ తర్వాత ఈ ముగ్గురి కాంబినేషన్ ప్రాజెక్ట్ స్టార్ట్ అవుతుందట.

బాహుబలి.. ఓ పాఠం!


● ప్రభాస్

'బాహుబలి' సినిమా ఖాతాలో మరో రికార్డు చేరింది. అదేంటంటే.. 'బాహుబలి' సినిమా సక్సెస్‌ను పాఠంగా చెప్పబోతున్నారు. ఈ చిత్ర విజయాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ (ఐఐఎమ్ఎ) ఓ కేస్ స్టడీగా తీసుకుని, పరిశోధన చేయనున్నట్లు అక్కడి ప్రొఫెసర్ భరతన్ కందస్వామి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ– ''సీక్వెల్‌గా వచ్చిన 'బాహుబలి' చక్కని మార్కెటింగ్ స్ట్రాటజీతో మంచి వసూళ్లు రాబట్టింది. సీక్వెల్స్ తీస్తున్నప్పుడు ఫస్ట్ పార్ట్ సక్సెస్ అయితే రెండో పార్ట్‌కి పబ్లిసిటీ ఈజీగా వస్తుంది. మార్కెటింగ్ సులువు అవుతుంది. ప్రధానంగా నేను సీక్వెల్స్ నిర్మాణం, మార్కెటింగ్ మంత్ర, కలెక్షన్స్ మీద దృష్టి పెట్టబోతున్నాను. ఈ విషయాల్లో అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులకు డిజిటల్ మార్కెట్ గురించి కూడా చెబుతాం. సినిమా ఇండస్ట్రీ గురించి అన్ని కోణాల నుంచి విద్యార్థులకు తెలియజేయనున్నాం. అందుకే సక్సెస్ సాధించిన 'బాహుబలి' సినిమాను ఓ కేస్ స్టడీగా తీసుకోవాలని నిర్ణయించుకున్నాం'' అన్నారు. రాజమౌళి దర్శకత్వంలో శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మించిన 'బాహుబలి' బాక్సాఫీస్ దగ్గర ఎంతటి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ప్రభాస్, రానా, అనుష్క, తమన్నా, రమ్యకృష్ణ, నాజర్, సత్యరాజ్ ముఖ్య తారలుగా నటించిన ఈ సినిమా తెలుగు ఇండస్ట్రీకి గర్వకారణంగా నిలిచింది.

ఊరంతా అనుకుంటున్నారు


● నవీన్ విజయ్‌కృష్ణ

'నందిని నర్సింగ్ హోమ్' చిత్రంతో ప్రేక్షకులకు నవ్వులు పంచడంతో పాటు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరో నవీన్ విజయ్‌కృష్ణ. ప్రస్తుతం తండ్రి నరేష్‌తో కలిసి 'విఠలాచార్య' సినిమాలో నటిస్తున్న నవీన్ పుట్టినరోజును(మంగళవారం) పురస్కరించుకొని మూడో సినిమా ప్రకటించారు. బాలాజీ సనాల దర్శకత్వంలో రోవస్కైర్ ఎంటర్‌టైన్మెంట్స్–యు–ఐ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్స్‌పై శ్రీహరి మంగళంపల్లి– ఎ.పద్మనాభరెడ్డి నిర్మించనున్న ఈ సినిమాకి 'ఊరంతా అనుకుంటున్నారు' టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను నవీన్ విజయ్‌కృష్ణ మిత్రుడు హీరో సాయిధరమ్ తేజ్ రిలీజ్ చేశారు. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. టైటిల్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్ కీలకపాత్ర పోషించనున్నారు. ఈ నెల 22 నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది'' అన్నారు దర్శక–నిర్మాతలు. మేఘా చౌదరి, సోఫియా సింగ్, జయసుధ, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్యపాత్రలు పోషించనున్న ఈ చిత్రానికి సంగీతం: కె.ఎం.రాధాకృష్ణ, కెమెరా: జి.లింగబాబు, లైన్ ప్రొడ్యూసర్: శ్రీరమ్య గోగుల.

వన్ మోర్ చాన్స్


● రకుల్ ప్రీత్‌సింగ్


... కొట్టేశారు హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్. నీరజ్ పాండే దర్శకత్వంలో ఆమె నటించిన 'అయ్యారీ' సినిమా రిలీజ్ కాకముందే మరో హిందీ సినిమాకు సైన్ చేశారు. అకివ్ అలీ దర్శకత్వంలో అజయ్ దేవగన్ హీరోగా భూషణ్ కుమార్, రంజన్ నిర్మిస్తున్న సినిమాలో రకుల్‌ను హీరోయిన్‌గా సెలెక్ట్ చేసుకున్నారు నిర్మాతలు. ''రకుల్ హిందీలో నటించిన తొలి చిత్రం 'యారియాన్'కి నేనో నిర్మాతను. ఇప్పుడు మళ్లీ మా అసోసియేషన్ కుదరడం ఆనందంగా ఉంది. సౌత్‌లో మంచి యాక్టర్‌గా రకుల్‌కు పేరు తెచ్చుకుంది'' అన్నారు భూషణ్‌కుమార్. ఈ సినిమాలో టబు ఓ కీలక పాత్ర చేయనున్నారు. త్వరలో ఈ చిత్రం షూటింగ్ ఆరంభించి అక్టోబర్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. ఒకవైపు తెలుగు, తమిళ చిత్రాలతో బిజీగా ఉంటూ మరోవైపు హిందీ సినిమాలకూ డేట్స్ ఇస్తూ.. రకుల్ జోరు మీద ఉన్నారు.

అందుకే అరవై రోజులు!


● రాణీముఖర్జీ

రాణీ ముఖర్జీ తన తదుపరి చిత్రం 'హిచ్కీ' ప్రమోషన్ మొదలు పెట్టనున్నారు. సినిమా రిలీజ్ ముందు ప్రమోషన్ ఎవరైనా చేస్తారు.. అందులో విశేషం ఏముంది అనుకుంటున్నారా? ఆల్మోస్ట్ 60 డేస్ ప్రమోషన్ కోసం కేటాయించారామె. ఎందుకిలా? అంతగా ఎందుకు ప్రమోట్ చేయాలి? అంటే.. నాలుగేళ్ల తర్వాత రాణి నటించిన చిత్రం 'హిచ్కీ'. పెళ్లయి, తల్లయ్యాక నటించిన సినిమా. అందుకని ఈ సినిమా ఆమెకు ఓ స్పెషల్. ఇంకో స్పెషల్ ఏంటంటే.. ఇందులో ఆమె టూరెట్ సిండ్రోమ్ అనే నెర్వస్ డిజార్డ్‌తో బాధపడుతున్న నైనా మతూర్ పాత్రలో కనిపించబోతున్నారు. డిఫరెంట్ క్యారెక్టర్. మనలోని లోపాలని మన అవకాశాలుగా మలుచుకుని, వాటిని చాలెంజ్ చేసి గెలవటం అనే కథాంశంతో తీసిన సినిమా ఇది. అందుకని బాగా ప్రమోట్ చేయాలనుకుంటున్నారు. ఎంతైనా 60 రోజులు చేస్తారా? అంటే.. కంటిన్యూస్‌గా చేయడంలేదు. కొంచెం గ్యాప్ తీసుకుని చేస్తారు. ఒక్క ముంబైలోనే కాదు.. దేశంలోని పలు కాలేజీలు, స్కూల్స్‌ను సందర్శించనున్నారామె. ఈ చిత్రం ఫిబ్రవరి 23న విడుదల కానుంది.

నాగ్-ధనుష్ @ మల్టీస్టారర్


● నాగార్జున


● ధనుష్

కొందరు నటులు అంతే.. కథ, పాత్ర నచ్చితే చాలు.. అది గెస్ట్ రోలా? మల్టీస్టారరా? అని ఆలోచించరు. నాగార్జున ఈ కోవలోకే వస్తారు. ఓ వైపు సోలో హీరోగా చేస్తూనే మరోవైపు మల్టీస్టారర్ సినిమాలతో ముందుకెళుతున్నారాయన. 'అధిపతి', 'నిర్మలా కాన్వెంట్' చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించిన ఆయన 'సీతారామ రాజు, స్నేహమంటే ఇదేరా, రాజుగారి గది2', ఊపిరి' వంటి మల్టీస్టారర్ చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే. తాజాగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో నానీతో ఓ మల్టీస్టారర్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నాగార్జున. ఇది కాకుండా మరో మల్టీస్టారర్ మూవీ చేయనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అది కూడా తమిళ హీరో ధనుష్‌తో కావడం విశేషం. నాగార్జున–కార్తీ నటించిన 'ఊపిరి' చిత్రంలో నాగ్ నటన ధనుష్‌ని కట్టిపడేసిందట. తాను నటిస్తూ, నిర్మించనున్న చిత్రంలో నాగార్జున నటిస్తే బాగుంటుందనుకుంటున్నారట ధనుష్. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ధనుష్.. నాగార్జునను కలిసి సినిమా విషయమై చర్చించారని ఇటు టాలీవుడ్ అటు కోలీవుడ్‌లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. మరి.. నాగ్–ధనుష్ ప్రాజెక్ట్ ఉంటుందా? వెయిట్ అండ్ సీ.

అమ్మ ప్రేమ గొప్పది


● ప్రతాని, రాందాస్, సాయి వెంకట్

''తెలుగు గానా, తెలంగాణ అంటే ఇష్టం. హైదరాబాద్, అమరావతి కూడా చాలా ఇష్టం. తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం'' అని కేంద్ర మంత్రి రాందాస్ అత్వాల అన్నారు. కృష్ణుడు, సన ప్రధానపాత్రల్లో పి.ఉదయభాస్కర్ దర్శకత్వంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మిస్తోన్న చిత్రం 'అమ్మకు ప్రేమతో'. ఈ సినిమా పోస్టర్‌ని రాందాస్ అత్వాల విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''అమ్మకు ప్రేమతో' మంచి టైటిల్. ఈ సినిమా సక్సెస్ కావాలి. తెలంగాణ ఉద్యమం సమయంలో నేను కేసీఆర్‌గారికి మద్దతు కూడా ప్రకటించాను'' అన్నారు. రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''ఎంతో మంచి మనిషి, నిరంతరం ప్రజా సేవకై పాటుపడే వ్యక్తి రాందాస్ అత్వాలగారిని తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్(టి.ఎఫ్.సి.సి) తరపున సత్కరించడం గర్వంగా ఫీలవుతున్నాం. టి.ఎఫ్.సి.సి ఆధ్వర్యంలో ఇప్పటికే చాలా మందికి హెల్త్ కార్డులు అందించాం. భవిష్యత్‌లో మరిన్ని పథకాలను రాందాస్ గారిద్వారా సాధిస్తాం'' అన్నారు.

గోవాలో రాజకుమారుడు


● నవీన్‌బాబు, సంజన

నవీన్‌బాబు హీరోగా సంజన, అమృత హీరోయిన్లుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అనగనగా ఓ రాజకుమారుడు'. హాస్యనటుడు సుమన్ శెట్టి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. షెరాజ్ దర్శకత్వంలో రమాదేవి సమర్పణలో పీవీ రాఘవులు నిర్మిస్తోన్న ఈ చిత్రం గోవాలో మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. షెరాజ్ మాట్లాడుతూ – ''లవ్, కామెడీ, థ్రిల్లర్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. గోవా నేపథ్యంలో కథ ఉంటుంది. త్వరలో హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్ మొదలు పెట్టి, పాటలు, మిగతా సన్నివేశాలు పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా –ఎడిటింగ్: ఏకరీ లక్కీ, సంగీతం–స్క్రీన్‌ప్లే–దర్శకత్వం: షెరాజ్.





ఆర్మీ డే సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో సాహసవిన్యాసాలు ప్రదర్శిస్తున్న 'ఆర్మీ డేర్‌డెవిల్స్' బృంద సభ్యులు

శబరిమలలో తిరుమల తరహా సౌకర్యాలు

తిరువనంతపురం: తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే శబరిమల అయ్యప్ప భక్తులకు వసతి సౌకర్యాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. సీఎం పినరయి విజయన్ ఆదేశాల మేరకు నిపుణుల బృందం త్వరలోనే తిరుమలకు వెళ్లనుందని దేవాదాయ, టూరిజం శాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ తెలిపారు. ఆలయ భౌగోళిక స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకొనే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి 14 నాటికి ఆలయానికి రూ.255 కోట్లు ఆదాయం వచ్చిందని, గతేడాది కంటే ఇది రూ. 45 కోట్లు అధికమని వెల్లడించారు. దేవుడి ఆదాయాన్ని ప్రభుత్వం దారి మళ్లిస్తోందన్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని తెలిపారు.

డీఏసీఏ పథకం దాదాపు ముగిసింది: ట్రంప్



వాషింగ్టన్: తల్లిదండ్రులతోపాటు చిన్నతనంలోనే అక్రమంగా అమెరికా వచ్చిన స్వాప్నికులు (డ్రీమర్స్)కు రక్షణ కల్పిస్తున్న డీఏసీఏ (బాల్యంలో వచ్చిన వారిపై చర్యల వాయిదా) పథకం దాదాపు ముగిసిపోయిందనీ, ఇందుకు కారణం డెమొక్రాటిక్ పార్టీ సభ్యులేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిందించారు. 'డీఏసీఏ పథకం దాదాపు ముగిసింది. ఈ పథకం డెమోక్రాట్లకు ఇష్టం లేదు. వారు కేవలం మాట్లాడతారు. సైన్యానికి అవసరమైన డబ్బును దూరం చేసేందుకే వారున్నారు' అంటూ ట్రంప్ ఆదివారం ఓ ట్వీట్ చేశారు. డీఏసీఏను రద్దు చేసే నిర్ణయాన్ని అమెరికాలోని ఓ కోర్టు పక్కనబెట్టడంతో ప్రభుత్వం మళ్లీ డీఏసీఏ రెన్యువల్ దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ ట్వీట్ చేశారు. ప్రస్తుతం అమెరికాలో స్వాప్నికులు దాదాపు 8 లక్షల మంది ఉన్నారు.

తమిళనాడులో జల్లికట్టుకు నలుగురి బలి

సాక్షి ప్రతినిధి, చెన్నై/చంద్రగిరి: సంక్రాంతి సందర్భంగా తమిళనాడులో నిర్వహించిన జల్లికట్టు కార్యక్రమంలో గత మూడు రోజుల్లో నలుగురు మరణించారు. 15వ తేదీ పాలమేడులో జల్లికట్టు సందర్భంగా ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చున్న యువకుడు ఎద్దు పొడవడంతో మృతిచెందాడు. తిరుచిరాపల్లి మనకోట్టైలో మంగళవారం జరిగిన జల్లికట్టులో ఎద్దు పొడవడంతో ఒక వ్యక్తి చనిపోయాడు. శివగంగై జిల్లా శిరవయల్‌లో మంగళవారం మంజువిరాట్ పోటీల సందర్భంగా ఎద్దులను వదలగా అవి ప్రేక్షకుల్లోకి దూసుకెళ్లాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా 50 మంది గాయపడ్డారు. కాగా,మదురై జిల్లా అలంగనల్లూరులో క్రీడా పోటీలను సీఎం పళనిస్వామి ప్రారంభించారు. విజేతలకు కారు, బంగారు నాణేలు తదితర రూ.కోటి విలువైన ఆకర్షణీయ బహుమతులు ప్రకటించారు.

ఆధార్ ధ్రువీకరణకు ఇక ఫేస్ రికగ్నిషన్

న్యూఢిల్లీ: బయోమెట్రిక్ పద్ధతి వల్ల ఆధార్ ధ్రువీకరణ సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్న వారి కోసం భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) మరో కొత్త విధానాన్ని తీసుకురాబోతోంది. ఇప్పటిదాకా కేవలం వేలి ముద్రలు, ఐరిస్ ద్వారానే ఆధార్ ధ్రువీకరణకు అవకాశం ఉండగా, ఇకపై ముఖాకృతిని గుర్తించటం (ఫేస్ రికగ్నిషన్) ద్వారా కూడా ధ్రువీకరణ చేసుకునే వెసులుబాటును కల్పించనుంది. ఏవేనీ కారణాల వల్ల వేలిముద్రలు చెరిగిపోయిన లేదా బాగా దెబ్బతిన్న వారికి, వృద్ధాప్యంలో ఉండి వేలిముద్ర వేయలేని వారికి యూఐడీఏఐ తాజా నిర్ణయం ఎంతో ఉపయోగకరం. అయితే ఫేస్ రికగ్నిషన్ విధానంలో ధ్రువీకరణ చేసుకోవాలంటే ముఖానికి తోడు వేలిముద్ర లేదా కళ్లు (ఐరిస్) లేదా ఆధార్ డేటా బేస్‌లో రిజిస్టర్ అయి ఉన్న మొబైల్‌కి వచ్చే ఓటీపీ (వన్ టైం పాస్‌వర్డ్)....వీటిలో ఏదో ఒకటి కూడా కచ్చితంగా అవసరం. ఈ విధానాన్ని జూలై 1 నుంచి అవసరమైన చోట ఉపయోగించుకోవచ్చని యూఐడీఏఐ సోమవారం వెల్లడించింది. ఫేస్ రికగ్నిషన్ కోసం కొత్తగా రిజిస్ట్రేషన్ అవసరం లేదనీ, ఇంతకు ముందే ఆధార్ డేటాబేస్‌లో ఉన్న ఫొటోనే ఇందుకోసం వాడతారని తెలిపింది. ఫేస్ రికగ్నిషన్‌కు అవకాశం కల్పించేలా ధ్రువీకరణ యంత్రాల్లో కూడా మార్పులు చేసేందుకు యూఐడీఏఐ ఆయా యంత్రాల ఉత్పత్తిదారులతో కలిసి పనిచేయనుంది. ప్రస్తుతం దేశంలో 119 కోట్ల మందికి ఆధార్ కార్డులుండగా, సగటున రోజుకు 4 కోట్ల ఆధార్ ధ్రువీకరణలు జరుగుతున్నాయి. ఆధార్ సమాచారానికి మరింత భద్రత, గోప్యత కోసం 16 అంకెల వర్చువల్ గుర్తింపు సంఖ్యను కేటాయించే విధానాన్ని కూడా మార్చి 1 నుంచి అమలు చేస్తామని యూఐడీఏఐ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే.

అమేథీలో రాహుల్‌కు నిరసనల సెగ

అమేథీ: సొంత నియోజకవర్గం అమేథీలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పర్యటన రెండో రోజు బీజేపీ కార్యకర్తల నిరసనల మధ్యనే సాగింది. ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక ఆయన అమేథీలో పర్యటించటం ఇదే ప్రథమం. పర్యటనలో భాగంగా రెండో రోజు ముసాఫిర్‌ఖానా నుంచి గౌరిగంజ్ ఏరియాకు రావల్సి ఉంది. అయితే, బీజేపీ కార్యకర్తలు ముసాఫిర్‌ఖానా–గౌరీగంజ్ రోడ్డుపై 'మిస్సింగ్ ఎంపీ' అంటూ ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. రైతుల భూములను ట్రస్ట్‌లకు అప్పగిస్తున్నారని, అమేథీ అభివృద్ధిని విస్మరించారని నినాదాలు చేశారు.

కుదరని రాజీ.. తొలగని సంక్షోభం!

ఇంకా సమసిపోని సుప్రీంకోర్టు జడ్జీల వివాదం

- సీజేఐ దీపక్ మిశ్రాతో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల భేటీ
- సంక్షోభం ఇంకా ముగిసినట్లు లేదు: అటార్నీ జనరల్
- రెండు మూడ్రోజుల్లో పరిష్కారం కావచ్చు: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా



సీజేఐ దీపక్ మిశ్రా

ఏజీ వేణుగోపాల్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో నెలకొన్న సంక్షోభం కొనసాగుతోంది. ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్రా, నలుగురు సీనియర్ న్యాయమూర్తుల మధ్య నెలకొన్న వివాదం ఇంకా సమసిపోలేదు. జస్టిస్ మిశ్రాతో.. ఆయనపై ప్రెస్‌మీట్‌లో తీవ్ర విమర్శలు చేసిన జడ్జీలు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ ఎంబీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసఫ్ మంగళవారం భేటీ అయ్యారు. 15 నిమిషాల పాటు వీరి భేటీ జరిగిందని, ఇందులో వీరితో పాటు మరికొందరు న్యాయమూర్తులు కూడా పాల్గొన్నారని సుప్రీం వర్గాలు వెల్లడించాయి. తర్వాత జడ్జీలంతా విధుల్లోకి వెళ్లారు. అయితే, ఈ భేటీ అనంతరం వివాద పరిష్కారానికి సంబంధించి కానీ, రాజీ మార్గానికి సంబంధించి కానీ ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అలాగే, వారి మధ్య ఏయే అంశాలు చర్చకొచ్చాయన్న విషయమూ తెలియరాలేదు. కాగా, ఈ సంక్షోభాన్ని కుటుంబ వివాదంగా, టీ కప్పులో తుపానుగా అభివర్ణించి, సమస్య పరిష్కారమైందంటూ సోమవారం ప్రకటించిన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్.. మంగళవారం మాత్రం సమస్య ఇంకా పరిష్కారమైనట్లు కనిపించడం లేదని, మరో రెండు, మూడు రోజుల్లో అంతా సర్దుకుంటుందని చెప్పడం గమనార్హం.

టీ కప్పులో తుపాను

ఇది చిన్న కుటుంబ వివాదమని, ఇది కూడా ముగిసినట్లేనని అటార్నీ జనరల్(ఏజీ) కేకే వేణుగోపాల్‌తో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మన్ కుమార్ మిశ్రాలు సోమవారం చెప్పారు. దీంతో ఇకపై అంతా సజావుగా సాగుతుందని న్యాయ వర్గాలు భావించాయి. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు తమ విధులకు హాజరయ్యారని, పరిస్థితి అదుపులోనే ఉందని, అంతా చక్కబడిందని ఏజీ చెప్పారు. ఇంతవరకూ తాను సీజేఐ సహా ఏ న్యాయమూర్తిని కలవలేదన్నారు. మన్ మిశ్రా కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. 'ప్రెస్ కాన్ఫరెన్స్‌లో నలుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు కుటుంబంలోని అంతర్గత విషయాలు.. అవి అంతర్గతంగానే పరిష్కారమయ్యాయి' అని చెప్పారు. అంతకుముందు రోజు మిశ్రా నేతృత్వంలోని ఏడుగురి బృందం వివాద పరిష్కారం కోసం సీజేఐతో పాటు సుప్రీంకోర్టులోని 15 మంది న్యాయమూర్తులతో విస్తృతంగా చర్చించింది. సంక్షోభం సర్దుకుందని అందరూ అనుకుంటోన్న తరుణంలో అటార్నీ జనరల్ వేణుగోపాల్ మంగళవారం మాట్లాడుతూ.. 'సంక్షోభం సమసిపోలేదని అనుకుంటున్నాను. రెండు మూడ్రోజుల్లో అంతా పరిష్కారమవుతుందని ఆశిద్దాం' అని చెప్పడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

ప్రెస్ కాన్ఫరెన్స్‌పై పిటిషన్ తిరస్కరించిన సీజేఐ

సీజేఐ, నలుగురు సీనియర్ న్యాయమూర్తుల మధ్య విభేదాల నేపథ్యంలో సుప్రీంకోర్టు కార్యకలాపాలపై సోమవారం ఆసక్తి కొనసాగింది. శుక్రవారం ప్రెస్ కాన్ఫరెన్స్ అనంతరం తొలిసారి వారు విధులకు హాజరయ్యారు. తన కోర్టు గదిలో సీజేఐ జస్టిస్ మిశ్రా రోజువారీ కేసుల విచారణను ప్రారంభించగానే.. నలుగురు న్యాయమూర్తుల ప్రెస్ కాన్ఫరెన్స్ విషయాన్ని న్యాయవాది ఆర్పీ లూథ్రా ప్రస్తావిస్తూ.. చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అయితే ఆ పిటిషన్‌ను సీజేఐ తిరస్కరించారు. అనంతరం సీజేఐ నేతృత్వంలోని జస్టిస్ ఎం.ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం పలు కేసుల్ని విచారించింది. ఇక రెండో నెంబరు కోర్టు గదిలో జస్టిస్ చలమేశ్వర్ పలు కేసుల్ని విచారించారు. జస్టిస్ గొగొయ్, జస్టిస్ లోకూర్, జస్టిస్ జోసఫ్‌లు వరుసగా మూడు, నాలుగు, ఐదు కోర్టు గదుల్లో కేసుల విచారణను కొనసాగించారు.

మరోవైపు, మంగళవారం సాయంత్రం జస్టిస్ జే చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు భేటీ అయ్యారు. అయితే వారి మధ్య చర్చల సారాంశం తెలియరాలేదు. బుధవారం కూడా నలుగురు న్యాయమూర్తులు సీజేఐతో సమావేశమవుతారని సుప్రీం వర్గాలు పేర్కొన్నాయి.


హజ్ సబ్సిడీ రద్దు

- ముస్లింల సాధికారత కోసమే: కేంద్రమంత్రి నఖ్వీ
- ఈ మొత్తాన్ని మైనార్టీ బాలికల విద్యకు వినియోగిస్తాం

న్యూఢిల్లీ: ఈ ఏడాది నుంచి హజ్ యాత్రకు సబ్సిడీ ఇవ్వబోమని కేంద్ర మైనారిటీ శాఖమంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. 'బుజ్జగింపు రాజకీయాలు కాకుండా ముస్లింలు హుందాగా బతికేలా సాధికారత కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఈ సబ్సిడీతో ముస్లింలు ఎలాంటి లబ్ధి పొందటం లేదు. గౌరవంతో కూడిన అభివృద్ధినే మేం విశ్వసిస్తాం. ఇప్పటివరకూ హజ్‌యాత్రకు కేటాయిస్తున్న మొత్తాన్ని మైనారిటీ బాలికల చదువుకు వినియోగిస్తాం' అని మంగళవారం మీడియాకు వెల్లడించారు. సౌదీ అరేబియాలోని మక్కాకు దేశం నుంచి ఏటా 1.75 లక్షల మంది ముస్లింలు వెళ్తుంటారని నఖ్వీ తెలిపారు. గతేడాది హజ్ సబ్సిడీ కింద రూ.250 కోట్లకు పైగా కేటాయించినట్లు వెల్లడించారు. సబ్సిడీ రద్దు వల్ల హజ్ ఖర్చులు పెరిగిపోకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2022 నాటికి హజ్ సబ్సిడీని పూర్తిగా ఎత్తేయాలంటూ సుప్రీం కోర్టు 2012లో ఇచ్చిన ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సబ్సిడీలో భాగం గా ప్రభుత్వ రంగ విమానయాన సంస్థల్లో టికెట్ ధరలపై రాయితీ ఇస్తున్నారు.

అదనపు భారమేం ఉండదు

సాక్షి, హైదరాబాద్: హజ్ సబ్సిడీని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారిపై ఎలాంటి అదనపు భారం పడదని హజ్ కమిటీ ఉన్నతాధికారులు తెలిపారు. హజ్ యాత్రకు విమానయాన టికెట్లపై కేంద్ర హజ్ కమిటీ నిర్ణయించిన స్లాబ్ రేటుకు, విమానయాన సంస్థలు వసూలు చేస్తున్న మొత్తానికి భారీ వ్యత్యాసం లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. గతేడాది హజ్ యాత్రికులకు కమిటీ స్లాబ్ రేటును రూ.65 వేలుగా నిర్ధారించగా, విమానయాన సంస్థలు రూ.62,065 మాత్రమే వసూలు చేశాయన్నారు. సాధారణంగా ఇప్పటివరకూ స్లాబ్ రేటు కన్నా ఎక్కువ మొత్తాన్ని విమానయాన సంస్థలు వసూలు చేస్తే.. ఆ మొత్తాన్ని సబ్సిడీగా కేంద్రం హజ్ కమిటీకి అందజేస్తుంది.



సీబీఐకి సుప్రీంకోర్టు చీవాట్లు

మణిపూర్ ఎన్‌కౌంటర్లపై మరిన్ని ఎఫ్‌ఐఆర్‌లకు ఆదేశం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ఆర్మీ, అస్సాం రైఫిల్స్, పోలీసులు చేసినట్లుగా ఆరోపణలు వచ్చిన ఎన్‌కౌంటర్లపై తగినన్ని ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయనందుకు సీబీఐని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కేవలం 12 ఎఫ్ఆర్‌ఐలు మాత్రమే నమోదు చేయడంపై జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ యుయు లలిత్‌ల ధర్మాసనం సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై ఆగ్రహం వ్యక్తం చేసింది. జనవరి 31 లోపు మరో 30 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించింది. మణిపూర్‌లో అధికార పరిధిని అతిక్రమించి చేసిన హత్యలకు సంబంధించి 1,528 కేసులపై దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

'లోయా' డాక్యుమెంట్లపై...

సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బీహెచ్ లోయా మృతికి సంబంధించిన ఏ డాక్యుమెంట్లను పిటిషనర్లకు ఇవ్వాలన్న నిర్ణయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వానికే సుప్రీం కోర్టు వదిలిపెట్టింది. లోయా మృతిపై స్వతంత్ర విచారణ జరపాలంటూ పలువురు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం లోయా పోస్టుమార్టం నివేదికతో పాటు పలు డాక్యుమెంట్లను కోర్టు ముందుంచింది. ఆ డాక్యుమెంట్లను తమకు ఇవ్వాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టును కోరగా.. ఆ డాక్యుమెంట్లలో రహస్య సమాచారం ఉందని, బహిర్గతం చేయలేమని మహారాష్ట్ర తరపు న్యాయవాది హరీశ్ సాల్వే కోర్టుకు తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి సముచితమని భావిస్తే డాక్యుమెంట్లను పిటిషనర్లకు ఇవ్వాలని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఎం శాంతనగౌడర్‌ల బెంచ్ పేర్కొంది.

బోఫోర్స్ కేసు అప్పీలుకున్న అర్హతేంటి?

బోఫోర్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేయడానికి పిటిషనర్‌కున్న అర్హతేంటో చెప్పాలని బీజేపీ నేత అజయ్ అగర్వాల్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. తీర్పుపై సీబీఐ ఎలాంటి అప్పీలు చేయలేదని.. ఈ కేసులో జోక్యం చేసుకునే అవసరం పిటిషనర్‌కు ఏముందో చెప్పాలని పేర్కొంది.

ఏడుగురు పాక్ సైనికుల కాల్చివేత


- పాక్ కవ్వింపు చర్యలకు భారత్ దీటైన జవాబు
- ఉడీలో ఐదుగురు జైషే ఉగ్రవాదుల హతం



జమ్మూ/శ్రీనగర్: భారత బలగాలపై తరచూ కాల్పులకు పాల్పడుతూ కవ్విస్తున్న పాక్‌కు భారత ఆర్మీ దీటైన జవాబిచ్చింది. ఓ మేజర్ సహా ఏడుగురు పాక్ జవాన్లను సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో హతమార్చింది. జమ్మూకశ్మీర్‌లోని మంధార్ సెక్టార్‌తో పాటు నియంత్రణ రేఖ(ఎల్వోసీ) వెంట ఉన్న భారత పోస్టులపై తెల్లవారుజాము నుంచే పాక్ బలగాలు విచక్షణా రహితంగా కాల్పులు ప్రారంభించినట్లు ఆర్మీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన భారత్ బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు పాక్ సైనికులు చనిపోగా, నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. మరోవైపు కశ్మీర్‌లోని ఉడీ సెక్టార్ ద్వారా భారత్‌లోకి ప్రవేశించడానికి యత్నించిన ఐదుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదుల్ని కూడా భద్రతా బలగాలు కాల్చిచంపాయి. భారత్‌లోకి ఉగ్రవాదులు ప్రవేశించేందుకు వీలుగా పాక్ సైన్యం కాల్పులు జరుపుతోందనీ.. ఇదిలాగే కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ హెచ్చరించిన కొద్ది గంటలకే భారత బలగాలు పాక్ సైనికుల్ని హతమార్చాయి. ఇరు పక్షాల కాల్పులతో సరిహద్దులో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జమ్మూకశ్మీర్–పాక్ ఆక్రమిత కశ్మీర్‌ల మధ్య వ్యాపారాలతో పాటు రాకపోకల్ని నిలిపివేశారు. మరోవైపు, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశంలో అలజడి సృష్టించాలనుకున్న ఉగ్రవాదుల కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయి. జీలం నది ద్వారా భారత్‌లోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించాలనుకున్న ఐదుగురు జైషే మహమ్మద్ ఉగ్రవాదుల్ని సోమవారం హతమార్చాయి.

నన్ను చంపేందుకు కుట్ర

- తొగాడియా సంచలన ఆరోపణ
- కుట్ర దారుల పేర్లు సరైన సమయంలో వెల్లడిస్తా
- నాటకీయ ఫక్కీలో అదృశ్యం.. ఆస్పత్రిలో తిరిగి ప్రత్యక్షం



అహ్మదాబాద్‌లో మాట్లాడుతున్న తొగాడియా

అహ్మదాబాద్: ఎన్‌కౌంటర్‌లో తనను చంపేందుకు కుట్ర జరుగుతోందని వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్‌భాయ్ తొగాడియా(62) సంచలన ఆరోపణలు చేశారు. రాజస్థాన్, గుజరాత్ పోలీసులు తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. హిందూ జాతి, రామజన్మభూమి, గోవధ, రైతుల గురించి మాట్లాడకుండా చేసేందుకు, తన గొంతునొక్కేందుకు పదేళ్ల నాటి కేసులో అరెస్ట్ వారెంట్ జారీ చేయించారని ఆరోపించారు. తరచూ ముస్లిం వ్యతిరేక, హిందూ అనుకూల ప్రకటనలతో వార్తల్లో నిలిచే తొగాడియాకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో దగ్గరి సంబంధాలున్నాయి. అలాంటి తొగాడియా బీజేపీ పాలిత రాష్ట్రాలపై ఇలాంటి ఆరోపణలు చేయటం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. మంగళవారం అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సోమవారం ఉదయం గుజరాత్, రాజస్థాన్ పోలీసులు కలిసి పెద్ద సంఖ్యలో నా ఇంటికి వస్తున్నారని, ఎన్‌కౌంటర్‌లో చంపేందుకు కుట్ర పన్నారని సమాచారం అందింది. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరరాజే, హోంమంత్రి గులాబ్‌చంద్ కటారియాలను ఫోన్‌లో సంప్రదించగా అరెస్ట్ వారెంట్ విషయం తమకు తెలియదన్నారు. కోర్టు ఉత్తర్వులు అయినందున తాము ఆపలేమంటూ రాజస్థాన్‌లోని నా లాయర్లు కూడా చెప్పారు. దీంతో పోలీసులు చంపేస్తారనే భయంతో సెల్‌ఫోన్లు స్విచాఫ్ చేసుకున్నా. విమానంలో జైపూర్ వెళ్లి అక్కడి నుంచి గంగాపూర్ కోర్టులో హాజరుకావాలనుకుని మరో వ్యక్తితో కలిసి ఆటోలో బయలుదేరా. తల్తేజ్ ప్రాంతంలోకి వెళ్లేసరికి బ్లడ్ షుగర్స్ లెవల్స్ పడిపోవటంతో అపస్మారక స్థితికి వెళ్లిపోయాను. తిరిగి చేసేసరికి ఆస్పత్రిలో ఉన్నాను. ఈ నెల మొదటి వారంలో అహ్మదాబాద్‌లో కూడా తనపై అరెస్ట్ వారెంట్లు జారీ కాగా, గుజరాత్ సీఎం విజయ్ రూపానీ, హోంమంత్రి ప్రదీప్ సిన్హ్ జడేజాను అడగ్గా తమకు ఆ విషయం తెలియదన్నారు. ఎవరి ఆదేశాల మేరకు పోలీసులు నడుచుకుంటున్నారో నాకు తెలుసు. నా హత్యకు కుట్ర పన్నిన వారి పేర్లను సరైన సమయంలో సాక్ష్యాలతో సహా వెల్లడిస్తా 'అని తెలిపారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వీహెచ్‌పీ వర్గాలు తెలిపాయి. గుజరాత్ పటీదార్ ఉద్యమ నేత హార్దిక్‌పటేల్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత అర్జున్ మొధ్వాడియా తొగాడియాను ఆస్పత్రిలో పరామర్శించారు.

కరవు, కాంగ్రెస్‌లది అవినాభావ సంబంధం

వారు పేరు కోసమే ప్రాజెక్టులు ప్రకటించేవారు: ప్రధాని మోదీ



పచపదరా(రాజస్థాన్): భారీ హామీలు, శంకుస్థాపనలతో ప్రజల్ని మోసగించడం తప్ప కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. రూ. 43,129 కోట్లతో రాజస్థాన్‌లో నిర్మించనున్న బార్మర్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు పనుల్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'పేరు కోసం రైల్వే ప్రాజెక్టుల్ని ప్రకటించేవారు. అవి కనీసం వెలుగు చూడలేదు. రాజస్థాన్‌లో కరవు, కాంగ్రెస్‌లు కలిసికట్టుగా సాగేవి, ఆ పార్టీ తప్పుకున్నాక రాష్ట్రానికి కరవు నుంచి విముక్తి దొరికింది' అని మోదీ పేర్కొన్నారు. 2014 సాధారణ ఎన్నికలకు ముందు రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీ రూ. 500 కోట్లతో హడావుడిగా ఒకే ర్యాంకు ఒకే పెన్షన్ ప్రకటించిందని, కనీసం లబ్ధిదారుల జాబితాను కూడా సిద్ధం చేయలేదని ప్రధాని తప్పుపట్టారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ కోసం ఎన్డీఏ ప్రభుత్వం రూ. 12 వేల కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ. 10,700 కోట్లు చెల్లించిందని చెప్పారు. కాంగ్రెస్ కేవలం గరీబీ హటావో నినాదాలు మాత్రమే ఇస్తే.. దాన్ని సాధ్యం చేసేందుకు పేద మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, 4 కోట్ల కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది రాజస్థాన్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. బార్మర్ ప్రాజెక్టు ఘనత తమదేనంటూ బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రకటించుకున్నాయి. ఈ ప్రాజెక్టుకు 2013లో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ శంకుస్థాపన చేశారని, ఇప్పుడు మరోసారి మోదీ శంకుస్థాపన చేస్తున్నారని కాంగ్రెస్ విమర్శించింది.

ఇస్లాం అతివాదంతో పెను ముప్పు

- అంతర్జాతీయ వ్యవస్థపై దుష్పరిణామాలు
- ఢిల్లీలో రైసినా డైలాగ్‌ను ప్రారంభించిన నెతన్యాహు
- భారత్–ఇజ్రాయెల్ మధ్య బలమైన బంధానికి పిలుపు



మంగళవారం తాజ్‌మహల్ వద్ద ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దంపతులు

న్యూఢిల్లీ: ఇస్లాం అతివాదం, ఉగ్రవాదుల చర్యలు అత్యంత ప్రమాదకరమైనవనీ, అంతర్జాతీయ వ్యవస్థపై ఇవి తీవ్ర దుష్పరిణామాలు చూపగలవని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు భారత్–ఇజ్రాయెల్ మధ్య మరింత బలమైన బంధం ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఆరు రోజుల భారత పర్యటనలో ఉన్న నెతన్యాహు మంగళవారం ఢిల్లీలో రైసినా డైలాగ్ భౌగోళిక–రాజకీయ మూడో సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇజ్రాయెల్‌కు భారత్ సహజ భాగస్వామి, మిత్ర దేశమని చెప్పడంతో అక్కడే ఉన్న నరేంద్ర మోదీ పెదవులపై నవ్వులు విరిశాయి. ఒకప్పుడు ఏమీ లేని ఇజ్రాయెల్ ఆర్థిక, సైనిక, రాజకీయ శక్తుల ద్వారానే నేడు బలమైన దేశంగా ఎదిగిందని నెతన్యాహు చెప్పారు. దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభంగా మార్చేందుకు, కంపెనీల కార్యకలాపాల్లో ప్రభుత్వ పాత్రను పరిమితం చేసేందుకు మోదీ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ప్రజాస్వామ్య దేశాలు కూటమిగా ఏర్పడటం చాలా ముఖ్యమని నెతన్యాహు పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు పరిష్కారాలు కనుగొనేందుకు రైసినా డైలాగ్ సదస్సును 2016 నుంచి విదేశాంగ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఓఆర్ఎఫ్) సంయుక్తంగా ప్రతి ఏడాది నిర్వహిస్తున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ప్రపంచ దేశాల నుంచి మొత్తం 550 మంది ఈ ఏడాది హాజరవుతున్నారు. విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్, నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబ, యూఎస్ పసిఫిక్ కమాండ్‌కు చెందిన కమాండర్ హ్యారీ హ్యారిస్ తదితరులు బుధవారం ప్రసంగించనున్నారు.

తాజ్‌ను సందర్శించిన నెతన్యాహు

రైసినా డైలాగ్‌ను ప్రారంభించడానికి ముందు నెతన్యాహు తన భార్య సారాతో కలసి తాజ్‌మహల్‌ను సందర్శించారు. నెతన్యాహు దంపతులకు ఆగ్రా విమానాశ్రయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. నెతన్యాహు సందర్శన నేపథ్యంలో తాజ్‌మహల్‌లోకి రెండు గంటలపాటు సాధారణ ప్రజలను అనుమతించలేదు. కాగా, మోదీ గతేడాది ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు ఓల్గా బీచ్‌లో నెతన్యాహుతో కలసి నడిపిన గాల్–మొబైల్ జీప్‌ను నెతన్యాహు మోదీకి బహూకరించనున్నారు. దాదాపు రూ. 72 లక్షల విలువైన ఈ జీప్ సముద్రపు నీటిని నిర్లవణీకరణం చేసి తాగునీటిగా మారుస్తుంది. గాల్–మొబైల్ ఇప్పటికే భారత్‌కు చేరుకుంది.

భారత్ ఇజ్రాయెల్ మధ్య 9 ఒప్పందాలు

భారత్–ఇజ్రాయెల్ ద్వైపాక్షిక చర్చల సందర్భంగా సోమవారం ఇరు దేశాల మధ్య సైబర్ భద్రత, గ్యాస్, ఆయిల్ తదితర రంగాల్లో మొత్తం 9 ఒప్పందాలు కుదిరాయి. ఇరు దేశాల అధికారులు వీటిపై సంతకాలు చేశారు. అలాగే ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా–ఇజ్రాయెల్ వాణిజ్య సదస్సులో మోదీ మాట్లాడుతూ కంపెనీలు తమ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు భారత్‌లో అపార అవకాశాలున్నాయన్నారు.

ముంబైకి మోషే

2008 నవంబరు 26న ముంబైలో ఉగ్రవాదులు సృష్టించిన మారణహోమంలో రెండేళ్ల వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఇజ్రాయెల్ యూదు బాలుడు మోషే హోల్జ్‌బర్గ్ మంగళవారం మళ్లీ ముంబైకి వచ్చాడు. ప్రస్తుతం 11 ఏళ్ల వయసున్న మోషే, ఆ దుర్ఘటన తర్వాత భారత్‌కు రావడం ఇదే తొలిసారి. తన తాతయ్య షిమోన్ రోజెన్‌బర్గ్‌తో కలసి వచ్చిన అతను...తన తల్లిదండ్రులు చనిపోయిన నారీమన్ హౌస్‌ను సందర్శించి నివాళి అర్పించాడు. భారత్‌కు రావడం ఆనందంగా ఉందన్నాడు. గతేడాది మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు మోషేను, అతని కుటుంబాన్ని కలసిన మోదీ...వారు భారత్‌కు ఎప్పుడైనా రావొచ్చంటూ ఆహ్వానించారు. తాజాగా నెతన్యాహు పర్యటన నేపథ్యంలో మోషే ముంబైకి విచ్చేశాడు.

మోదీ నుంచి ఏం తెచ్చారు చంద్రబాబూ?

ధ్వజమెత్తిన పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీకి 30 సార్లు పర్యటించి ఏం సాధించారు? టీడీపీ సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్నప్పటికీ మీకు ప్రధాని లేదా కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్లు ఎందుకు దొరకడం లేదు? ఎట్టకేలకు ప్రధాని నరేంద్రమోదీతో భేటీ జరిపి రాష్ట్రానికి ఏం తెచ్చారు? కేంద్రంలో ఉన్న టీడీపీ మంత్రులు ఏం చేస్తున్నారు?అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని పీఏసీ (ప్రజా పద్దుల కమిటీ) చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా రాజధాని పేరుతో నాలుగేళ్లలో నాలుగు తాత్కాలిక భవనాలు నిర్మించడం తప్ప చంద్రబాబు సాధించిందేమీ లేదని ధ్వజమెత్తారు. నాలుగేళ్ల తరువాత బాబు ఢిల్లీకి వెళ్లి ప్రధానికి వినతిపత్రం ఇవ్వడం... సాధారణ ప్రజలు కలెక్టర్ వద్దకు వెళ్లి అర్జీ ఇచ్చినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షమే లేకుండా చేయాలన్నదే బాబు లక్ష్యమన్నారు. అందుకే రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ సీట్లను 225కు పెంచాలని మాత్రమే ప్రధానిని కోరారని చెప్పారు.ప్రత్యేక హోదా, అమరావతి నిర్మాణం, పోలవరం , విశాఖకు ప్రత్యేక రైల్వే జోన్, గుంటూరు–తెనాలి–మంగళగిరి మెట్రో రైలు, వైజాగ్–చెన్నై కారిడార్... విభజన చట్టంలోని ఒక్క హామీని కూడా చంద్రబాబు ప్రభుత్వం సాధించలేదని బుగ్గన ధ్వజమెత్తారు. ప్రతి మూడు నెలలకు ఓసారి బ్రోచర్, రియల్ ఎస్టేట్ ప్లాన్, బిల్డింగ్ డిజైన్లు అంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప చేసింది ఏమీ లేదన్నారు. లక్ష ఎకరాల భూమి తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, త్వరలోనే బాబు మోసాలన్నీ బయటపడతాయని చెప్పారు.

నేటి నుంచి అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సు

విశాఖ సిటీ: పారిశ్రామిక నవకల్పనలు, సాంకేతిక ఉత్పత్తి, పారిశ్రామికీకరణ అంశాలపై విశాఖపట్నంలో బుధవారం నుంచి 19 వరకు నిర్వహించే అంతర్జాతీయ మహిళా పారిశ్రామికాభివృద్ధి సదస్సుకు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సదస్సును ప్రారంభిస్తారు. తమ ఉత్పత్తుల్ని ప్రదర్శించడంతో పాటు వ్యాపార అభివృద్ధిపై చర్చించేందుకు దేశ విదేశాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు రానున్నారు. భారత మహిళా పారిశ్రామిక వేత్తల సమాఖ్య (అలీఫ్ ఇండియా), దక్షిణాసియా మహిళాభివృద్ధి సంస్థతో కలిసి ఏపీ ప్రభుత్వం సదస్సును హోటల్ నోవాటెల్‌లో నిర్వహించనుంది.

అభ్యుదయవాది ఎన్వీ రమణయ్య కన్నుమూత



రమణయ్య (ఫైల్)

కావలి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన అభ్యుదయవాది నందనవనం వెంకటరమణయ్య (ఎన్వీఆర్) (83) మంగళవారం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన విద్యార్థి దశలోనే బీడీ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసి జైలు జీవితం గడిపారు. సోషలిస్ట్ భావాలతో అనేక ప్రజా పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 'చేతన'మాస పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తూ సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలు, అసమానతలపై పోరాటం సాగించారు. కావలి విశ్వోదయ విద్యాసంస్థల్లో రాజనీతి శాస్త్రం లెక్చరర్‌గా కూడా పనిచేశారు. నవ వికాస్ సేవా సంస్థ స్థాపనలో వకుళాభరణం లలిత, హేమలతలకు సహకరించి ముందుకు నడిపించారు. దివిసీమలో ప్రకృతి విలయతాండవం చేసినప్పుడు విద్యార్థుల బృందాన్ని వెంట పెట్టుకొని వెళ్లి ఆర్తులకు సేవలు అందించారు. సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్ అనే సంస్థ వ్యవస్థాపక చైర్మన్‌గా ఉంటూ అనునిత్యం సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. జవహర్ భారతి విద్యా సంస్థలకు సుదీర్ఘకాలం కరస్పాండెంట్‌గా వ్యవహరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎన్వీ రమణయ్య మృతికి వివిధ సంఘాల ప్రతినిధులు, ఆయన సహచరులు, విద్య, సాహిత్య రంగాలకు చెందిన ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆయన అంత్యక్రియలు బుధవారం హైదరాబాద్‌లో జరుగుతాయి.

నేడు మహాజాతరకు అంకురార్పణ

గుడి మెలిగె పండుగతో..



సాక్షి ప్రతినిధి, వరంగల్: మేడారం మహాజాతరలో తొలిఘట్టమైన గుడిమెలిగె పండుగ బుధవారం జరగనుంది. మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ ఆలయాలతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేసి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ తంతుతో మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ప్రారంభం కానుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నాలుగు రోజులపాటు సమ్మక్క– సారలమ్మ మహాజాతర జరగనుంది. ఈ జాతరకు కోటి మందికిపైగా భక్తులు హాజరవుతారని అంచనా. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన ఈ జాతర గుడిమెలిగె పండుగతోనే ప్రారంభమవుతుంది. ఒకప్పుడు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మలకు గుళ్లుగా గుడిసెలు ఉండేవి. జాతరకు ముందు ఈ గుడిసెలకు మరమ్మతులు చేసేవారు. గుడిసెలకు కొత్తగా పైకప్పు అమర్చడం(కప్పడం) చేసేవారు. దీన్ని గుడి మెలగడం అంటారు. ఈ ప్రక్రియతోనే జాతర తొలిపూజ కార్యక్రమాలు మొదలయ్యేవి. ఇప్పుడు గుడిసెలు లేవు. వీటి స్థానంలో భవనాలు కట్టారు. గుడిసెలు లేకున్నా.. జాతరకు రెండు వారాల ముందు గుడిమెలిగెను నిర్వహిస్తున్నారు.

బెల్లంపై ఆంక్షల ఎత్తివేత

సాక్షి, వరంగల్ రూరల్: మేడారం మహాజాతర సందర్భంగా బెల్లం (బంగారం) అమ్మకాలు రాష్ట్రవ్యాప్తంగా బెల్లం అమ్మకాలపై ఉన్న ఆంక్షలను ఎక్సైజ్ శాఖ ఎత్తివేసింది. జాతరలో ఎత్తు బంగారం సమర్పించి భక్తులు వన దేవతలకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. గుడుంబా తయారీలో బెల్లం వినియోగిస్తున్నారనే ఉద్దేశంతో ఎక్సైజ్ శాఖ పలు ఆంక్షలు విధించింది. ఈ మేరకు చిన్న షాపులకు 20 కిలోలు, జీఎస్టీ ఉన్న షాపులకు రెండు క్వింటాళ్ల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. జాతర నేపథ్యంలో ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఎంత బెల్లం కావాలంటే అంతే భక్తులకు విక్రయించనున్నారు. బెల్లం కొనుగోలు చేసే భక్తుడు తన ఆధార్ నంబరు ఇస్తే సరిపోతుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి ఎక్సైజ్ శాఖకు బెల్లం వ్యాపారులు స్టేట్‌మెంట్‌ను అందించనున్నారు.


పెళ్లి వద్దు..చదువుకుంటా!

పోలీసులను ఆశ్రయించిన మైనర్

చిన్నశంకరంపేట (మెదక్): తాను ఇంకా చదువుకుంటానని, ఇప్పుడే పెళ్లి వద్దంటూ ఓ బాలిక పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కామారం తండాలో మంగళవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన హలావత్ బాబు, మరోనిల కూతురు సాంకీ ఇంటర్ చదువుతోంది. ఆమెను మేనబావకు ఇచ్చి పెళ్లి చేద్దామని తండ్రి బాబు తరచూ ఇంట్లో చర్చిస్తున్నాడు. తాను ఇప్పుడే పెళ్లి చేసుకోనని, ఇంకా చదువుకుంటానని బాలిక తండ్రికి చెబుతున్నప్పటికీ వినకపోగా, బెదిరించడం, కొట్టడం మొదలు పెట్టారు. దీంతో మైనర్‌ను అయినప్పటికీ పెళ్లి చేస్తానని తన తండ్రి వేధిస్తున్నాడని సాంకీ చిన్నశంకరంపేట ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్‌కు ఫిర్యాదు చేసింది. ఐసీడీఎస్ అధికారులు, తహసీల్దార్‌లతో కలసి ఆయన బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అమ్మాయి చదువుకు ఎలాంటి ఆటంకం కలిగించొద్దని, అవసరమైతే బాలసదనంలో ఉంచి చదివించనున్నట్లు ఎస్ఐ వివరించారు. సాంకీ కోరిక మేరకు ఆమె మేనమామ గంగారామ్‌కు అప్పగించారు.

'జనశక్తి' కూర రాజన్నకు అనారోగ్యం

గుండె.. కిడ్నీ జబ్బులతో ఐసీయూలో.. రాజన్న తల్లి మల్లమ్మకూ అస్వస్థత..



సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి కేంద్ర కమిటీ కార్యదర్శి కూర రాజన్న ఉరఫ్ కేఆర్(76) అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన రాజన్న.. ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమంలో కీలక బాధ్యతలను నిర్వహించారు. రాజన్న గుండె, కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నట్లు ఆయన సన్నిహితులు మంగళవారం వెల్లడించారు. ఆయన తల్లి కూర మల్లమ్మ(96) సైతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజన్న ఉస్మానియా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీర్(బీఈ)గా గోల్డ్‌మెడల్ సాధించారు. చదువు సాగిస్తూనే చంద్రపుల్లారెడ్డి విప్లవోద్యమంలో పోరాటాలు సాగించారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో అలుపెరగని ఉద్యమాన్ని నిర్మించిన రాజన్న జనశక్తి పార్టీ ఉద్యమ నిర్మాతగా ఉన్నారు. నాలుగు దశాబ్దాల పాటు నక్సలైట్ ఉద్యమాన్ని సాగించిన రాజన్న 2003లో ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ జిల్లాలో అరెస్ట్ అయ్యారు. ఆయన హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎన్నికలప్పుడే బీసీలు గుర్తుకొస్తారా?

సులభంగా మోసం చేయవచ్చనా?

చంద్రబాబుపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆగ్రహం



చిత్తూరు జిల్లా వడమాలపేటలో బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహానికి వైఎస్ జగన్ అభివాదం

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : ఎన్నికల సమయంలోనే బలహీన వర్గాలపై చంద్రబాబు ప్రేమ కురిపిస్తారని, ఎన్నికలు లేకుంటే వాళ్లసలు గుర్తుకే రారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. బీసీలను ఉద్ధరించడానికే పుట్టినట్టు ఆయన మాట్లాడుతుంటారని, నిజానికి వాళ్ల జీవితాల్లో వెలుగులు నింపే ఆలోచనే లేదని మండిపడ్డారు. సహకార వ్యవస్థను ధ్వంసం చేసిందే చంద్రబాబని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా ఉండి కూడా తాను పుట్టిన చిత్తూరు జిల్లాకు హంద్రీ–నీవా, గాలేరు–నగరి కాల్వలను తీసుకురాలేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే నగరి నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుతో పాటు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 63వ రోజు మంగళవారం నగరి నియోజకవర్గంలోని వడమాలపేటలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మనందరి ప్రభుత్వం రాగానే ప్రతి పేదవాడికి భరోసా కల్పిస్తానని, విద్యా, వైద్యం కోసం పేదవాడు అప్పుల పాలు కాకూడదన్నదే తన ధ్యేయమన్నారు. ఈ సభలో జగన్ ఇంకా ఏమన్నారంటే..

సహకార వ్యవస్థ ధ్వంసం

''నగరి నియోజకవర్గంలో అడుగు పెట్టినప్పటి నుంచి అనేక మంది తమ కన్నీటి గాథలను చెబుతూనే, అన్నా.. నీకు తోడుగా ఉంటాం అని నా భుజం తడుతున్నారు. పాదయాత్ర మొదలైనప్పటి నుంచి చాలా మంది రైతులు వచ్చి 'అన్నా.. ఇదే నియోజకవర్గంలో రేణిగుంట షుగర్ ఫ్యాక్టరీ ఉంది. అది సహకార రంగంలో ఉండేది. మా జిల్లాలో మొత్తం ఆరు చక్కెర ఫ్యాక్టరీలు ఉంటే అందులో రెండు సహకార రంగంలోనివి. మా ఖర్మ ఏంటంటే చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా కూడా సహకార ఫ్యాక్టరీలు మూత పడతాయన్నా'అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సహకార ఫ్యాక్టరీలు నడిస్తే రైతులకు మంచి రేట్లు వస్తాయి. చంద్రబాబు గతంలో తొమ్మిదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు రెండు సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. రైతులు అవస్థలు పడే పరిస్థితి వచ్చింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాగానే 51 కోట్ల రూపాయలు ఇచ్చి వాటిని తెరిపించారు. నాన్నగారి పుణ్యమా అంటూ పదేళ్ల పాటు రైతులు సంతోషంగా ఉన్నారు. మళ్లీ నాలుగేళ్ల కిందట చంద్రబాబు సీఎం కావడంతో ఆ రెండు చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. చంద్రబాబు దగ్గరుండి మరీ రైతులను నాశనం చేస్తున్నారు.

పాల డెయిరీలనూ నాశనం చేశారు..

సహకార రంగంలోని డెయిరీలు రైతులకు మంచి రేట్లు ఇస్తాయి. పాల ధరలు పెరిగి రైతులు సంతోషంగా ఉండటం చంద్రబాబుకు ఇష్టం ఉండదు. అందుకని తన మనుషులతో హెరిటేజ్ పాల డెయిరీ పెట్టించి దగ్గరుండి ఒక పథకం ప్రకారం విజయా డెయిరీగా ఖ్యాతి గాంచిన చిత్తూరు డెయిరీని మూత వేయించారు.

ఇస్త్రీ పెట్టెలు, కత్తెర్లు ఇవ్వడమే ప్రేమట!

చంద్రబాబు నోటి నుంచి మాటిమాటికి వచ్చే మాట బీసీలు. వాళ్ల మీద బోలెడు ప్రేమను వొలకబోస్తుంటాడు. చిత్రమేమిటంటే ఎన్నికల సమయంలోనే ఆయనకు బీసీలు గుర్తుకు వస్తుంటారు. ఎందుకో తెలుసా? వాళ్లనైతే సులువుగా మోసం చేయవచ్చని. (జనం నుంచి ఈలలు, కేకలు) అందుకే ఆయన తన సొంత నియోజకవర్గం చంద్రగిరి అయినా జిల్లాలోనే బీసీలు అధికంగా ఉన్న కుప్పం నుంచి పోటీ చేస్తారు. చంద్రగిరిలో మాత్రం పోటీ చేయడు. 4 ఇస్త్రీ పెట్టెలు, 4 కత్తెర్లు ఇచ్చి ఇదే బీసీలపై ప్రేమని చెబుతాడు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

జనం మధ్యలో జగన్ సంక్రాంతి సంబరాలు

హరిదాసులు, ముత్యాల ముగ్గులు, గంగిరెద్దులు, పూరిళ్లు, కొలువు దీరిన గొబ్బెమ్మలు, బంతిపూల హరివిల్లులు... సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం వైఎస్ జగన్ బస చేసిన శిబిరం వద్ద కనిపించిన దృశ్యాలివి. తెలుగింట పెద్ద పండుగ అయిన సంక్రాంతి సందర్భంగా ప్రజా సంకల్ప యాత్రకు విరామం ప్రకటించిన జగన్.. తాను బస చేసిన శిబిరం వద్ద ప్రజలు, బంధు మిత్రులు, ప్రజా ప్రతినిధులు, శ్రేయోభిలాషుల మధ్య వేడుకలు జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. పల్లె వాతావరణాన్ని తలపించేలా వేసిన రెండు పూరిళ్ల మధ్య ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నమస్కరించారు. సంప్రదాయబద్ధంగా పెద్దలకు బట్టలు పెట్టారు. పండుగ సందర్భంగా కోలాటాన్ని, భజనలను, పతంగుల ఎగురవేతను ప్రత్యక్షంగా తిలకించారు. హరిదాసులు శ్రావ్యంగా కీర్తనలు ఆలపించారు. మహిళలు సంప్రదాయ నృత్యాలు చేశారు. గంగిరెద్దుల వాళ్లు తమ ఆటలతో అలరించారు. జగన్ రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. జగన్‌కు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

నా భార్య పండక్కి ఊరెళదామని పట్టుబట్టింది

ఇప్పుడు పల్లెలకు వెళ్లటం ఫ్యాషన్‌గా మారింది: సీఎం



సాక్షి, తిరుపతి: 'పదిహేనేళ్ల కిందట నా భార్య ప్రతి సంక్రాంతికి ఊరెళదామని పట్టుబట్టింది. అందుకు ఆమెకు కృతజ్ఞతలు. ప్రస్తుతం హైదరాబాద్ వంటి నగరాలన్నీ ఖాళీ అయ్యాయి. ఇప్పుడు పల్లెలకు వెళ్లటం ఫ్యాషన్‌గా మారింది. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఉండే అలవాటు చేసుకోవాలి'అని సీఎం చంద్రబాబు సూచించారు. సంక్రాంతి సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి నారావారిపల్లె వచ్చిన ఆయన మంగళవారమిక్కడ పుదిపట్ల నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే స్వగ్రామంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రిని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సిమెంట్ రోడ్ల వల్ల మోకాళ్ల నొప్పులొచ్చే ప్రమాదం ఉందని.. అందుకే మట్టిరోడ్లు కూడా అవసరమన్నారు.

మీరు పండుగ చేసుకుంటే సరిపోతుందా..?

సీఎంపై సామాన్యుడు ఫైర్

చంద్రగిరి: 'మీరు పండుగ చేసుకుంటే సరిపోతుందా.. మరి మా సంగతేంటి?'అంటూ సీఎం చంద్రబాబుపై ఓ సామాన్యుడు ఫైర్ అయ్యాడు. మంగళవారం ఉదయం 9.45 నుంచి సుమారు 3 గంటల పాటు రంగంపేట నుంచి నారావారిపల్లి మీదుగా కొత్తపేటకు వెళ్లే వాహనాలను పోలీసులు నిలిపివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా, పులిచెర్ల మండలం కొత్తపేటకు చెందిన ఓ ప్రయాణికుడు నేరుగా సీఎం బస వద్దకు వెళ్లి ఆయనపైనే ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో సీఎం పక్కనే ఉన్న అర్బన్ ఎస్పీ అభిషేక్‌తో మాట్లాడి వెంటనే రంగంపేటలోని ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలని ఆదేశించారు. తన వల్ల ఇబ్బంది కలిగితే సారీ అంటూ సీఎం క్షమాపణ చెప్పారు.

పోలవరం.. కలవరం

ప్రాజెక్టు పనుల్లో అక్రమాలపై అందిన ఫిర్యాదు

సాక్షి, అమరావతి: పోలవరం పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ అందిన ఫిర్యాదుపై ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) వివరణకు ఆదేశించడం రాష్ట్ర ప్రభుత్వాన్ని కలవరానికి గురిచేస్తోంది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) సభ్య కార్యదర్శి డాక్టర్ ఆర్కే గుప్తా రంగంలోకి దిగారు. ఫిర్యాదులోని అంశాలపై వివరణ ఇవ్వాలని సూచిస్తూ ఈ నెల 9న రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ)కి లేఖ రాశారు. కేంద్రానికి వివరణ ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది.

పరిహారంలో పక్షపాతం : పోలవరం పనుల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయంటూ ఈ నెల 3న రాజమహేంద్రవరానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ జె.చౌదరయ్య పీఎంవోకు లేఖ రాశారు. 2005లో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలవరం కుడి కాలువ పనులకు అడ్డుపడుతూ కొందరు రైతులను కోర్టుల్లో కేసులు వేసేలా పురిగొల్పారని.. పట్టిసీమ ఎత్తిపోతలతో గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించాలనే నెపంతో 2015లో ఆ కేసులను ఉపసంహరించుకునేలా చేసి ఎకరానికి గరిష్టంగా రూ.52.90 లక్షలు పరిహారం ఇచ్చారని వివరించారు. కుడి కాలువలో భూసేకరణ చట్టం–2013 కంటే ఎక్కువ పరిహారం ఇచ్చారన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం భూసేకరణకు ఎకరానికి రూ.28 లక్షలు ఇస్తామని ప్రభుత్వం అవార్డు జారీ చేసిందని.. సర్కార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టుకు వెళ్లిన వారికి మాత్రం ఎకరానికి కేవలం రూ.17.91 లక్షల పరిహారం ఇచ్చి పక్షపాతం చూపిందని వెల్లడించారు. పోలవరం జలాశయంలో ముంపునకు గురయ్యే భూమికి ఎకరానికి రూ.10.50 లక్షలు ఇస్తున్నారని, ఒక్కో ప్రాంతంలో ఒక్కో తరహాలో పరిహారం ఇస్తూ భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి సోమవారం రాత్రి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. మకర రాశిలో సూర్యుడు ప్రవేశించిన రోజు, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం రోజు కావటంతో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. అంతకు ముందు అద్దాల మండపంలో దర్బార్ సేవ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు, రామమ్, స్థానాచార్యులు స్థలశాయి తదితరులు పాల్గొన్నారు. –భద్రాచలం



ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా జాతర ప్రారంభమైంది. పుష్య మాస అమావాస్య రోజైన మంగళవారం రాత్రి మెస్రం వంశీయులు మహాపూజను నిర్వహించారు. ఉదయం వారు బస చేసిన మర్రిచెట్టు(వడమర్ర) నుంచి వారు తెచ్చిన పవిత్ర జలం తో సంప్రదాయ వాయిద్యాలైన డోలు, తుడుం, కాళీకోమ్, పేప్రే వాయిద్యాలతో నాగోబా ఆలయా నికి చేరుకుని పూజలు ప్రారంభించారు. –ఇంద్రవెల్లి(ఖానాపూర్)

దక్షిణ కొరియాలో కేటీఆర్ బిజీబిజీ

- పలు రంగాల పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
- 'మొయిబా' సంస్థతో అవగాహనా ఒప్పందం
- టెక్స్‌టైల్ పరిశ్రమలను సందర్శించిన మంత్రి బృందం





మంగళవారం దక్షిణ కొరియాలో మొయిబా సంస్థతో కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను చూపుతున్న మంత్రి కేటీఆర్, ప్రభుత్వ సలహాదారు వివేక్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ ● టెక్స్‌టైల్స్ పారిశ్రామికవేత్తలతో కేటీఆర్ బృందం

సాక్షి, హైదరాబాద్: రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం దక్షిణ కొరియా వెళ్లిన పరిశ్రమలు, ఐటీల శాఖ మంత్రి కె.తారక రామారావు తొలి రోజున అక్కడి పలు వ్యాపార సంస్థల సీఈఓలు, ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణలో వ్యాపార, పెట్టుబడుల అవకాశాలను వివరించి.. ఆటో మొబైల్, టెక్స్ టైల్స్, ఫార్మా, ఐటీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు నామ్ గుహ్నో, హ్యుందాయ్ రోటెమ్, గ్లోబల్ రైల్వే విభాగం డైరెక్టర్ కేకే యూన్‌తో సమావేశమై తెలంగాణలో ఆటో మొబైల్ రంగానికి ఉన్న సానుకూలతలు, పెట్టు బడుల అవకాశాలను వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో పారిశ్రామిక అనుమతులు ఇస్తామని వివరించగా.. ఈ విధానం బాగుందని హ్యుందాయ్ ప్రతినిధులు ప్రశంసించారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా 33 దేశాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న అగ్రగామి గ్రీన్ ఎనర్జీ కంపెనీ ఓసీఐ సీఈఓ వుహైన్ లీతోనూ కేటీఆర్ సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వా నించారు.

'మొయిబా'తో సహకార ఒప్పందం

మొబైల్ ఇంటర్నెట్ బిజినెస్ అసోసియేషన్ (మొయిబా) సీఈవో చొయ్‌డాంగ్ జిన్‌తో మంత్రి కేటీఆర్ సమావేశమై.. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో జరగనున్న ప్రపంచ ఐటీ సదస్సుకు రావాలని ఆహ్వానించారు. 500కు పైగా కంపెనీల నుంచి సభ్యులు కలిగిన ఈ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం తరపున ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, వర్చువల్ రియాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ తదితర అంశాల్లో మొయిబా, రాష్ట్ర ప్రభుత్వం పరస్పర సహకారం కోసం ఈ ఒప్పందం కుదిరింది.

'టెక్స్‌టైల్'లో పెట్టుబడులు పెట్టండి

కొరియా టెక్స్‌టైల్స్ పరిశ్రమల సమాఖ్య చైర్మన్ కిహుక్ సుంగ్, ఇతర టెక్స్‌టైల్స్ కంపెనీల ప్రతినిధులతో కేటీఆర్ సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, టీఎస్ ఐపాస్ ప్రాముఖ్యతను వివరించారు. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు ఆ రంగంలో పెట్టుబడులకు ఆకర్షణీయ ప్రదేశమని.. పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. కాగా కిహుక్ చైర్మన్‌గా ఉన్న యంగ్వాన్ సంస్థ ఇప్పటికే కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో 300 మిలియన్ డాలర్ల (సుమారు రూ.2,000 కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం తెలిపింది. నార్త్ ఫేస్ బ్రాండ్ పేరుతో ఆ కంపెనీ వస్త్రాలను ఉత్పత్తి చేస్తుంది. మరో టెక్స్‌టైల్ సంస్థ 'హ్యోసంగ్' ఉపాధ్యక్షుడు జే జూంగ్ లీతోనూ కేటీఆర్ సమావేశమై టెక్స్‌టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అనంతరం కొరియా డయింగ్ అండ్ ఫినిషింగ్ టెక్ ఇన్‌స్టిట్యూట్ (డైటెక్)ను పరిశీలించి.. ఆ సంస్థ అధ్యక్షుడు యూన్ నామ్ సిక్‌తో సమావేశమయ్యారు. టెక్స్‌టైల్ పార్కులో వాటర్ ట్రీట్‌మెంట్, మానవ వనరుల నిర్వహణ వంటి అంశాల్లో సాంకేతిక సహకారం అందించాలని కోరారు. మరో ప్రముఖ టెక్స్‌టైల్ దిగ్గజం కోలాన్ గ్రూపు ప్రతినిధులతోనూ కేటీఆర్ సమావేశమయ్యారు.

కొరియా టెక్స్‌టైల్ సిటీ పరిశీలన


కొరియన్ టెక్స్‌టైల్స్, ఫ్యాషన్, హైటెక్నాలజీ పరిశ్రమలకు కేంద్రమైన దైగు నగరాన్ని మంత్రి కేటీఆర్ బృందం సందర్శించింది. ఆ నగర డిప్యూటీ మేయర్ కిమ్ యాన్ చాంగ్‌తో సమావేశమై అక్కడ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రగతిపై చర్చించారు. దైగు నగర ఇన్నోవేషన్, ఆర్థిక విభాగ బృందంతోనూ సమావేశమై గేమింగ్, గ్రాఫిక్స్ రంగం కోసం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇమేజ్ టవర్ ప్రాజెక్టులో భాగస్వాములవ్వాలని కోరింది. మంత్రి వెంట ప్రభుత్వ సలహాదారు జి.వివేక్, పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌లు ఉన్నారు.

సాక్షి
భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం 17-1-2018
13

ఇఫ్లులో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఎఫ్ఎల్‌యు:ఇఫ్లు).. 2018-19 సంవత్సరానికి గాను వివిధ డిగ్రీ, పీజీ, టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. సంబంధిత కోర్సులు, విభాగాలను బట్టి ఇంటర్/డిగ్రీ/పీజీ/ఎంఫిల్ ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుం రూ.500(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.250). పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.efluniversity.ac.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com



ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ 415 పోస్టులు

NDA/NA EXAM

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. త్రివిధ(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) దళాల్లోని 415 పోస్టుల భర్తీకి అర్హులైన అవివాహ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ 'నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ) ఎగ్జామినేషన్(1)-2018' ప్రకటన విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఎన్‌డీఏ 141వ కోర్సు, 103వ ఇండియన్ నేవల్ అకాడమీ కోర్సు(ఐఎన్ఏసీ) ద్వారా శిక్షణ ఇచ్చి నియామకం కల్పిస్తారు.

- **మొత్తం ఖాళీలు:** 415. ఇందులో నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ) ద్వారా 360(ఆర్మీ-208, నేవీ-60, ఎయిర్‌ఫోర్స్-92) పోస్టులు; నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ద్వారా 55 పోస్టులను భర్తీ చేస్తారు.
- **వేతనం:** శిక్షణలో స్టైపెండ్-రూ.56,100; ఉద్యోగంలో నియమితులయ్యాక ప్రారంభ హోదాలో-రూ.56,100-రూ.1,77,500.
- **వయసు:** అభ్యర్థులు 1999 జూలై 2-1 జూలై, 2002 మధ్య జన్మించి ఉండాలి.
- **అర్హతలు:** ఆర్మీ పోస్టులకు.. ఇంటర్మీడియెట్/తత్సమాన విద్య; ఎయిర్ ఫోర్స్, నేవీ పోస్టులకు.. ఫిజిక్స్,మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. తుది సంవత్సరం విద్యార్థులూ అర్హులే.
- **శారీరక ప్రమాణాలు(ఫిజికల్ స్టాండర్డ్స్):** ఎత్తు-ఆర్మీ, నేవీ పోస్టులకు కనీసం 157 సెం.మీ, ఎయిర్‌ఫోర్స్ పోస్టులకు కనీసం 162.5 సెం.మీ; అలాగే అన్ని పోస్టుల అభ్యర్థులకూ ఛాతీ తగినంత ఉండి, గాలి పీల్చినపుడు కనీసం 5 సెం.మీ వ్యాకోచించగలగాలి. దీంతోపాటు ఎత్తు, వయస్సుకు అనుగుణంగా బరువు ఉండాలి. అలాగే తగిన శారీరక, మానసిక ఆరోగ్యం, వినికిడి, దృష్టి సామర్థ్యం తప్పనిసరి. పచ్చ బొట్లు(టాటూ)లను అనుమతించరు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎస్ఎస్‌బీ టెస్ట్ ఉంటుంది. ఇందులో సైకలాజికల్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటెలిజెన్స్ టెస్ట్ ఉంటాయి.
- **రాతపరీక్ష విధానం:** దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో రెండు భాగాలు ఉంటాయి. మొదటి భాగంలో మ్యాథమెటిక్స్ నుంచి 300 మార్కులకు ప్రశ్నలిస్తారు. వ్యవధి రెండున్నర గంటలు. రెండో భాగంలో జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటుంది. వ్యవధి రెండున్నర గంటలు. రెండు భాగాలూ కలిపి గరిష్ఠ మార్కులు 900. రుణాత్మక మార్కులు ఉన్నాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారి మెరిట్ జాబితా నుంచి ఎస్ఎస్‌బీ టెస్ట్స్ అండ్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.
- **ఎస్ఎస్‌బీ టెస్ట్స్ అండ్ ఇంటర్వ్యూ:** ఇది రెండు దశల్లో ఉంటుంది. స్టేజ్-1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్(ఓఐఆర్) టెస్ట్స్, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్(పీపీ అండ్ డీటీ) ఉంటాయి. స్టేజ్-2లో ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్క్స్, సైకాలజీ టెస్ట్స్, కాన్ఫరెన్స్ ఉంటాయి.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.100. ఎస్సీ, ఎస్టీ, త్రివిధ దళాల్లో పనిచేస్తున్న/మాజీ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్స్/నాన్ కమిషన్డ్ ఆఫీసర్స్/అదర్ ర్యాంక్ ఆఫీసర్స్ కేటగిరీల అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 5, 2018.
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in , www.upsc.gov.in

ఎయిర్ ఫోర్స్ కమిషన్డ్ ఆఫీసర్లు

AFCAT
Air Force Common Admission Test

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లోని ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్, నాన్ టెక్నికల్) బ్రాంచుల్లో కమిషన్డ్ ఆఫీసర్ కొలువుల భర్తీకి 'ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ ఆన్‌లైన్ టెస్ట్ (ఏఎఫ్‌సీఏటీ)-01/2018' నోటిఫికేషన్ వెలువడింది. 'ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ', 'మెటియొరాలజీ ఎంట్రీ' ద్వారా భర్తీ చేయడానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ద్వారా ఫ్లయింగ్ విభాగంలోని పోస్టులు, మెటియొరాలజీ బ్రాంచ్ ద్వారా గ్రౌండ్ డ్యూటీ(నాన్-టెక్నికల్) విభాగంలోని పోస్టులను భర్తీ చేస్తారు. ఏఎఫ్‌సీఏటీ ద్వారా అన్ని విభాగాల పోస్టులనూ భర్తీ చేస్తారు.

- **అర్హతలు:** ఏఎఫ్‌సీఏటీ ఫ్లయింగ్ విభాగం పోస్టులకు.. మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులుగా, ఈ సబ్జెక్టుల్లో ఒక్కదాంట్లో కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు కనీసం 60శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత; గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్ బ్రాంచ్) పోస్టులకు.. మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులుగా, ఈ సబ్జెక్టుల్లో ఒక్కదాంట్లో కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఇంజనీరింగ్/టెక్నాలజీలో నాలుగేళ్ల గ్రాడ్యుయేషన్/ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్; గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్ బ్రాంచ్) పోస్టులకు.. ఏదైనా డిగ్రీ/ఎంబీఏ/ఎంసీఏ/ఎంఏ/ఎంఎస్సీ/తత్సమాన విద్యార్హత. ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ(ఫ్లయింగ్ బ్రాంచ్) పోస్టులకు.. మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులుగా, ఈ సబ్జెక్టుల్లో ఒక్కదాంట్లో కనీసం 60శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు కనీసం 60శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ/తత్సమాన విద్యలో ఉత్తీర్ణతతోపాటు ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ సీనియర్ డివిజన్ 'సి' సర్టిఫికెట్(డిసెంబర్ 2015 తర్వాత పొంది ఉండాలి); మెటియొరాలజీ బ్రాంచ్ పోస్టులకు.. మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులుగా, ఈ సబ్జెక్టుల్లో ఒక్కదాంట్లో కనీసం 55శాతం మార్కులతో డిగ్రీతోపాటు ఏదైనా సైన్స్ విభాగం/మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్/జాగ్రఫీ/కంప్యూటర్ అప్లికేషన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/అప్లైడ్ ఫిజిక్స్/ఓషియనోగ్రఫీ/మెటియొరాలజీ/అగ్రికల్చరల్ మెటియొరాలజీ/ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్/జియో ఫిజిక్స్/ఎన్విరాన్‌మెంటల్ బయాలజీలో కనీసం 50శాతం మార్కులతో పీజీ.
- **శారీరక ప్రమాణాలు:** ఫ్లయింగ్ బ్రాంచ్ పోస్టులకు.. ఎత్తు- కనీసం 162.5 సెం.మీ., లెగ్ లెన్త్- 99(కనిష్ఠం)-120(గరిష్ఠం), థై లెన్త్-64(గరిష్ఠం), సిట్టింగ్ హైట్-81.5(కనిష్ఠం)-96(గరిష్ఠం). ఈ ప్రమాణాల్లో సడలింపులు ఉండవు. గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్/నాన్ టెక్నికల్) పోస్టులకు.. ఎత్తు- పురుషులకు కనీసం 157.5 సెం.మీ, మహిళలకు 152 సెం.మీ ఉండాలి. అలాగే ఎత్తు, వయస్సుకు అనుగుణంగా బరువు ఉండాలి. వీటితోపాటు అన్ని విభాగాల పోస్టులకూ తగిన వినికిడి, దృష్టి సామర్థ్యం, శారీరక, మానసిక ఆరోగ్యం తప్పనిసరి.
- **ఎంపిక:** ఏఎఫ్‌సీఏటీ , ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్(ఈకేటీ), ఏఎఫ్ఎస్‌బీ ఇంటర్వ్యూ. ఇందులో ఈకేటీ కేవలం గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్ బ్రాంచ్)కు మాత్రమే ఉంటుంది.
- **పరీక్ష విధానం:** దీన్ని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో ఏఎఫ్‌సీఏటీ 300 మార్కులకు ఉంటుంది. జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ ఇన్ ఇంగ్లిష్, న్యూమెరికల్ ఎబిలిటీ, రీజనింగ్, మిలటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి 2గంటలు. ఈకేటీలో మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ నుంచి 50 ప్రశ్నలు 150 మార్కులకు ఇస్తారు. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు.
- **ఫిజికల్ ఫిట్నెస్(శారీరక దృఢత్వం):** ఇందులో 1 మైల్(1.6) కి.మీ దూరాన్ని 10 నిమిషాల్లో పరిగెత్తగలగాలి. అలాగే 10 పుష్‌అప్స్, 3 చిన్ అప్స్ తీయగలగాలి.
- **ఏఎఫ్ఎస్‌బీ ఇంటర్వ్యూ:** ఇందులో స్టేజ్-1 కింద ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్, డిస్కషన్ టెస్ట్ ఉంటాయి. స్టేజ్-1 కేవలం స్క్రీనింగ్ టెస్ట్ మాత్రమే. ఇందులో క్వాలిఫై అయిన అభ్యర్థుల డాక్యుమెంటేషన్ టెస్ట్ నిర్వహించి స్టేజ్-2కు ఎంపిక చేస్తారు. స్టేజ్-2లో సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టెస్ట్స్, ఇంటర్వ్యూ ఉంటాయి. ఫ్లయింగ్ పోస్టులకు అదనంగా కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్(సీపీఎస్ఎస్) టెస్ట్ ఉంటుంది.
- **పరీక్ష రుసుం:** ఏఎఫ్‌సీఏటీ ఎంట్రీకి రూ.250; ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ, మెటియొరాలజీ ఎంట్రీలకు ఎగ్జామినేషన్ ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 23, 2018.
- **వెబ్‌సైట్:** afcat.cdac.in , careerindianairforce.cdac.in

ఎస్‌బీఐ 121 ఖాళీలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో 121 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదలైంది.

- **పోస్టు-ఖాళీలు:** మేనేజర్-76; చీఫ్ మేనేజర్-45. ఇందులో మేనేజర్ పోస్టులు మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-3, చీఫ్ మేనేజర్ పోస్టులు సీనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-4కు చెందినవి.
- **వేతనశ్రేణి:** మేనేజర్-రూ.42,020-రూ.51,490; చీఫ్ మేనేజర్-రూ.50,030-రూ.59,170.
- **విభాగాల వారీ ఖాళీలు:** మేనేజర్ పోస్టుల్లో.. క్రెడిట్ అనలిస్ట్-35, ఎస్సెట్ మేనేజ్‌మెంట్-2, బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ మార్కెటింగ్-20, హై వాల్యూ అగ్రి బిజినెస్ డెవలప్‌మెంట్-4, మర్చంట్ అక్వైరింగ్ బిజినెస్-2, హెచ్ఎన్ఐ మార్కెటింగ్ అండ్ పబ్లిసిటీ-1, హెచ్ఎన్ఐ బ్యాంకింగ్ అండ్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్-8, డిజిటల్ మార్కెటింగ్-2, మార్కెటింగ్-1, వెల్త్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ మేనేజర్ టెక్నాలజీ-1; చీఫ్ మేనేజర్ పోస్టుల్లో.. క్రెడిట్ అనలిస్ట్-30, ఎస్సెట్ మేనేజ్‌మెంట్-1, బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ అండ్ ఎంఐఎస్ రిపోర్టింగ్-5, రిలేషన్‌షిప్ అండ్ సిండికేషన్స్ మేనేజ్‌మెంట్-1, హై వాల్యూ అగ్రి బిజినెస్ డెవలప్‌మెంట్-1, డెబిట్ కార్డ్స్ బిజినెస్-1, డిజిటల్ బ్యాంకింగ్-1, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ లోన్-1, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ సీఐటీయూ-1, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ ఆపరేషన్-1, ప్రొడక్ట్ ఇన్నోవేషన్ అండ్ మార్కెట్ రీసెర్చ్-1, డేటా ఇంటర్‌ప్రిటేషన్/మేనేజ్‌మెంట్-1.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఏసీఎస్/ఎంబీఏ/పీజీడీఎం/బీఈ/బీటెక్/తత్సమాన విద్యలో ఉత్తీర్ణతతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **వయస్సు:** 2017, జూన్ 30 నాటికి మేనేజర్ పోస్టుకు 25-35 ఏళ్ల లోపు; చీఫ్ మేనేజర్ పోస్టులకు 25-38 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ ఓబీసీ-రూ.600(అప్లికేషన్ ఫీ+ఇంటిమేషన్ చార్జెస్); ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.100(ఇంటిమేషన్ చార్జెస్ మాత్రమే).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్ కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, తదితర అవసరమైన వాటిని జతచేసి 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్, థర్డ్ ఫ్లోర్, అట్లాంటా బిల్డింగ్, నారీమన్ పాయింట్, ముంబై-400021' చిరునామాకు గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 4, 2018.
- **హార్డ్ కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 12, 2018.
- **వెబ్‌సైట్:** www.sbi.co.in , bank.sbi

ఐవోసీఎల్ రిఫైనరీస్ డివిజన్ 101 ఖాళీలు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) రిఫైనరీస్ డివిజన్.. వివిధ రిఫైనరీల్లోని 101 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** అప్రెంటీస్.
- **విభాగాల వారీ ఖాళీలు:** సెక్రటేరియల్ అసిస్టెంట్(ఎస్ఏ)-75, అకౌంటెంట్(ఏసీటీ)-26.
- **రిఫైనరీ డివిజన్ల వారీ ఖాళీలు:** గువాహటి-12(ఎస్ఏ-10+ ఏసీటీ-2); బరౌనీ-8(ఎస్ఏ-5+ ఏసీటీ-3) , గుజరాత్-14(ఎస్ఏ- 11+ ఏసీటీ- 3), హల్దియా-12(ఎస్ఏ-9+ఏసీటీ-3), మధుర-13(ఎస్ఏ-10+ఏసీటీ-3), పానిపట్-11(ఎస్ఏ-7+ ఏసీటీ-4), దిగ్బాయ్-12(ఎస్ఏ-10+ఏసీటీ-2), బొంగైగావ్-12(ఎస్ఏ-10+ ఏసీటీ-2), పారదీప్-7(ఎస్ఏ-3+ ఏసీటీ-4). ❖ **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి బీఏ/బీఎస్సీ/బీకామ్ ఉత్తీర్ణత. ❖ **వయస్సు:** 2018, జనవరి 1 నాటికి 18-24 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, దరఖాస్తు హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి రిఫైనరీ డివిజన్ చిరునామాకు గడువులోగా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 3, 2018.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ:** ఫిబ్రవరి 17, 2018.
- **వెబ్‌సైట్:** www.iocl.com

ఈసీఐఎల్ 84 ఖాళీలు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. 84 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ(జీఈటీ).
- **శిక్షణ వ్యవధి:** ఏడాది.
- **స్టైపెండ్/వేతనం:** శిక్షణలో స్టైపెండ్ నెలకు రూ.38,430; ఉద్యోగంలో నియమితులయ్యాక రూ.47,780.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఈసీఈ-50; సీఎస్ఈ-20, మెకానికల్-14.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి కనీసం 65 శాతం(ఎస్సీ/ఎస్టీలకు 55శాతం) మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ(బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్(నాలుగేళ్ల)) ఉత్తీర్ణత. దీంతోపాటు గేట్ 2018 స్కోర్.
- **వయస్సు:** 2017, డిసెంబర్ 31 నాటికి 25 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** గేట్-2018 స్కోర్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.500; రిజర్వేషన్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 15, 2018.
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

వైజాగ్ స్టీల్స్ 72 ఖాళీలు

విశాఖపట్నంలోని వైజాగ్ స్టీల్స్‌లో 72 మేనేజ్‌మెంట్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(ఆర్ఐఎన్ఎల్) ప్రకటన విడుదల చేసింది.

- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(టెక్నికల్).
- **వేతనం:** రూ.20,600-రూ.46,500.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-19; మెకానికల్-38; మెటలర్జీ-15.
- **అర్హతలు:** ఎలక్ట్రికల్/ మెకానికల్/ మెటలర్జీ/తత్సంబంధ విభాగాల్లో కనీసం 60శాతం(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీలకు 50శాతం) మార్కులతో బ్యాచిలర్ ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ. అలాగే గేట్-2018 స్కోర్.
- **వయస్సు:** 2017, నవంబర్ 1 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **శారీరక ప్రమాణాలు:** ఎత్తు-పురుషులకు కనీసం 150 సెం.మీ; మహిళలకు కనీసం 143 సెం.మీ; బరువు-పురుషులకు కనీసం 45 కిలోలు, మహిళలకు కనీసం 35 కిలోలు. అలాగే నిబంధనల మేర తగినంత శారీరక, మానసిక ఆరోగ్యం, వినికిడి, దృష్టి సామర్థ్యం తదితరం ఉండాలి.
- **ఎంపిక:** గేట్-2018 స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.500+ జీఎస్‌టీ 18శాతం; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-రూ.100+ జీఎస్‌టీ 18శాతం.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 14, 2018.
- **వెబ్‌సైట్:** www.vizagsteel.com

పీజీసీఐఎల్ 48 ఖాళీలు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్)కు చెందిన వెస్ట్రన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-2లో 48 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

- **పోస్టు:** డిప్లొమా ట్రైనీ(ఎలక్ట్రికల్/సివిల్), జూనియర్ ఆఫీసర్ ట్రైనీ(హెచ్ఆర్).
- **వేతనం:** ఏడాది శిక్షణలో స్టైపెండ్ నెలకు రూ.16,500; ఉద్యోగంలో చేరాక వేతనశ్రేణి రూ.16,000-35,000.
- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్-40; సివిల్-5; హెచ్ఆర్-3.
- **అర్హతలు:** డిప్లొమా ట్రైనీకి సంబంధిత కనీసం 70శాతం మార్కులతో (ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీకి పాస్ మార్కులు) ఇంజనీరింగ్ డిప్లొమా (ఎలక్ట్రికల్/సివిల్); జూనియర్ ఆఫీసర్ ట్రైనీకి కనీసం 55శాతం మార్కులతో హ్యూమన్ రిసోర్స్/ పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఇండస్ట్రియల్ రిలేషన్/ఎంఎస్‌డబ్ల్యూలో ఎంబీఏ/పీజీ/పీజీ డిప్లొమా/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2018, జనవరి 25 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** డిప్లొమా ట్రైనీకి రాతపరీక్ష/సీబీటీ; జూనియర్ ఆఫీసర్ ట్రైనీకి రాతపరీక్ష/సీబీటీ, కంప్యూటర్ స్కిల్ టెస్ట్.
- **రాతపరీక్ష/సీబీటీ విధానం:** దీన్ని ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-1 కింద టెక్నికల్ నాలెడ్జ్(అభ్యర్థి విభాగాన్ని అనుసరించి) టెస్ట్ ఉంటుంది. ఇందులో 120 ప్రశ్నలు ఉంటాయి. పార్ట్-2లో 50 ప్రశ్నలు వొకాబ్యులరీ, వెర్బల్ కాంప్రహెన్షన్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, డేటా సఫిషియెన్సీ అండ్ ఇంటర్‌ప్రిటేషన్, న్యూమెరికల్ ఎబిలిటీ నుంచి ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 ప్రశ్న కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4 వ వంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి 2గంటలు.
- **దరఖాస్తు రుసుం:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ/డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **చివరి తేదీ:** జనవరి 25, 2018.
- **వెబ్‌సైట్:** www.powergridindia.com

ఎన్ఎండీసీ 44 ఖాళీలు

హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లో ఉన్న నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎండీసీ).. 44 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రైనీ(ఎంఏటీ)
- **విభాగం:** మెకానికల్ ❖ **మొత్తం ఖాళీలు:** 44(ఎస్సీ-5+ ఎస్టీ-14+ ఓబీసీ-3+ అన్‌రిజర్వ్‌డ్-22). ❖ **స్టైపెండ్/వేతనం:** శిక్షణలో రూ.11,000(మొదటి 12 నెలలు), రూ.11,500(తర్వాతి 6 నెలలకు). నియామకం పొందాక రూ.11,300-రూ.20,000.
- **అర్హతలు:** ఐటీఐ(వెల్డింగ్/ మెషినిస్ట్/ మోటార్ మెకానిక్/ డీజిల్ మెకానిక్/ ఆటో ఎలక్ట్రీషియన్).
- **వయస్సు:** 2014, జూన్ 1 నాటికి 18-30 ఏళ్ల లోపు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్. ❖ **పరీక్ష విధానం:** దీన్ని 100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో సబ్జెక్టు నాలెడ్జ్(అభ్యర్థి ట్రేడ్) నుంచి 30, జనరల్ నాలెడ్జ్ నుంచి 50, న్యూమరికల్ అండ్ రీజినింగ్ ఎబిలిటీ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- **ట్రేడ్ టెస్ట్:** రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన వారికి ట్రేడ్ టెస్ట్ నిర్వహిస్తారు. దీన్ని అర్హత పరీక్షగా పరిగణిస్తారు. ఇది 100 మార్కులకు ఉంటుంది. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.150; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మాజీ సైనికోద్యోగ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 12, 2018.
- **వెబ్‌సైట్:** www.nmdc.co.in

యూపీఎస్సీ 23 ఖాళీలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. వివిధ విభాగాల్లోని 23 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు-ఖాళీలు:** స్పెషలిస్ట్ గ్రేడ్(3) అసిస్టెంట్ ప్రొఫెసర్(పీడియాట్రిక్ సర్జరీ)-2; కెమిస్ట్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)-3; డిప్యూటీ డైరెక్టర్(ఎగ్జామినేషన్ రిఫార్మ్స్)-1; సైంటిస్ట్ 'బి'(హైడ్రోమెటియొరాలజిస్ట్)-6; మెడికల్ ఆఫీసర్-11.
- **వేతనశ్రేణి:** అసిస్టెంట్ ప్రొఫెసర్, డిప్యూటీ డైరెక్టర్, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు -15,600-రూ.39,100; కెమిస్ట్, సైంటిస్ట్ 'బి' పోస్టులకు-రూ.56,100-రూ.1,77,500.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/మాస్టర్స్ డిగ్రీ/పీజీడిప్లొమా/తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం తదితరం ఉండాలి.
- **వయస్సు:** అసిస్టెంట్ ప్రొఫెసర్, డిప్యూటీ డైరెక్టర్‌కు -40 ఏళ్లు; కెమిస్ట్, సైంటిస్ట్ 'బి', మెడికల్ ఆఫీసర్‌కు-35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** రూ.25; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్; చివరి తేదీ: ఫిబ్రవరి 1, 2018.
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in , www.upsconline.nic.in

సాక్షి బిజినెస్
బుధవారం 17-1-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
72 ▼	41 ▼
34,771	10,700

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,286	▲	25
డోజోన్స్	25,968	▲	165
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,756	▼	13
డాక్స్	13,246	▲	46
షాంఘై	3,437	▲	27
నికాయ్	23,952	▲	237

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.35	64.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	89.12	89.30
€	యూరో	ఎస్‌బీఐ	79.31	79.47
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.26	58.38
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.48	51.58
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.84	48.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.39	18.25
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.75	18.42
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.00	11.36

55 పైసలు క్షీణించిన రూపాయి



ముంబై: డాలర్‌తో రూపాయి మరోసారి చిన్నబోయింది. మంగళవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 55 పైసలు క్షీణించి 64.04కు చేరింది. ఇది రెండు వారాల కనిష్ట స్థాయి. దేశ వాణిజ్యలోటు (ఎగుమతులు, దిగుమతుల విలువలో వ్యత్యాసం) మూడేళ్ళ గరిష్ట స్థాయికి చేరడంతో రూపాయి అమ్మకాలు వెల్లువెత్తాయి. ఎనిమిది నెలల కాలంలో ఒక రోజు రూపాయి విలువ ఈ స్థాయిలో పడిపోవడం కూడా ఇదే. డిసెంబర్ నెలలో ఎగుమతులు 12.36 శాతం పెరిగి 27.03 బిలియన్ డాలర్లకు చేరగా, అదే సమయంలో దిగుమతులు గణనీయంగా పెరిగి 41.91 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫలితంగా వాణిజ్య లోటు 14.88 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇది అంతకుముందు ఏడాది ఇదే నెలలో ఉన్న గణాంకాలతో పోలిస్తే 41 శాతం అధికం. ఈ ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌పై పడింది. ఉదయం ప్రారంభం నుంచే రూపాయి ప్రతికూలంగా ట్రేడ్ అయింది. అదే సమయంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యానికి కట్టుబడి ఉండడం కష్టమన్న అంచనాలు, పెరుగుతున్న ముడి చమురు ధరలతో సమీప కాలంలో ఆర్‌బీఐ రేట్ల కోతకు అవకాశాల్లేవన్న అంచనాలు అనిశ్చితిని పెంచేశాయి.

మార్కెట్లోకి లెక్సస్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ కారు



లెక్సస్ ఎల్ దేశీయ విపణిలోకి ఎంట్రీ ఇచ్చింది. ఎల్ఎస్500హెచ్ పేరిట రంగంలోకి దిగిన ఈ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ సెడాన్ లగ్జరీ కారును న్యూఢిల్లీలో విడుదల చేశారు. ధరలు (ఎక్స్‌షోరూం ఢిల్లీ) లగ్జరీ గ్రాండే రూ.1,77,21,000, అల్ట్రా లగ్జరీ గ్రాండే రూ.1,82,21,000, డిస్టింక్ట్ గ్రాండే రూ.1,93,71,000 అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

టీసీఎస్‌కు మరో భారీ కాంట్రాక్ట్

- ఎమ్ అండ్ జీ ప్రుడెన్షియల్ నుంచి
- డీల్ విలువ రూ.4,400 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) మరో భారీ డీల్‌ను చేజిక్కించుకుంది. యూకే, యూరోప్‌ల్లో సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్స్ వ్యాపారాన్ని నిర్వహించే ప్రుడెన్షియల్ పీఎల్‌సీకి చెందిన ఎమ్ అండ్ జీ ప్రుడెన్షియల్ నుంచి డీల్‌ను సాధించామని టీసీఎస్ తెలిపింది. ఈ డీల్ విలువ 69 కోట్ల డాలర్లని (50 కోట్ల పౌండ్లు--సుమారుగా రూ.4,400 కోట్లు) వివరించింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎమ్ అండ్ జీ ప్రుడెన్షియల్ వ్యాపారాన్ని డిజిటలైజ్ చేస్తామని, ఆ కంపెనీకి ఐటీ సేవలను పదేళ్లపాటు అందిస్తామని పేర్కొంది. గత పదేళ్లుగా తమ సంస్థకు చెందిన 40 లక్షల మంది క్లయింట్ల జీవిత, పెన్షన్ కాంట్రాక్ట్‌లను నిర్వహిస్తున్న క్యాపిటా సంస్థను తొలగించి ఈ కాంట్రాక్ట్‌ను టీసీఎస్ డిలిజెంటాకు అప్పగించామని ఎమ్ అండ్ జీ ప్రుడెన్షియల్ తెలిపింది.

ఇటీవల కాలంలో టీసీఎస్ భారీ డీల్స్‌ను సాధిస్తోంది. అమెరికా బీమా సంస్థ, ట్రాన్సమెరికా నుంచి 200 కోట్ల డాలర్ల కాంట్రాక్ట్‌తో పాటు టెలివిజన్ రేటింగ్‌ల సంస్థ నీల్సన్, బ్రిటిష్ రిటైలర్ మార్క్స్ అండ్ స్పెన్సర్‌ల నుంచి కూడా భారీ డీల్స్‌ను సాధించింది. తాజా డీల్ నేపథ్యంలో బీఎస్‌ఈలో టీసీఎస్ షేర్ 4 శాతం లాభపడి రూ.2,855 వద్ద ముగిసింది.

పతంజలి.. మరింత 'క్లిక్'!!

మరింత విస్తృతంగా ఆన్‌లైన్ మార్కెట్లోకి

- ఎనిమిది ఈ-కామర్స్ దిగ్గజాలతో ఒప్పందం
- 2018 ఆన్‌లైన్ టర్నోవర్ లక్ష్యం రూ.1,000 కోట్లు
- నీళ్ల బాటిళ్లతో పాటు దుస్తులు, పాదరక్షలూ విక్రయం

న్యూఢిల్లీ: యోగా గురు బాబా రామ్‌దేవ్ సారథ్యంలోని పతంజలి ఆయుర్వేద్ సంస్థ.. ఆన్‌లైన్ అమ్మకాలను మరింత పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, గ్రోఫర్స్, షాప్‌క్లూస్, బిగ్‌బాస్కెట్, 1ఎంజీ, పేటీఎం మాల్, నెట్‌మెడ్స్ వంటి 8 ఈ-కామర్స్ దిగ్గజాలతో జట్టు కట్టింది. ఈ పోర్టల్స్‌లో తమ ఉత్పత్తుల శ్రేణి మొత్తం అందుబాటులో ఉంటుందని బాబా రామ్‌దేవ్ మంగళవారం చెప్పారు. ఆన్‌లైన్ అమ్మకాల ద్వారా తొలి ఏడాదే రూ.1,000 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలియజేశారు. అలాగే 'దివ్య జల్' పేరిట బాటిల్డ్ వాటర్, 'పరిధాన్' బ్రాండ్ కింద దుస్తులు, పాదరక్షలు ఈ ఏడాది ప్రవేశపెట్టనున్నట్లు రాందేవ్ తెలిపారు. 'సంప్రదాయ రిటైల్ మార్కెట్ పరిధిని మరింతగా విస్తరించేందుకు ఆన్‌లైన్ ఉపయోగపడుతుంది. ఈ ఏడాది రూ.1,000 కోట్ల అమ్మకాల లక్ష్యం పెట్టుకున్నాం. సాధ్యపడితే అంతకు మించి కూడా చేయాలనుకుంటున్నాం' అని తెలియజేశారు. 2016-17లో పతంజలి ఆయుర్వేద్ టర్నోవరు రూ. 10,500 కోట్లు కాగా ఈ ఆర్థిక సంవత్సరం రెండు రెట్ల వృద్ధిని లక్ష్యించుకుంది.

సొంత పోర్టల్‌తో డిసెంబర్‌లో రూ.10 కోట్లు ..

ప్రయోగాత్మకంగా తమ సొంత పోర్టల్ 'పతంజలిఆయుర్వేద్.నెట్' ద్వారా స్వదేశీ ఉత్పత్తుల శ్రేణిని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నామని, డిసెంబర్ నెలలో ఏకంగా రూ.10 కోట్ల విక్రయాలు జరిగాయని, మిగతా ఏ ఎఫ్ఎంసీజీ బ్రాండ్ కూడా ఒక నెలలో ఈ స్థాయి అమ్మకాలు సాధించలేదని రామ్‌దేవ్ తెలియజేశారు. రిటైల్ స్టోర్స్ సంఖ్యను కూడా పెంచుకోనున్నట్లు చెప్పారాయన. గ్రామాల్లోని కొనుగోలుదారులను ఆకర్షించేందుకు అందుబాటు ధరల్లో మరిన్ని ఉత్పత్తులను చిన్న ప్యాక్‌లలో అందించే ప్రణాళికలు కూడా ఉన్నట్లు తెలియజేశారు. 'ప్రస్తుతం 5,000 పైచిలుకు ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్ ఉండగా.. వీటిని ఇంకా పెంచుతాం. జనవరి 26న స్వదేశ్ సమృద్ధి పేరిట కొత్తగా లాయల్టీ కార్డును ప్రవేశపెడుతున్నాం' అని వెల్లడించారు. బీమా ప్రయోజనం కూడా (మరణం, అంగవైకల్యం) కల్పించే ఈ లాయల్టీ కార్డు ద్వారా అయిదు కోట్ల మందికి చేరువ కావాలని నిర్దేశించుకున్నట్లు రామ్‌దేవ్ చెప్పారు. ప్రస్తుతం తమ ఉత్పత్తులు 15-20 లక్షల కిరాణా దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయంటూ ఈ ఏడాది వీటిని 50 లక్షలకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు చెప్పారు.



ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందం సందర్భంగా బాబా రామ్‌దేవ్, పతంజలి సీఈఓ బాలకృష్ణ, పేటీఎం అధిపతి విజయ్ శేఖర్ శర్మ

20వేల మంది నియామకం..

కార్యకలాపాల విస్తరణ ప్రణాళికల నేపథ్యంలో 20,000 మందికి పైగా ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నామని .. సేల్స్ మేనేజర్, జోనల్ మేనేజర్, రీజనల్ మేనేజర్ స్థాయి దాకా వివిధ హోదాల్లో ఈ పోస్టులుంటాయని రామ్‌దేవ్ తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా మరింతగా పెంచుకుంటున్నట్లు చెప్పారు. 'వార్షికంగా రూ. 50,000 కోట్ల విలువ చేసే ఉత్పత్తుల తయారీ సామర్థ్యం మాకు ఉంది. ఎఫ్ఎంసీజీలో ఇదే అత్యధికం. హరిద్వార్, తేజ్‌పూర్, అసోమ్‌లలో ప్లాంట్లున్నాయి. అటు నోయిడా, నాగ్‌పూర్, ఇండోర్‌లలో కూడా ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరుగుతోంది' అని వివరించారు. ప్రిస్క్రిప్షన్ అవసరమయ్యే పతంజలి ఔషధాలు మాత్రమే నెట్‌మెడ్స్, 1ఎంజీ పోర్టల్స్‌లో లభ్యమవుతాయి. పతంజలి ఉత్పత్తులు ఆన్‌లైన్లో విక్రయిస్తున్నప్పటికీ.. ప్రత్యేక డిస్కౌంట్లేమీ ఉండవు. రిటైల్ అవుట్‌లెట్స్‌కి ధరల పరమైన ఇబ్బందులు ఎదురుకాకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.

వచ్చే ఏడాది నుంచి ఎగుమతులు..

నాగ్‌పూర్‌లోని మిహా దగ్గర నిర్మిస్తున్న ఎగుమతి ఆధారిత ప్లాంటు అందుబాటులోకి వచ్చాక.. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఎగుమతులు కూడా ప్రారంభించనున్నట్లు రామ్‌దేవ్ తెలిపారు. యూఏఈ, అమెరికా, కెనడా, యూరప్, దక్షిణ అమెరికా, ఆఫ్రికన్ దేశాలతో పాటు పలు ప్రాంతాలకు ఎగుమతులు చేసేందుకు ఇది ఉపయోగపడగలదని ఆయన చెప్పారు. పతంజలి ఇటీవలే పిల్లలు .. పెద్దల డైపర్స్, చౌక శానిటరీ నాప్‌కిన్స్‌ను కూడా ప్రవేశపెట్టింది. సౌర విద్యుదుత్పత్తి పరికరాల తయారీలోకి కూడా అడుగుపెట్టనున్నట్లు ఇటీవలే ప్రకటించింది.

'స్వదేశీ'కి విదేశీ దన్ను!

- విదేశీ నిధుల వేటలో పతంజలి
- వాటాపై ఫ్రెంచ్ కంపెనీ ఎల్‌వీఎంహెచ్ ఆసక్తి
- రూ.3,000 కోట్లకుపైగా పెట్టుబడుల యోచన



న్యూఢిల్లీ: స్వదేశీ నినాదంతో బహుళజాతి ఎఫ్ఎంసీజీ సంస్థలకు సవాల్ విసురుతున్న బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద్... ఇప్పుడు మరింత బలపడేందుకు విదేశీ నిధుల వేటలో తలమునకలైంది. పలు వెంచర్ ఫండ్స్‌తో చర్చలు ప్రారంభించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థ రూ.10,500 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. ''ప్రపంచంలోనే అతి పెద్ద ఈక్విటీ ఫండ్స్‌తో సమావేశాలు నిర్వహించాం. గత కొన్ని నెలల్లో 12కు పైగా వెంచర్ క్యాపిటలిస్టులతో భేటీ అయ్యాం'' అని పతంజలి ప్రతినిధి ఎస్‌కే తిజర్వాలా తెలిపారు.

కలసి పనిచేసేందుకు సిద్ధం...

పతంజలితో కలసి పనిచేయడానికి ఇష్టమేనని ఫ్రాన్స్‌కు చెందిన ఎల్‌వీఎంహెచ్ ప్రకటించింది. అయితే, విదేశీ నిధులతో, బహుళజాతి సంస్థలతో పతంజలి కలసి పనిచేయకపోవచ్చని ఎల్‌క్యాటరన్ ఏషియా ఎండీ రవితక్రన్ చెప్పారు. ఎల్‌క్యాటరన్ ఈక్విటీ ఫండ్‌కు ఎల్‌వీఎంహెచ్ సహ యజమాని. 500 మిలియన్ డాలర్లతో (రూ.3,250 కోట్లు) పతంజలిలో వాటా తీసుకునేందుకు ఆసక్తితో ఉంది. పతంజలి ప్రస్తుత విలువ 5 బిలియన్ డాలర్లు (రూ.32.500 కోట్లు) ఉంటుందని తక్రన్ పేర్కొన్నారు.

రుణాలే తీసుకుంటాం

''నాగ్‌పూర్, గ్రేటర్ నోయిడా, అసోం, చండీగఢ్, ఏపీ, తెలంగాణ, హర్యానా, రాజస్తాన్‌లో ప్లాంట్ల ఏర్పాటుకు, ఔషధ, సుగంధ మొక్కల పెంపకానికి తక్షణమే రూ.5,000 కోట్ల నిధుల అవసరం ఉంది. బ్యాంకుల నుంచి రుణాలు పొందగలం. కానీ, బ్యాంకుల కంటే తక్కువ రేటుకు భారత కరెన్సీ రూపంలో నిధుల కోసం అన్వేషిస్తున్నాం. ఎవరికీ కంపెనీలో వాటాలిచ్చే ఉద్దేశం లేదు. ఈక్విటీ లేదా షేర్ల రూపంలో నిధులను అంగీకరించం.''


– ఆచార్య బాలకృష్ణ
పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ సీఈవో

మొబిక్విక్‌లో బజాజ్ ఫైనాన్స్‌కి 13 శాతం వాటా

న్యూఢిల్లీ: మొబైల్ వాలెట్ కంపెనీ మొబిక్విక్‌లో 12.60 శాతం వాటాలు కొనుగోలు చేయనున్నట్లు బజాజ్ ఫైనాన్స్ వెల్లడించింది. నిజానికి రూ. 225 కోట్లతో 10.83 శాతం వాటా కొనుగోలు చేసేందుకు గతేడాది ఆగస్టులో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ.. తాజాగా వాటా పరిమాణం కొంత పెరిగిందని, కన్వర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్ల కన్వర్షన్ ధర మారటమే ఇందుకు కారణమని బజాజ్ ఫైనాన్స్ తెలియజేసింది. ఇందుకోసం గతంలో అంగీకరించిన మొత్తమే తప్ప .. కొత్తగా మరింత పెట్టుబడేమీ పెట్టలేదని కంపెనీ తెలిపింది. ఒప్పందం ప్రకారం మొబిక్విక్‌కి చెందిన 10 ఈక్విటీ షేర్లను, 2,71,050 కంపల్సరీ కన్వర్టిబుల్ ప్రిఫరెన్స్ షేర్లను (సీసీసీపీఎస్) బజాజ్ ఫైనాన్స్ కొనుగోలు చేయనుంది. బీఎస్‌ఈలో మంగళవారం బజాజ్ ఫైనాన్స్ షేరు 3 శాతం క్షీణించి రూ.1,688 వద్ద క్లోజయ్యింది.

ఎయిర్‌టెల్‌లో వాటాలు అమ్మేసిన మెరిల్ లించ్

విలువ రూ.1,931 కోట్లు



న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్‌లో మెరిల్‌లించ్ తనకున్న వాటాల్లో సింహ భాగాన్ని విక్రయించేసింది. ఎయిర్‌టెల్‌లో మెరిల్‌లించ్‌కు డిసెంబర్ త్రైమాసికం ముగిసే నాటికి 5.09 కోట్ల షేర్లుండగా, వీటిలో 3.87 కోట్ల షేర్లను మంగళవారం సగటున ఒక్కో షేరును రూ.499.1 చొప్పున విక్రయించింది. ఇది 0.97 శాతం వాటాకు సమానం. ఈ షేర్లను ఎస్‌ఆర్‌ఎస్ పార్ట్‌నర్స్ (కేమాన్) ఎల్ఎల్‌సీ కొనుగోలు చేసింది. ఈ లావాదేవీ విలువ రూ.1,931.23 కోట్లు. బీఎస్‌ఈలో ఎయిర్‌టెల్ షేరు క్రితం ముగింపుతో పోలిస్తే 1.43 శాతం నష్టంతో రూ.496.90 వద్ద ముగిసింది.

ఎగుమతులు రయ్..

డిసెంబర్‌లో 12.36 శాతం అప్

- ఇంజనీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల ఊతం
- మూడేళ్ల గరిష్టానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: ఇంజనీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల ఊతంతో డిసెంబర్‌లో ఎగుమతులు 12.36 శాతం మేర వృద్ధి చెందాయి. విలువపరంగా 27.03 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే, ముడిచమురు, పసిడి దిగుమతులు భారీగా పెరగడంతో ఇంపోర్ట్ బిల్లు సైతం 21.12 శాతం ఎగిసి రూ. 41.91 బిలియన్ డాలర్లకు పెరిగింది. దీంతో వాణిజ్య లోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) మూడేళ్ల గరిష్ట స్థాయికి చేరింది. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం వార్షిక ప్రాతిపదికన చూస్తే డిసెంబర్‌లో 41 శాతం ఎగిసి 14.88 బిలియన్ డాలర్లకు చేరింది. 'గతేడాది అక్టోబర్లో 1.1 శాతం తగ్గుదల మినహా.. 2016 ఆగస్టు నుంచి 2017 డిసెంబర్ దాకా ఎగుమతుల ధోరణి సానుకూలంగానే నమోదవుతూ వస్తోంది' అని కేంద్రం పేర్కొంది. ఎగుమతులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభు.. మైక్రోబ్లాగింగ్ సైటు ట్విటర్‌లో పేర్కొన్నారు. ఎగుమతులు.. గతేడాది నవంబర్‌లో 26.19 బిలియన్ డాలర్లు కాగా, 2016 డిసెంబర్‌లో 24.05 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.



300 బిలియన్ డాలర్ల మైలురాయి దాటతాం: ఎఫ్ఐఈవో

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల వ్యవధిలోనే 224 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించినట్లు ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో ప్రెసిడెంట్ గణేశ్‌కుమార్ గుప్తా తెలిపారు. 2018లో అంతర్జాతీయ వాణిజ్య వృద్ధి మెరుగ్గా ఉండనున్న నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం 300 బిలియన్ డాలర్ల మైలురాయిని సులభంగా దాటేయగలమని ధీమా వ్యక్తం చేశారు. 2015-16లో మొత్తం ఎగుమతులు 262 బిలియన్ డాలర్లు కాగా, 2016-17లో 275 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వాణిజ్య లోటు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో.. దిగుమతులు దేశీయంగా ఉత్పత్తికి తోడ్పడేవేనా లేక సవాలుగా మారే అవకాశముందా అన్న అంశాన్ని పరిశీలించాలని గుప్తా పేర్కొన్నారు. మరోవైపు, పన్ను విభాగం అధికారుల మొండివైఖరి, అవగాహన లేమి కారణంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రీఫండ్ పొందటంలో ఎగుమతిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ఇక వివిధ ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతుల తీరుతెన్నులు ఇలా ఉన్నాయి.

- మొత్తం 30 ప్రధాన ఉత్పత్తుల్లో 21 ఉత్పత్తుల ఎగుమతులు వృద్ధి నమోదు చేశాయి. ఇంజనీరింగ్, పెట్రోలియం, సేంద్రియ.. నిరింద్రియ రసాయనాలు, వజ్రాభరణాలు, ఔషధాలు వీటిలో ఉన్నాయి.
- ఇంజనీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల వృద్ధి 25 శాతం.
- రెడీమేడ్ దుస్తుల ఎగుమతులు 8 శాతం క్షీణించి 1.33 బిలియన్ డాలర్లకు పరిమితం అయ్యాయి.
- పసిడి దిగుమతులు 71.5 శాతం ఎగిసి 3.39 బిలియన్ డాలర్లుగా నమోదు. 2016 డిసెంబర్‌లో ఈ పరిమాణం 1.97 బిలియన్ డాలర్లే.
- పెట్రోలియం ఉత్పత్తులు, ముడిచమురు దిగుమతులు 35% పెరిగి 7.66 బిలియన్ డాలర్ల నుంచి 10.34 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ఏప్రిల్-డిసెంబర్ మధ్య తొమ్మిది నెలలకాలంలో ఎగుమతులు 12 శాతం వృద్ధి చెంది 223.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు సుమారు 22 శాతం పెరిగి 338.37 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 114.85 బిలియన్ డాలర్లకు చేరింది.

జేఎల్ఆర్ నుంచి ఎవోక్ ల్యాండ్‌మార్క్ 2018 ఎడిషన్

ధర రూ. 50 లక్షలు



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీ దిగ్గజం జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా తాజాగా తమ రేంజ్ రోవర్ ఎవోక్ ల్యాండ్‌మార్క్ 2018 ఎడిషన్ ప్రత్యేక మోడల్‌ను ఆవిష్కరించింది. ఈ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం (ఎస్‌యూవీ) ధర రూ. 50.20 లక్షలు (ఎక్స్ షోరూం). వైఫై హాట్‌స్పాట్, కీ లెస్ ఎంట్రీ మొదలైన ఫీచర్లు ఇందులో ఉన్నాయి. కేవలం తొమ్మిది సెకన్లలో ఇది గంటకు వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. దీని టాప్ స్పీడ్ గంటకు 195 కిలోమీటర్లు.

మరో 1.20 లక్షల కంపెనీల రద్దు!

రిజిస్ట్రేషన్ తొలగించాలని కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ: నల్లధనంపై పోరులో భాగంగా మరో 1.20 లక్షల కంపెనీల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే 2.26 లక్షల కంపెనీల గుర్తింపును రద్దు చేయడంతో పాటు వీటితో అనుబంధం కలిగిన 3.09 లక్షల మంది డైరెక్టర్లను అనర్హులుగా ప్రకటించింది. ఇవి చాలా కాలంగా ఎటువంటి కార్యకలాపాలు లేకుండా, నిబంధనలను పాటించకుండా ఉండటంతో ఈ చర్య తీసుకుంది. తాజా సమీక్షా సమావేశంలో భాగంగా నిబంధనలను పాటించని 1.2 లక్షల కంపెనీలను రికార్డుల నుంచి తొలగించాలని నిర్ణయం తీసుకుంది. ఈ కంపెనీలపై వేగంగా చర్యలు తీసుకోవాలని సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి పి.పి.చౌదరి అధికారులను ఆదేశించారు. కాగా, జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాల మేరకు అవసరమైన నిబంధనలను అమలు చేసిన 128 కంపెనీల రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించడం జరిగింది'' అని కార్పొరేట్ వ్యవహారాల శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

జియోకు సొంత క్రిప్టోకరెన్సీ?

బిట్ కాయిన్ తరహాలో జియోకాయిన్‌పై కసరత్తు

- 50 మంది యువ ప్రొఫెషనల్స్‌తో టీమ్
- ముకేశ్ అంబానీ తనయుడు ఆకాశ్ సారథ్యం..!

న్యూఢిల్లీ: బిట్‌కాయిన్, ఎథీరియం, రిపుల్ వంటి క్రిప్టోకరెన్సీలకు ఇటీవలి కాలంలో డిమాండ్ బాగా పెరిగిన నేపథ్యంలో బడా కంపెనీలు వర్చువల్ కరెన్సీ విభాగంలోకి దిగుతున్నాయి. తమ కస్టమర్ల కోసం బిట్‌కాయిన్‌లాంటి సొంత కరెన్సీని రూపొందించే పనిలో పడ్డాయి. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో, ఫోటోగ్రఫీ ఉత్పత్తుల సంస్థ కొడాక్ వంటి కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. చౌక టారిఫ్‌లతో దేశీ టెలికం రంగంలో సంచలనం సృష్టించిన రిలయన్స్ జియో... ప్రస్తుతం జియోకాయిన్ రూపకల్పనపై కసరత్తు చేస్తోంది. జియోకాయిన్ ప్రాజెక్టుకు స్వయంగా రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ తనయుడు ఆకాశ్ అంబానీ సారథ్యం వహిస్తుండటం గమనార్హం. కాంట్రాక్టులు, సరఫరా మొదలైన కార్యకలాపాల నిర్వహణ కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారిత అప్లికేషన్స్‌ను రూపొందించడం జియోకాయిన్ ప్రాజెక్టు లక్ష్యం. పనిలో పనిగా బ్లాక్‌చెయిన్ ఆధారిత జియోకాయిన్లను కూడా రూపొందించడంపై ఇది దృష్టి పెట్టనుంది. ఇందుకోసం ఆకాశ్ అంబానీ సారథ్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటవుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ప్రాజెక్టు కోసం సగటు పాతికేళ్ల వయసున్న యాభై మంది నిపుణులను తీసుకోవాలని కంపెనీ యోచిస్తోంది. వీరంతా ఆకాశ్ అంబానీ సారథ్యంలో వివిధ బ్లాక్‌చెయిన్ సాధనాలపై పనిచేస్తారు.

బ్యాంకులు వంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రెండు వర్గాలు తక్కువ వ్యయాలతో ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించుకునేందుకు ఈ బ్లాక్‌చెయిన్ అప్లికేషన్స్ ఉపయోగపడతాయి. ఆర్థికపరమైన చెల్లింపులకు సంబంధించి బిట్‌కాయిన్ మొదలైన కరెన్సీలన్నీ ఇదే ప్రాతిపదికన రూపొందినవే.



ఇదే కోవలో తమ కస్టమర్లకు లాయల్టీ పాయింట్స్ లాంటివి జియోకాయిన్‌ల రూపంలో అందించే అవకాశాలు ఉన్నట్లు పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి.

ఐవోటీలోకి కూడా జియో...: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) విభాగంలోకి కూడా ప్రవేశించాలని రిలయన్స్ జియో యోచిస్తోంది. ఇందుకు కూడా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఉపయోగపడనుంది. స్మార్ట్‌ఫోన్లు, వేరబుల్ డివైజ్‌లు, గృహోపకరణాలు మొదలైన వాటన్నింటినీ ఒక నెట్‌వర్క్ కింద ఇంటర్నెట్ ద్వారా అనుసంధానం చేసే టెక్నాలజీని ఐవోటీగా వ్యవహరిస్తారు. ఈ టెక్నాలజీతో ఇవన్నీ పరస్పరం డేటాను ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా సందర్భానుసారంగా స్పందిస్తుంటాయి. ఐవోటీలో ఉండే భద్రతాపరమైన రిస్కులకు చెక్ చెప్పేందుకు కూడా బ్లాక్‌చెయిన్ ఉపయోగపడగలదని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి. ఓవైపు కంపెనీలు కూడా సొంతంగా క్రిప్టోకరెన్సీలను రూపొందించుకోవడంలో నిమగ్నమవుతుండగా.. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం వర్చువల్ కరెన్సీలకు చట్టబద్ధత లేదని, వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తోంది.

ఫొటోగ్రాఫర్లకు కొడాక్ కాయిన్..

ఫొటోగ్రాఫర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఫొటోగ్రఫీ ఉత్పత్తుల సంస్థ కొడాక్ కూడా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారిత సాధనాలపై పనిచేస్తోంది. ఫొటో గ్రాఫర్లు తమ వర్క్ కాపీరైట్ చౌర్యానికి గురికాకుండా.. రిజిస్టర్ చేసుకునేందుకు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ ఎక్స్ఛేంజీని రూపొందిస్తోంది. సదరు వర్క్‌ను ఉపయోగించుకోదల్చుకునే వారు సురక్షితంగా క్రిప్టోకరెన్సీ కొడాక్ కాయిన్‌ల రూపంలో చెల్లింపులు జరిపేలా ఈ మాధ్యమాన్ని తీర్చిదిద్దుతోంది. ఇందుకోసం వెన్ డిజిటల్ అనే సంస్థతో కలిసి పనిచేస్తోంది. సొంత క్రిప్టోకరెన్సీని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ఐపీవో తరహాలో ఈ నెలాఖర్లో ఐసీవో (ఇనీషియల్ కాయిన్ ఆఫరింగ్) కూడా ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	రూ.1,720 (కనిష్టం)	రూ.3,600	3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	రూ.3,330 (గరిష్టం)					

గాలి నుంచి నీరు

వాటర్‌జెన్‌తో టాటా ప్రాజెక్ట్స్ ఎంవోయూ


హైదరాబాద్: గాలి నుంచి నీటిని వెలికి తీసేందుకు ఇజ్రాయెల్‌కు చెందిన వాటర్‌జెన్‌తో టాటా ప్రాజెక్ట్స్ ఎంవోయూ కుదుర్చుకుంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భారత పర్యటనలో భాగంగా ఇది చోటు చేసుకుంది. దేశ ప్రజల నీటి అవసరాలు, సురక్షిత, స్వచ్ఛమైన, తక్కువ ఖర్చుకు నీటిని అందించేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందని టాటా ప్రాజెక్ట్స్ తెలిపింది. ఇది ఉద్యోగాల కల్పనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడుతుందని టాటా ప్రాజెక్ట్స్ పేర్కొంది.

45% తగ్గిన ఎంసీఎక్స్ లాభం

న్యూఢిల్లీ: మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఎంసీఎక్స్) నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 45 శాతం తగ్గింది. గత క్యూ3లో రూ.34 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.19 కోట్లకు తగ్గినట్లు ఎంసీఎక్స్ తెలిపింది. బులియన్ సెగ్మెంట్లో వాల్యూమ్స్ తక్కువగా ఉండడమే దీనికి కారణమని పేర్కొంది. నికర ఆదాయం రూ.100 కోట్ల నుంచి రూ.77 కోట్లకు తగ్గిందని తెలిపింది.

బ్యాంక్ షేర్లు బేర్

- 72 పాయింట్ల నష్టంతో 34,771కు సెన్సెక్స్
- 41 పాయింట్ల పతనంతో 10,700కు నిఫ్టీ



వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో రికార్డ్ స్థాయిలో ముగిసిన స్టాక్ సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. వాణిజ్య లోటు మూడేళ్ల గరిష్ట స్థాయికి చేరడం, రూపాయి మూడు వారాల కనిష్టానికి బలహీనపడడం, ప్రభుత్వ రంగ బ్యాంక్‌లపై ప్రతికూల ప్రభావం చూపేలా ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ వ్యాఖ్యలు చేయడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఇక వీటికి తోడు బాండ్ ఈల్డ్స్ పెరగడంతో బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. ముడిచమురు ధరలు ఎగియటంతో పాటు గరిష్ట స్థాయిల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ప్రధానంగా మిడ్‌క్యాప్ షేర్లు నష్టపోయాయి. ఇండెక్స్‌లు చూస్తే బీఎస్ఈ సెన్సెక్స్ 72 పాయింట్లు నష్టపోయి 34,771 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 41 పాయింట్లు క్షీణించి 10,700 పాయింట్ల వద్ద ముగిశాయి. అయితే ఈ ఏడాది భారత ఐటీ సర్వీసులు టర్న్ అరౌండ్ కాగలవని మోర్గాన్ స్టాన్లీ తన తాజా నివేదికలో పేర్కొనడంతో ఐటీ షేర్లు –విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 5 శాతం వరకూ పెరిగాయి.

ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల వడ్డీరేట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ విరాళ్ అచార్య వ్యాఖ్యానించారు. బ్యాంక్‌లకు ఈ క్యూ3లో రూ.15,000–25,000 కోట్ల రేంజ్‌లో ట్రెజరీ నష్టాలు రావచ్చన్న అంచనాలు కూడా జత కావడంతో ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు 5 శాతం వరకూ నష్టపోయాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,663
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	38,604
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	5,98,316
ఎఫ్ఐఐ	693
డీఐఐ	246

సోమవారం జీవిత కాల గరిష్ట స్థాయికి సూచీలు...

సోమవారం స్టాక్ సూచీలు ఇంట్రాడేలోనూ, ముగింపులోనూ రికార్డ్ స్థాయిల్లో ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 34,964 పాయింట్లు, నిఫ్టీ 10,783 పాయింట్ల జీవిత కాల గరిష్ట స్థాయిలను తాకాయి. ముగింపులో సెన్సెక్స్ 34,844 పాయింట్ల వద్ద, నిఫ్టీ 10,742 పాయింట్ల ఆల్‌టైమ్ హైల వద్ద ముగిశాయి.

ప్రకటనల మార్కెట్‌కు స్మార్ట్‌ఫోన్ల దన్ను

ముంబై: దేశ ప్రకటనల మార్కెట్‌కు స్మార్ట్‌ఫోన్ల వినియోగం కలిసిరానుంది. పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో డిజిటల్ ప్రకటనలపై వెచ్చించే ఆదాయం పెరుగుతోందని, దీంతో 2020 నాటికి ప్రకటనల మార్కెట్ రూ.77,623 కోట్లకు చేరుతుందని 'డెంట్సు ఏజిస్ నెట్‌వర్క్–ఈ4ఎం' సంస్థ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం దేశ ప్రకటనల మార్కెట్ రూ.55,960 కోట్ల స్థాయిలో ఉంది. 2020 నాటికి వార్షికంగా 32 శాతం చొప్పున వృద్ధి చెందుతుందనేది డెంట్సు అంచనా. ప్రకటనల రంగంలో డిజిటల్ వాటా వేగంగా పెరుగుతోందని, 2020 నాటికి మొత్తం మార్కెట్లో 24 శాతానికి చేరుతుందని తెలిపింది.

మూడు నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ: ఆహార పదార్థాల రేట్లు తగ్గటంతో డిసెంబర్‌లో టోకుధరల ఆధారిత ద్రవ్యోల్బణం కొంత తగ్గింది. గత నెల టోకు ధరల ఆధారిత సూచీ (డబ్ల్యూపీఐ) ప్రకారం ద్రవ్యోల్బణం 3.58 శాతంగా నమోదైంది. ఇది మూడు నెలల కనిష్టం. గత నవంబర్‌లో ఇది 3.93 శాతం. మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. నవంబర్‌లో 6.06 శాతంగా ఉన్న ఆహారపదార్థాల రేట్ల పెరుగుదల డిసెంబర్‌లో 4.72 శాతానికి తగ్గింది. ఇక ఇంధనం, విద్యుత్ విభాగం పెరుగుదల 8.82 శాతం నుంచి 9.16 శాతానికి చేరింది. ఉల్లి ధరలు మాత్రం ఏకంగా 197 శాతం ఎగిశాయి. ఆహారపదార్థాల సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు.. ఆహార ద్రవ్యోల్బణం మరింతగా తగ్గేందుకు ఉపయోగపడగలదని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ పేర్కొంది. వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను పటిష్టపర్చేందుకు బడ్జెట్‌లో నిర్దిష్ట చర్యలు ఉండగలవని ఆశిస్తున్నట్లు ఫిక్కీ ప్రెసిడెంట్ రశేష్ షా చెప్పారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 7న పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించే అంశాన్ని పరిశీలించాలని, తద్వారా పెట్టుబడులు.. వృద్ధికి ఊతమిచ్చేలా చర్యలు తీసుకోవాలని ఫిక్కీ కోరింది.

ఎగుమతి, దిగుమతి వ్యయాల తగ్గింపుపై దృష్టి

న్యూఢిల్లీ: ఎగుమతులు, దిగుమతులు, దేశీయ రవాణా వ్యయాలు తగ్గించేందుకు వీలుగా ఓ సమగ్ర ప్రణాళిక రూపొందించే పని జరుగుతున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖా తెలిపింది. ఇందుకు వీలుగా ఓ పోర్టల్‌ను కూడా తీసుకురానున్నట్లు పేర్కొంది. ప్రక్రియలను సులభంగా మార్చడం, ఐటీ వినియోగం, మౌలిక సదుపాయాలను పెంచడం ద్వారా సరుకు రవాణాను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంపై ఈ కార్యాచరణ ప్రణాళిక దృష్టి పెడుతుందని తెలిపింది. దిగుమతులు, ఎగుమతుల వేగం లాజిస్టిక్స్ సమర్థతపైనే ఆధారపడి ఉంటుందని కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్ ప్రభు అన్నారు.

'నెట్ వర్క్ 18' ఆదాయం రూ.439 కోట్లు

న్యూఢిల్లీ: నెట్‌వర్క్18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.11.43 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో రూ.78 కోట్ల నికర నష్టాలు వచ్చాయని నెట్‌వర్క్18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.353 కోట్ల నుంచి రూ.439 కోట్లకు పెరిగినట్లు సంస్థ చైర్మన్ అదిల్ జైనుల్‌భాయ్ చెప్పారు.

కార్గో బ్రీఫ్స్...

లైకోస్: డైనమిక్ కంటెంట్ ప్లాట్‌ఫామ్ కోసం డిజిటల్, మొబైల్ కంటెంట్ సేవల్లో ఉన్న ఫ్లోరిడా కంపెనీ టిన్‌బుతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. యూజర్ ఎక్స్‌పీరియెన్స్ మెరుగై కస్టమర్లు తమ వెబ్‌సైట్లో ఎక్కువ సమయం గడుపుతారని, అలాగే మళ్లీమళ్లీ పోర్టల్‌కు వస్తారని కంపెనీ తెలిపింది.

బోధ్‌ట్రీ: మగధ్ యూనివర్సిటీ నుంచి రూ.43 కోట్లు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసర్చ్ ఎడ్యుకేషన్ నుంచి రూ.8.39 కోట్ల కాంట్రాక్టు దక్కించుకుంది.

ఉద్యోగాలే కాదు... స్థలాల్లోనూ కోతే!

- 32 శాతానికి పడ్డ ఐటీ ఆఫీస్ స్థలాల లావాదేవీలు
- 42 మిలియన్ చ.అ.లకు చేరిన దేశీ ఆఫీస్ స్పేస్
- సీబీఆర్ఈ నివేదిక వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కంపెనీలు ఉద్యోగులను తొలగించటం మాత్రమే కాకుండా... స్థలాల విషయంలోనూ కోతలు విధించాయి. 2017లో దేశంలోని మొత్తం కార్యాలయాల లావాదేవీల్లో ఐటీ రంగం వాటా తగ్గడమే ఇందుకు నిదర్శనం. 2016లో మొత్తం క్రయవిక్రయాలు జరిగిన కార్యాలయ స్థలాల్లో ఐటీ రంగం వాటా 49 శాతం కాగా... 2017లో ఇది 32 శాతానికి పడిపోయినట్లు ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ సీబీఆర్ఈ తెలియజేసింది. 'భారతదేశం: కార్యాలయాల స్థల లావాదేవీలు' పేరిట కంపెనీ విడుదల చేసిన నివేదికలో పలు కీలకాంశాలను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం... 2016లో 2 శాతంగా ఉన్న కో–వర్కింగ్ స్పేస్ (బిజినెస్ సెంటర్స్) రంగం అనూహ్యంగా 2017లో 6 శాతానికి పెరిగింది. 2017లో ఈ రంగం మొత్తం 2.6 మిలియన్ చ.అ. స్థలాన్ని ఆక్రమించింది. బీఎఫ్ఎస్ఐ రంగం 13 శాతం నుంచి 19 శాతానికి, ఇంజనీరింగ్ అండ్ తయారీ రంగం 14 శాతం నుంచి 17 శాతానికి పెరిగింది.

కొత్త ఆఫీస్ స్పేస్ 18 శాతం డౌన్..

దేశంలో ఆఫీసు స్థలాల లావాదేవీలు వరుసగా మూడో ఏడాది 40 మిలియన్ చ.అ.లను దాటాయి. 2017లో మొత్తం 42 మిలియన్ల చ.అ. లావాదేవీలు జరగ్గా.. ఇందులో 50 శాతం వాటాను బెంగళూరు, ఢిల్లీ– ఎన్‌సీఆర్ నగరాలే ఆక్రమించేశాయి. అయితే కొత్త కార్యాలయాల సప్లయి మాత్రం 2016తో పోలిస్తే 18 శాతం తగ్గి 29 మిలియన్ చ.అ.లకు చేరింది. 2017లో జరిగిన మొత్తం లావాదేవీల్లో 50 వేల చ.అ.ల కంటే తక్కువ లావాదేవీలే 90 శాతం వాటాను ఆక్రమించాయి.

ఫెడరల్ బ్యాంక్ లాభం 26% అప్

ముంబై: ఫెడరల్ బ్యాంక్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 26 శాతం పెరిగింది. గత క్యూ3లో రూ.206 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.260 కోట్లకు పెరిగినట్లు బ్యాంక్ తెలిపింది. కోర్ ఆదాయం పెరగడం, మొండి బకాయిలు తగ్గడంతో ఈ స్థాయి నికర లాభం సాధ్యమైందని బ్యాంక్ ఎండీ శ్యామ్ శ్రీనివాసన్ చెప్పారు. నికర రుణాలు 22 శాతం పెరగడంతో నికర వడ్డీ ఆదాయం రూ.950 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎమ్) 3.33 శాతంగా ఉందన్నారు. గత క్యూ3లో రూ.275 కోట్లుగా ఉన్న వడ్డీయేతర ఆదాయం ఈ క్యూ3లో రూ.230 కోట్లకు తగ్గిందన్నారు. మొత్తం ఆదాయం మాత్రం రూ.2,557 కోట్ల నుంచి రూ.2,730 కోట్లకు పెరిగింది. ఈ క్యూ3లో రూ.411 కోట్ల తాజా మొండి బకాయిలున్నప్పటికీ, స్థూల మొండి బకాయిలు 2.77 శాతం నుంచి 2.52 శాతానికి, నికర మొండి బకాయిలు 1.58 శాతం నుంచి 1.36 శాతానికి తగ్గాయని తెలిపారు. బీఎస్ఈలో ఫెడరల్ బ్యాంక్ షేర్ 8 శాతం నష్టంతో రూ.105 వద్ద ముగిసింది.

ఐసీఐసీఐ లాంబార్డ్ లాభం రూ.232 కోట్లు



న్యూఢిల్లీ: ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.232 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత క్యూ3లో వచ్చిన నికర ఆదాయం రూ.220 కోట్లతో పోలిస్తే 5 శాతం వృద్ధి సాధించామని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.1,843 కోట్ల నుంచి రూ.2,020 కోట్లకు పెరిగినట్లు కంపెనీ సీఈఓ భార్గవ్ దాస్‌గుప్తా తెలిపారు. స్థూల ప్రీమియం రూ.2,542 కోట్ల నుంచి రూ.3,002 కోట్లకు పెరిగిందని, పంటల బీమా ఆదాయం రూ.91 కోట్ల నుంచి రూ.87 కోట్లకు తగ్గిందని చెప్పారాయన. గత క్యూ3లో 2.01 రెట్లుగా ఉన్న సాల్వెన్సీ రేషియో ఈ క్యూ3లో 2.21 రెట్లకు మెరుగుపడిందని తెలియజేశారు. పన్ను కేటాయింపులు రూ.5 కోట్ల నుంచి రూ.91 కోట్లకు పెరిగాయన్నారు. అంతకు ముందటి సంవత్సరాలకు సంబంధించిన పన్నులకు ఈ క్వార్టర్‌లోనూ, ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల కాలంలోనూ అధిక కేటాయింపులు జరపాల్సి వచ్చిందని వెల్లడించారు. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్ఈలో ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ షేర్ ఇంట్రాడేలో 6 శాతం లాభపడింది. చివరకు 4 శాతం లాభంతో రూ.812 వద్ద ముగిసింది.

బోర్డ్ మీటింగ్స్

హిందుస్థాన్ యూనీలీవర్, జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్, డీసీబీ బ్యాంక్, జ్యోతి ల్యాబ్స్, జుబిలంట్ లైఫ్ సైన్సెస్, మైండ్ ట్రీ, టాటా స్పాంజ్ ఐరన్, శ్రేయీ ఇన్‌ఫ్రా, స్టెరిలైట్ టెక్నాలజీస్, కిర్లోస్కర్ న్యూమాటిక్ కంపెనీ, తిరుమలై కెమికల్స్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	30,210
బంగారం (99.5, 10గ్రా)	30,060
వెండి (కిలో)	38,890
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	28,820
వెండి (కిలో)	42,400
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	30,850
బంగారం (22 క్యారెట్లు)	28,850
వెండి(కిలో)	42,500
ప్రొద్దుటూరు (మంగళవారం సెలవు, శనివారం ధరలు)	
బంగారం (24 క్యారెట్లు)	30,500
బంగారం (22 క్యారెట్లు)	28,270
వెండి(కిలో)	39,900
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	31,470
బంగారం (22 క్యారెట్లు)	28,850
వెండి(కిలో)	38,500
విజయవాడ (మంగళవారం సెలవు, శనివారం ధరలు)	
బంగారం (24 క్యారెట్లు)	30,750
బంగారం (22 క్యారెట్లు)	28,500
వెండి(కిలో)	39,900
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	31,160
బంగారం (22 క్యారెట్లు)	28,820
వెండి(కిలో)	40,300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	శుక్రవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	63.82	$64.30
బ్రెంట్	69.21	$70.26

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 17-1-2018

విశాఖ	410–00
చిత్తూరు	398–00
వరంగల్	404–00
ముంబై	447–00
చెన్నై	405–00
విజయవాడ	410–00
గోదావరి	410–00
నమక్కల్	395–00
16–1–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	402–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.60
బెంగళూరు	405–00
ఢిల్లీ	425–00
కోల్‌కతా	460–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	423.55	420.6
AMBUJA C	277.85	276.95
ASIAN PA	1188.75	1204.05
AXIS BAN	563.2	560.55
BAJAJ AU	3160.05	3166
BAJAJ FI	1687.35	1738.15
BHARTI A	497.25	504.5

A B C D

20 MICRO	57.7	59.7
3M INDIA	17756.25	17943.35
5PAISA C	338.95	354.1
63 MOONS	112.75	116.6
8K MILES	833.3	864
AARTI DR	746.5	754.4
AARTI IN	1125.15	1125.25
AARVI EN	109	107
ABAN OFF	258.55	262.95
ABBOTT I	5400.05	5382.95
BASF IND	2207.95	2260.2
BATA IND	727.6	746.15
BAYER CR	4626.5	4700
BEARDSEL	67.05	65.7
BEML LIM	1531.75	1575.5
BERGER P	260.95	264.8
BETA DRU	188	195
BF INVES	368.8	387.75
BF UTILI	523	561.85
BGR ENER	143.55	150.95
BHAGERIA	290.2	300.25
BHANSALI	199.1	209.1
BHARAT B	1411.05	1377.3
DILIP BU	933.4	944.4
DISH TV	72.4	78.2
DISHMAN	361.65	347.1
DIXON TE	3703.65	3797.5
DOLLAR I	465.05	484.6
DOLPHIN	137.7	141.3
DR. LAL	914.7	912.15
DUCON IN	51.15	53.8
DYNAMATI	2012	2070.1

E F G H

ECE INDU	378.4	385.25
GUJARAT	158.3	167.4
GUJARAT	215.75	219
GUJARAT	261.2	272.8
GUJARAT	883.2	895.5
GUJARAT	907.15	897
GUJARAT	891.1	919.1
GULF OIL	894.55	929.55
GULSHAN	89.8	93
HARITA S	1014.25	1052.5
HATSUN A	875.25	870.6
HCL INFO	59.25	60.55
HDFC BAN	1920	1857.8
HDFC STA	482.65	474.85

I J K L

JINDAL P	399.55	414.9
JINDAL S	116.8	122.05
JINDAL S	169.35	175.15
JINDAL S	215.55	224.75
JINDAL S	270.7	267.3
JINDAL W	582.3	581.15
JK CEMEN	1139.35	1124.95
JK LAKSH	448.3	438.45
JK PAPER	156.4	158.7
JK TYRE	173.75	177.1
JKUMAR I	326.5	340.3
JM FINAN	163.7	168.55
JMC PROJ	642.05	645.85

M N O P

MANPASAN	460.8	462.2
MANUGRAP	55.3	58.05
MARATHON	608.2	626.5
MAS FINA	623.3	637.35
MASTEK L	414.8	419.15
MATRIMON	930.65	958.5
MAWANA S	74.35	77.4
MAX FINA	559.35	556.8
MAX INDI	121.75	121.6
MAX VENT	87.8	92.85
MAYUR UN	533.6	556
MAZDA LI	490.85	510.55
MCLEOD R	187.2	194.45
PHILIPS	1340.7	1431.25
PI INDUS	993.95	981.3
PIONEER	206.65	216.85
PLASTIBL	243.5	258
PNB HOUS	1282.15	1319.2
PNC INFR	187.8	193.55
PODDAR H	1271.05	1326.45
PODDAR P	317.85	336.45
POKARNA	231.75	249.9
POLY MED	274	277.7
POLYPLEX	558.2	575.45
PONNIE S	178.1	181.45
POWER ME	878.7	902.6

R S T U

SHANKARA	1751.15	1816.15
SHANTHI	162.95	167.15
SHARDA C	453.25	455.85
SHARDA M	2589.85	2655.65
SHEELA F	1630.9	1683.65
SHEMAROO	458.75	467.25
SHILPA M	594.05	606.4
SHIPPING	93.15	96
SHIRPUR	183.7	186.65
SHIVA TE	600.5	609.25
SHIVAM A	93.1	95.9
SHOPPERS	525.55	536
SHRADHA	70	70
THE INDI	195.4	201.4
THE MAND	168.05	175.6
THE NEW	611.9	620.25
THE P K	583.35	530.35
THE PHOE	599.6	616.75
THE RAMC	786	784.7
THE RUBY	397.25	421.25
THE TINP	296.65	313.85
THEJO EN	561	535.65
THEMIS M	612.45	628.75
THERMAX	1304.35	1292.1
THIRU AR	56.6	57.95
THIRUMAL	2159.9	2276.2

V W Y Z

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

బీఎస్ఈ ఎస్ఎంఈ, ఎస్ఎస్ షేర్లు

సాక్షి స్పోర్ట్స్
బుధవారం 17-1-2018



క్వాలిఫయింగ్‌లోనే కశ్యప్ అవుట్

బ్యాడ్మింటన్ సీజన్ తొలి టోర్నమెంట్ మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో మొదటిరోజు భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. భారత అగ్రశ్రేణి ఆటగాడు పారుపల్లి కశ్యప్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందడంలో విఫలమయ్యాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో కశ్యప్ 14-21, 17-21తో కాంతపోన్ వాంగ్‌చరోయిన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా ద్వయం తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. తొలి రౌండ్‌లో సిక్కి-ప్రణవ్ జోడీ 18-21, 17-21తో ఏడో సీడ్ లీ చున్ హె రెగినాల్డ్-చౌ హోయ్ వా (హాంకాంగ్) జంట చేతిలో పరాజయం పాలైంది.


మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అనుకూల్ రాయ్

క్వార్టర్స్‌లో భారత్

అండర్-19 ప్రపంచకప్

మౌంట్ మాంగనీ: వరుసగా రెండో విజయంతో భారత జట్టు అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పసికూన పపువా న్యూ గినియాతో మంగళవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. భారత కెప్టెన్ పృథ్వీ షా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన పపువా న్యూ గినియా జట్టు భారత బౌలర్ల ధాటికి 21.5 ఓవర్లలో కేవలం 64 పరుగులకే కుప్పకూలింది. ఒవియా సామ్ (15), సిమోన్ అతాయ్ (13), సినక అరువా (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. నలుగురు బ్యాట్స్‌మెన్ డకౌట్ అయ్యారు. భారత స్పిన్నర్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అనుకూల్ రాయ్ 14 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం భారత్ 8 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 67 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ పృథ్వీ షా (36 బంతుల్లో 57 నాటౌట్; 12 ఫోర్లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ చేయగా... మన్‌జ్యోత్ కాల్రా (9 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. భారత్ తమ తదుపరి మ్యాచ్ ఈనెల 19న జింబాబ్వేతో ఆడుతుంది.



స్నేహిత్ @ 24

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) అండర్-18 బాలుర సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ యువ సంచలనం సూరావజ్జుల స్నేహిత్ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఇటీవలే ఇటలీలో జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన స్నేహిత్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఫలితంగా తాజా ర్యాంకింగ్స్‌లో అతను ఏకంగా 40 స్థానాలు ఎగబాకి 24వ ర్యాంక్‌ను అందుకున్నాడు. సింగిల్స్‌లో భారత్ నుంచి రెండో అత్యుత్తమ ర్యాంకర్ స్నేహిత్ కావడం విశేషం. గుజరాత్ ప్లేయర్ మానవ్ ఠక్కర్ రెండో ర్యాంక్‌లో నిలిచి భారత నంబర్‌వన్‌గా ఉన్నాడు. గత ఆరు నెలలుగా అంతర్జాతీయస్థాయిలో స్నేహిత్ జోరు కొనసాగిస్తున్నాడు. గతేడాది జోర్డాన్ ఓపెన్‌లో స్వర్ణం, రజతం నెగ్గిన 17 ఏళ్ల స్నేహిత్... స్లొవేనియా, ఇండియా ఓపెన్ టోర్నీలలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించాడు.

పోరాటమా... పరాజయమా!

భారత్ విజయలక్ష్యం 287 • ప్రస్తుతం 35/3

విజయ్, రాహుల్, కోహ్లి అవుట్ • చెలరేగుతున్న దక్షిణాఫ్రికా పేసర్లు

లక్ష్యం సుదూరంలో ఉంది... విజయ తీరం చేర్చగల సామర్థ్యం ఉన్నవారిలో ముగ్గురు ఇప్పటికే బ్యాట్లు పడేశారు... ఒక బంతి ఛాతీ మీదకు దూసుకొస్తుంటే మరో బంతి అసలు పైకి లేవనంటూ పాదాల వైపు వచ్చి స్టార్ బ్యాట్స్‌మన్‌తోనే లుంగీ డ్యాన్స్ చేయించింది... బంతి బంతికీ సంకటం... ఒక్కో పరుగు కోసం ఒక యుద్ధమే చేయాల్సి వస్తోంది... ఇదీ సెంచూరియన్ టెస్టులో నాలుగో రోజు ఆట ముగిసేసరికి భారత్ పరిస్థితి! మన బౌలర్ల అద్భుత ప్రదర్శన గత మ్యాచ్‌లాగే ఈ టెస్టులోనూ గెలుపు అవకాశాన్ని సృష్టిస్తే ఎంతో నమ్ముకున్న బ్యాటింగ్ వైఫల్యంతో మళ్లీ తొలి టెస్టు ఫలితమే పునరావృతమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. 23 ఓవర్లు ఆడితే వచ్చింది 35 పరుగులే... ఇంకా చేయాల్సింది 252 పరుగులు... ఓర్పునకు చిరునామాలాంటి పుజారా ఒకవైపు... శరీరంపై పడుతున్న పేసర్ల దెబ్బలను ఓర్చుకుంటూ పార్థివ్ మరోవైపు ప్రస్తుతం పోరాడుతున్నారు. వీరితో పాటు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఏదైనా మెరుపు బ్యాటింగ్‌తో మ్యాజిక్ చేయగలరా? లేక సఫారీ పేస్ చతుష్టయం దెబ్బకు కూలిపోయి మ్యాచ్‌ను, సిరీస్‌ను అప్పగిస్తారా అనేది నేటి చివరి రోజు ఆటలో చూడాలి.

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో విజయావకాశాన్ని సృష్టించుకున్న భారత జట్టు... బ్యాట్స్‌మెన్ పేలవ ఆటతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. 287 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ మంగళవారం ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 35 పరుగులు చేసింది. పుజారా (40 బంతుల్లో 11 బ్యాటింగ్; ఒక ఫోర్), పార్థివ్ పటేల్ (24 బంతుల్లో 5 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉండగా... మురళీ విజయ్ (9), లోకేశ్ రాహుల్ (4), కెప్టెన్ విరాట్ కోహ్లి (5) పెవిలియన్ చేరారు. ఇక్కడి సూపర్ స్పోర్ట్స్ పార్క్‌లో ఛేదనలో వివిధ జట్ల రికార్డు, ప్రస్తుతం టీమిండియా పరిస్థితి, దక్షిణాఫ్రికా పదునైన బౌలింగ్ చూస్తుంటే ఒక్క రోజులో 252 పరుగులు చేసి గెలవడం కష్టసాధ్యంగా అనిపిస్తోంది! అలా కాకుండా 98 ఓవర్లు ఆడి 'డ్రా' చేయడం కూడా అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో చివరి రోజు భారత జట్టు ఎలాంటి వ్యూహం అనుసరిస్తుందనేది ఆసక్తికరం. అంతకుముందు దక్షిణాఫ్రికా తమ రెండో ఇన్నింగ్స్‌లో 258 పరుగులకు ఆలౌటైంది. డివిలియర్స్ (121 బంతుల్లో 80; 10 ఫోర్లు), డీన్ ఎల్గర్ (121 బంతుల్లో 61; 8 ఫోర్లు, 1 సిక్స్) నాలుగో వికెట్‌కు 141 పరుగులు జోడించి ఆదుకున్నారు. చివర్లో డు ప్లెసిస్ (141 బంతుల్లో 48; 4 ఫోర్లు) ఆ జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. భారత బౌలర్లలో షమీకి 4... బుమ్రాకు 3 వికెట్లు దక్కాయి.

దక్షిణాఫ్రికా గడ్డపై ఏ జట్టు కూడా టెస్టు చివరి రోజు 250కు పైగా పరుగులు చేసి మ్యాచ్ గెలవలేదు. ఎప్పుడో 1900లో ఇంగ్లండ్ 214 పరుగులు చేసింది.

షమీ జోరు...

ఓవర్‌నైట్ స్కోరు 90/2తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన దక్షిణాఫ్రికా తొలి సెషన్‌లో చకచకా పరుగులు సాధించింది. డివిలియర్స్, ఎల్గర్ కలిసి బౌలర్లకు అవకాశం ఇవ్వకుండా దూసుకుపోవడంతో పార్ట్‌నర్‌షిప్ వంద పరుగులు దాటింది. ఈ క్రమంలో ఎల్గర్ 93 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఈ సమయంలో షమీ వేసిన ఏడు ఓవర్ల స్పెల్ సఫారీలకు అడ్డుకట్ట వేసింది. అనూహ్యంగా పైకి లేచిన బంతిని ఆడలేక డివిలియర్స్ కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. మరో ఏడు పరుగులకే పుల్ షాట్ ఆడబోయి ఎల్గర్ కూడా డీప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. షమీ వేసిన తర్వాతి ఓవర్లో డి కాక్ (12) ఆడిన మూడు వరుస బంతులు అదృష్టవశాత్తూ స్లిప్ మీదుగా బౌండరీకి వెళ్లాయి. కానీ నాలుగో బంతి నేరుగా పార్థివ్ చేతుల్లోకి వెళ్లడంతో 19 పరుగుల వ్యవధిలో దక్షిణాఫ్రికా మూడు కీలక వికెట్లు కోల్పోయినట్లయింది. లంచ్ తర్వాత ఫిలాండర్ (26) కొద్దిసేపు డు ప్లెసిస్‌కు అండగా నిలిచాడు. దాంతో స్కోరు 200 పరుగులు దాటింది. ఈ స్థితిలో ఇషాంత్ తన వరుస ఓవర్లలో ఫిలాండర్, కేశవ్ మహరాజ్ (6)లను వెనక్కి పంపాడు. షమీ బౌలింగ్‌లో రబడ (4) అవుట్ కాగా... బుమ్రా అద్భుతమైన రిటర్న్ క్యాచ్‌తో ప్లెసిస్ పెవిలియన్ చేరాడు. ఇన్‌గిడి (1)ని అవుట్ చేసి అశ్విన్ దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగించాడు.

పదునైన బౌలింగ్...

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌కు ఏదీ కలిసి రాలేదు. నలుగురు దక్షిణాఫ్రికా పేసర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో చెలరేగుతుంటే ఒక్కో పరుగు తీయడానికి మన బ్యాట్స్‌మెన్ తీవ్రంగా శ్రమించారు. ఈ ఒత్తిడి చివరకు వికెట్లు కోల్పోయేలా చేసింది. రబడ అద్భుత బంతిని విజయ్ (9) వికెట్లపైకి ఆడుకోగా... ఇన్‌గిడి వేసిన బాల్‌ను రాహుల్ (4) నేరుగా ఫీల్డర్ చేతుల్లోకి కొట్టాడు. అయితే భారత్‌కు అసలు షాక్ ఆ తర్వాత తగిలింది. ఆఫ్‌స్టంప్‌పై పడి తక్కువ బౌన్స్‌తో లోపలికి దూసుకొచ్చిన బంతిని ఆడలేక కోహ్లి వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ అవుట్ నిర్ణయంపై అతి ఆశావాదంతో కోహ్లి రివ్యూ చేసినా లాభం లేకపోయింది. ఐదో స్థానంలో రోహిత్ శర్మకు బదులుగా పార్థివ్ క్రీజ్‌లోకి వచ్చాడు. సఫారీ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు చాలా ఇబ్బంది పడినా, పట్టుదల ప్రదర్శించాడు. పుజారా 8 పరుగుల వద్ద ఉన్నప్పుడు బంతి బ్యాట్‌ను తాకి కీపర్ చేతుల్లో పడినా... దక్షిణాఫ్రికా దానిని గుర్తించకపోవడంతో అతను బతికిపోయాడు. చివరకు పుజారా, పార్థివ్ 7 ఓవర్ల పాటు జాగ్రత్తగా ఆడి రోజును ముగించగలిగారు.


కోహ్లిని అవుట్ చేసిన ఇన్‌గిడిని అభినందిస్తున్న దక్షిణాఫ్రికా ఆటగాళ్లు


డీఆర్ఎస్ నిర్ణయం కోసం వేచిచూస్తున్న కోహ్లి

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 335; భారత్ తొలి ఇన్నింగ్స్ 307; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (ఎల్బీ) (బి) బుమ్రా 1; ఎల్గర్ (సి) రాహుల్ (బి) షమీ 61; ఆమ్లా (ఎల్బీ) (బి) బుమ్రా 1; డివిలియర్స్ (సి) పార్థివ్ (బి) షమీ 80; డు ప్లెసిస్ (సి అండ్ బి) బుమ్రా 48; డి కాక్ (సి) పార్థివ్ (బి) షమీ 12; ఫిలాండర్ (సి) విజయ్ (బి) ఇషాంత్ 26; మహరాజ్ (సి) పార్థివ్ (బి) ఇషాంత్ 6; రబడ (సి) కోహ్లి (బి) షమీ 4; మోర్కెల్ (నాటౌట్) 10; ఇన్‌గిడి (సి) విజయ్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (91.3 ఓవర్లలో ఆలౌట్) 258.**

వికెట్ల పతనం: 1-1; 2-3; 3-144; 4-151; 5-163; 6-209; 7-215; 8-245; 9-245; 10-258.

బౌలింగ్: అశ్విన్ 29.3-6-78-1; బుమ్రా 20-3-70-3; ఇషాంత్ 17-3-40-2; షమీ 16-3-49-4; పాండ్యా 9-1-14-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబడ 9; రాహుల్ (సి) మహరాజ్ (బి) ఇన్‌గిడి 4; పుజారా (బ్యాటింగ్) 11; కోహ్లి (ఎల్బీ) (బి) ఇన్‌గిడి 5; పార్థివ్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (23 ఓవర్లలో 3 వికెట్లకు) 35.**

వికెట్ల పతనం: 1-11; 2-16; 3-26.

బౌలింగ్: ఫిలాండర్ 6-3-6-0; రబడ 5-2-9-1; ఇన్‌గిడి 6-2-14-2; మోర్కెల్ 5-3-4-0; మహరాజ్ 1-0-1-0.

సిరీస్ నుంచి సాహా అవుట్



భారత వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా కండరాల గాయంతో దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. గాయం కారణంగానే రెండో టెస్టులో అతని స్థానంలో పార్థివ్ పటేల్ తుది జట్టులోకి వచ్చాడు. ఇప్పుడు సాహా మూడో టెస్టు కూడా ఆడే అవకాశం లేదని తేలిపోయింది. అతని స్థానంలో మరో వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్‌ను బీసీసీఐ జట్టులోకి ఎంపిక చేసింది. ఇప్పటికే సఫారీలతో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపికైన కార్తీక్... రెండు వారాల ముందుగా దక్షిణాఫ్రికా బయల్దేరి వెళ్ళనున్నాడు. భారత్ తరఫున టెస్టు మ్యాచ్ బరిలోకి దిగి కార్తీక్‌కు సరిగ్గా ఎనిమిదేళ్లయింది! 23 టెస్టుల్లో 1000 పరుగులు చేసిన అతను 51 క్యాచ్‌లు పట్టి 5 స్టంపింగ్‌లు చేశాడు.

తాము గెలవగలమని నమ్మాలి

సునీల్ గావస్కర్

మా జట్టుకు మ్యాచ్‌పై పట్టు చిక్కిందని అటు బ్యాట్స్‌మెన్, ఇటు బౌలర్లు ఎవరూ గట్టిగా చెప్పలేని విధంగా ఈ టెస్టు మ్యాచ్ సాగుతోంది. ఒక్కో సందర్భంలో అంటే కోహ్లి, డివిలియర్స్‌లు బ్యాటింగ్ చేస్తున్నప్పుడు మాత్రం వారి జట్లకు అంతా బాగున్నట్లు అనిపించింది కానీ నిజానికి ఈ పిచ్ అందరి అంచనాలను తారుమారు చేసింది. దక్షిణాఫ్రికా స్కోరుకు చేరువగా వచ్చేందుకు కోహ్లి అద్భుత సెంచరీ ఉపకరించింది. సాంకేతికత, పట్టుదల, డిఫెన్స్, చక్కటి స్ట్రోక్‌లు కలగలిసిన నాణ్యమైన శతకంగా దీనిని అందరూ గుర్తుంచుకోవచ్చు. నిజానికి అప్పటి వరకు చాలా బాగా బ్యాటింగ్ చేసిన అశ్విన్ కొత్త బంతిని వెంటాడే ప్రయత్నం చేయకుండా ఉంటే భారత్‌కు కచ్చితంగా ఆధిక్యం లభించి ఉండేది. తన బౌలింగ్ ప్రతీ రోజూ ముందు రోజుకంటే మెరుగ్గా ఉండేందుకు అశ్విన్ ఎంతో మేధోమథనం చేస్తాడు. అందులో కొంత బ్యాటింగ్‌పై కూడా పెడితే చాలా ఎక్కువ పరుగులు సాధించగలడు. ఆఫ్‌స్టంప్‌పైకి ఎక్కువ ఎత్తులో దూసుకొచ్చిన బంతిని షాట్ ఆడబోయి అతను ఎన్ని సార్లు అవుటయ్యాడు? తన కెరీర్‌లో అతను వెస్టిండీస్‌పై నాలుగు సెంచరీలు చేసినా... వారిలో ఎవరూ ప్రమాదకర స్వింగ్ బౌలర్ లేడు. తాను అవుటైన సందర్భాలను అతను విశ్లేషించుకుంటే బౌలర్ ప్రతిభకంటే తన పొరపాట్లే ఎక్కువగా కనిపిస్తాయి.

కోహ్లి, పాండ్యా చక్కటి ఆటతో మూడో రోజు ఆట ప్రారంభమైంది. కానీ పాండ్యా రనౌట్ దక్షిణాఫ్రికాకు బోనస్ వికెట్ అందించింది. పరుగు పూర్తి చేసే సమయంలో బ్యాట్‌ను క్రీజ్ వైపు తోయకపోవడం లేదా ఇద్దరు ఫీల్డర్లు ఒకే క్యాచ్ పట్టే ప్రయత్నం చేసినప్పుడు కనీసం అరవకపోవడంలాంటివి అంతర్జాతీయ క్రికెట్‌లో అసలు కనిపించరాదు. కానీ భారత జట్టు మాత్రం పదే పదే ఇలా చేస్తోంది. కుర్రాళ్లుగా ఉన్నప్పుడు వారిని తీర్చి దిద్దడంలో జరిగిన పొరపాటుగా నేను దీనిని భావిస్తాను. ముంబైలో స్కూల్ క్రికెట్ స్థాయిలోనే ఇలాంటివి నేర్పిస్తారు. అందువల్ల వారు సాధారణంగా ఇలాంటి తప్పులు చేయరు.

తాము ఈ టెస్టు గెలవగలమని భారత్ నమ్మాలి. పిచ్‌పై బంతి ఒక్కోసారి పైకి లేస్తూ మరోసారి చాలా కిందకు వస్తోంది. ఆమ్లా, డివిలియర్స్ అవుటైన తీరు చూస్తే ఇది అర్థమవుతుంది. కాబట్టి లక్ష్య ఛేదన అంత సులువు కాదు. అయితే తమ కెప్టెన్‌లాగే ఇతర ఆటగాళ్లు కూడా విజయం సాధ్యమేనని భావిస్తే నిజంగా సాధించగలరు. ఇప్పటి వరకు ఈ టెస్టు అంచనాలకు అందకుండానే సాగుతోంది. అటు బ్యాట్, ఇటు బంతి ఆధిపత్యం ప్రదర్శించకుండా సిద్ధం చేసిన పిచ్ మాత్రమే దీనికి కారణమని చెప్పగలను.

జూన్‌లో భారత్‌తో అఫ్గానిస్తాన్ టెస్టు మ్యాచ్

న్యూఢిల్లీ: గతేడాది టెస్టు హోదా పొందిన అఫ్గానిస్తాన్ జట్టు టెస్టు అరంగేట్రం వేదిక, తేదీలు ఖరారయ్యాయి. భారత్‌తో ఈ ఏడాది జూన్ 14 నుంచి 18 వరకు బెంగళూరు వేదికగా ఈ ఏకైక టెస్టు జరగనుందని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరి ప్రకటించారు. భారత్‌లో జూన్ మాసంలో జరగనున్న తొలి టెస్టు ఇదే కానుండటం గమనార్హం. గతంలో పాకిస్తాన్, జింబాబ్వే, బంగ్లాదేశ్ జట్లు కూడా తమ తొలి టెస్టులు భారత్‌తోనే ఆడాయి. భారత్ డే నైట్ టెస్టు మ్యాచ్ ఆడే విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని అమితాబ్ తెలిపారు. ఇప్పటివరకు 8 జట్లు డే నైట్ టెస్టు మ్యాచ్‌లు ఆడాయి.


వీనస్


కోకో


స్లోన్ స్టీఫెన్స్

అమెరికా స్టార్స్‌కు షాక్

తొలి రౌండ్‌లోనే వీనస్, కోకో, స్లోన్ స్టీఫెన్స్ ఓటమి

మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ సంచలన ఫలితాలతో హోరెత్తింది. మహిళల సింగిల్స్‌లో గతేడాది రన్నరప్, ఐదో సీడ్ వీనస్ విలియమ్స్ (అమెరికా), పదో సీడ్ కోకో వాండెవె (అమెరికా), 13వ సీడ్, గతేడాది యూఎస్ ఓపెన్ చాంపియన్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా), 11వ సీడ్ మ్లాడెనోవిచ్ (ఫ్రాన్స్) తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. తొలి రౌండ్‌లో వీనస్ 3-6, 5-7తో బెన్సిచ్ (స్విట్జర్లాండ్) చేతిలో... కోకో 6-7 (4/7), 2-6తో బాబోస్ (హంగేరి) చేతిలో... స్లోన్ స్టీఫెన్స్ 6-2, 6-7 (2/7), 2-6తో షుయె జాంగ్ (చైనా) చేతిలో... మ్లాడెనోవిచ్ 3-6, 2-6తో బొగ్డాన్ (రొమేనియా) చేతిలో ఓడిపోయారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ హలెప్ (రొమేనియా) 7-6 (7/5), 6-1తో ఐఅవా (ఆస్ట్రేలియా)పై, మూడో సీడ్ ముగురుజా (స్పెయిన్) 6-4, 6-3తో పొంచెట్ (ఫ్రాన్స్)పై, షరపోవా (రష్యా) 6-1, 6-4తో మరియా (జర్మనీ)పై గెలిచి రెండో రౌండ్‌లోకి చేరారు.

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), మాజీ చాంపియన్స్ నాదల్ (స్పెయిన్), జొకోవిచ్ (సెర్బియా) రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. తొలి రౌండ్‌లో టాప్ సీడ్ నాదల్ 6-1, 6-1, 6-1తో బర్గోస్ (డొమినికన్ రిపబ్లిక్)పై, రెండో సీడ్ ఫెడరర్ 6-3, 6-4, 6-3తో బెడెన్ (స్లొవేనియా)పై, 14వ సీడ్ జొకోవిచ్ 6-1, 6-2, 6-4తో యంగ్ (అమెరికా)పై గెలిచారు. అయితే ఎనిమిదో సీడ్ జాక్ సోక్ (అమెరికా), 11వ సీడ్ అండర్సన్ (దక్షిణాఫ్రికా), 16వ సీడ్ ఇస్నెర్ (అమెరికా) కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. సుగిటా (జపాన్) 6-1, 7-6 (7/4), 5-7, 6-3తో జాక్ సాక్‌పై... ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) 6-4, 3-6, 6-3, 6-3తో ఇస్నెర్‌పై, ఎడ్మండ్ (బ్రిటన్) 6-7 (4/7), 6-3, 3-6, 6-3, 6-4తో అండర్సన్‌పై నెగ్గారు. భారత ప్లేయర్ యూకీ బాంబ్రీ 6-7 (4/7), 4-6, 3-6తో బగ్దాటిస్ (సైప్రస్) చేతిలో ఓడిపోయాడు.


గ్రాండ్‌హోమ్

కివీస్‌ను గెలిపించిన గ్రాండ్‌హోమ్

హామిల్టన్: న్యూజిలాండ్ విజయాల పరంపర కొనసాగుతోంది. పాకిస్తాన్‌తో జరిగిన నాలుగో వన్డేలోనూ న్యూజిలాండ్ విజయం సాధించింది. గ్రాండ్‌హోమ్ (40 బంతుల్లో 74 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపులు మెరిపించి కివీస్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (54; 7 ఫోర్లు, ఒక సిక్స్), హారీస్ సోహైల్ (50; 4 ఫోర్లు, ఒక సిక్స్), హఫీజ్ (81; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), సర్ఫరాజ్ అహ్మద్ (51; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. అనంతరం న్యూజిలాండ్ 45.5 ఓవర్లలో 263 పరుగులు చేసి ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. 154 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి కష్టాలో పడిన కివీస్‌ను గ్రాండ్‌హోమ్, నికోల్స్ (52 నాటౌట్; 3 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు అజేయంగా 109 పరుగులు జోడించి కివీస్ విజయాన్ని ఖాయం చేశారు. సిరీస్‌లో చివరిదైన ఐదో వన్డే ఈనెల 19న జరుగుతుంది.



కోహ్లిపై ఐసీసీ చర్య

మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా

సెంచూరియన్: భారత కెప్టెన్ విరాట్ కోహ్లిపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) క్రమశిక్షణా చర్య తీసుకుంది. మ్యాచ్ మూడో రోజు అతని ప్రవర్తన క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉండటంతో కోహ్లి మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానాతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్‌ను కూడా అతని ఖాతాలో వేసినట్లు ఐసీసీ ప్రకటించింది. సోమవారం దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 25వ ఓవర్లో ఈ ఘటన చోటు చేసుకుంది. వర్షం అనంతరం అవుట్‌ఫీల్డ్ ఇంకా తడిగా ఉండటంతో బంతి ఆకారం దెబ్బ తిందని అంపైర్ మైకేల్ గాఫ్‌కు కోహ్లి పదే పదే ఫిర్యాదు చేశాడు. అయితే అంపైర్లు బంతిని మార్చేందుకు అంగీకరించలేదు. దాంతో అతను బంతిని బలంగా నేలకేసి కొట్టాడు. వెలుతురులేమి కారణంతో ఆటను ముందుగా ముగించడం కూడా కోహ్లి అసంతృప్తికి కారణమైంది. దాంతో వెంటనే అతను రిఫరీ క్రిస్ బ్రాడ్ గదికి కూడా వెళ్లి దానిని ప్రదర్శించాడు. రిఫరీతో కూడా అతను వాగ్వాదం జరపడం వీడియో లో స్పష్టంగా కనిపించింది. ఆటగాళ్ల క్రమశిక్షణకు సంబంధించి డీ మెరిట్ పాయింట్ల విధానం అమల్లోకి వచ్చాక కోహ్లి తొలిసారి చర్యకు గురయ్యాడు.

పుస్తక పఠనం.. ప్రగతికి సోపానం

- రేపటి నుంచి 28 వరకు జాతీయ పుస్తక మహోత్సవం
- ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరనున్న 31వ ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: 31వ జాతీయ పుస్తక ప్రదర్శన ఈ నెల 18 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరనుంది. ఇందులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరొందిన పుస్తక సంస్థలు పాల్గొననున్నాయి. ఈ ఏడాది 333 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 50కి పైగా జాతీయ స్థాయి పబ్లిషర్స్, 25 పిల్లల పుస్తక సంస్థలు పాల్గొననున్నాయి. బాలల సాహిత్యం, ఆధ్యాత్మికం, వ్యక్తిత్వ వికాసం తదితర రంగాలకు చెందిన పుస్తకాలతో పాటు, చరిత్ర, సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్ర, గ్రంథాలపై పాఠకులు ఎంతో మక్కువ చూపుతున్నారని హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ ప్రతినిధి కోయ చంద్రమోహన్ 'సాక్షి'తో చెప్పారు.



బుక్ ఫెయిర్‌కు సిద్ధమవుతున్న స్టాళ్లు

డాక్టర్ సినారె వేదిక, వట్టికోట ప్రాంగణం

భరత నాట్యం, కూచిపూడి, స్టోరీ టెల్లింగ్ వంటి కార్యక్రమాలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన కళారూపాలను ప్రదర్శిస్తారు. 10 రోజుల పాటు పెద్ద సంఖ్యలో పుస్తక ఆవిష్కరణలు, ప్రత్యేక సదస్సులు ఉంటాయి. ఈ ఏడాది హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన వేదికకు డాక్టర్ సి.నారాయణరెడ్డి వేదికగా నామకరణం చేయనున్నారు. మొత్తం ప్రాంగణానికి వట్టికోట ఆళ్వార్ స్వామి పేరుపెట్టనున్నారు. పుస్తక ఆవిష్కరణలు, సదస్సులు జరిగే వేదికకు సామల సదాశివ సాహిత్య ప్రాంగణంగా, వేదికకు బోయ జంగయ్య వేదికగా నామకరణం చేయనున్నారు. ప్రదర్శనకు ఆహ్వానం పలికే రెండు స్వాగత తోరణాలకు ప్రముఖ రచయితలు, పాత్రికేయులు అయిన అలిశెట్టి ప్రభాకర్, అరుణ్‌సాగర్ పేరు పెట్టనున్నారు. ప్రధాన ద్వారానికి తొలి తెలుగు రచయిత్రి భండారు అచ్చమాంబ పేరు ఖరారు చేశారు. గురువారం ప్రారంభం కానున్న ఈ పుస్తక మహోత్సవానికి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

పిల్లల్లో పుస్తక పఠనాన్ని పెంచేందుకు స్టోరీ టెల్లింగ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు వంటివి నిర్వహిస్తున్నారు. కొత్తగా 'బుక్ హంట్'ను ఏర్పాటు చేయనున్నారు. పిల్లలకు రెండు పుస్తకాల పేర్లు చెబుతారు. వాటిని వెతికి ఇచ్చిన వారికి పుస్తక బహుమతులను అందిస్తారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2:30 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన కొనసాగుతుందని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ తెలిపారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు తమ స్కూల్ గుర్తింపు కార్డులు చూపించి ఉచితంగా ప్రదర్శనలో పాల్గొనవచ్చన్నారు. సాధారణ సందర్శకులు రూ.5 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు.

కార్టోశాట్-2 తీసిన ఛాయాచిత్రం...



కార్టోశాట్-2 సిరీస్ ఉపగ్రహం ఈ నెల 15న తీసిన ఛాయాచిత్రాన్ని మంగళవారం ఇస్రో విడుదల చేసింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లోని ఓ భాగాన్ని అత్యంత నాణ్యతతో కూడిన ఛాయాచిత్రాన్ని ఈ ఉపగ్రహం తీసింది.

– శ్రీహరికోట (సూళ్లూరుపేట)

జీవ వ్యర్థాల నిర్వహణకు కమిటీలు

సాక్షి, హైదరాబాద్: ఆస్పత్రుల్లోని జీవ వ్యర్థాలను ప్రమాణాల ప్రకారం నిర్వహించేందుకు జిల్లా స్థాయి కమిటీలను నియమిస్తూ వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మంగళ వారం ఉత్తర్వులు ఇచ్చారు. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీలో వైద్య, ఆరోగ్య, పురపాలక శాఖలతో పాటు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సభ్యులుగా ఉంటారన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.